ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 41 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ మంగళవారం 23 డిసెంబర్ 2025 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 41 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD TUE 23 DECEMBER 2025 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## మళ్లీ బీఆర్ఎస్ పార్టీలో
# చేరే చాన్సే లేదు

### రాష్ట్రంలో డైవర్షన్, కరప్షన్ పాలిటిక్స్
### వచ్చే ఎన్నికల నాటికి కొత్త పార్టీ పెడతా
### ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్ పెన్ పవర్:దిల్ తూట్ గయా.. ఘర్ వాపసీ ఉండదు(మనసు విరి గిపోయింది. మళ్లీ బీఆర్ఎస్ పార్టీలో చేరను) అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కుండబద్ద లు కొట్టారు. రాష్ట్రంలో డైవర్ష స్. కరప్షన్ పాలిటిక్స్ నడుస్తు జనం బాట కార్యక్రమంలో భాగంగా జోగులాంబ న్నాయని అన్నారు. జాగృత్తి గద్వాల జిల్లాలో రెండో రోజు ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ఎప్పుడు చూసినా సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఎడ్యుకేషన్, ఇరిగేషన్, డెవలప్మెంట్ మా పాలసీ అంటూ అంటూ గొప్పలు చె బుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కేవలం డ్రైవర్షన్ కరప్షన్ పాలిటిక్స్ మాత్రమే నడుస్తున్నాయని ఎద్దేవా చేశారు. టీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడే తనకు తన ఫ్యామిలీ మధ్య మేజర్ ఘటనలు జరిగాయన్నారు. తాను పార్టీలో ఉన్నప్పుడే తన భర్త ఫోన్ టాపింగ్ చేశారని, తీన్మార్ మల్లన్న తనపై అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడు పార్టీ నుంచి ఏ ఒక్కరూ మాట్లాడకపోవడంతో గుండె పగిలిపోయిందన్నారు.




దీంతో మళ్లీ పార్టీలో చేరే చాన్స్ ఏమాత్రం లేదన్నారు. ఎడ్యుకేషన్ లో జోగులాంబ గద్వాల జిల్లా అట్టడుగు స్థానంలో ఉందని దీనిపై ఇక్కడి పాలకులు స్పందించాలన్నారు. ఏమి అభివృద్ధి చేశారని రైజింగ్ తెలంగాణ వేడుకలు జరుపుకుంటు న్నారో ఒకసారి సీఎం రేవంత్ రెడ్డి ఆత్మ పరిశీ లన చేసుకోవాలన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి జాగృతి వైపు నుంచి పార్టీ పెడతాం..2029లో అసెంబ్లీ ఎన్నికలు వస్తాయని చెప్పారు. పేరు అదే ఉంటదా..? లేదా.? అనేది చెప్పలేమని అన్నారు. ఎన్నికలతో సంబంధం లేకుండా ప్రజల మధ్యే ఉంటామని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీయేతనను ఎంపీగా ఓడించిందని చెప్పారు. తాను వద్దంటే ఎమ్మెల్సీ పదవి ఇచ్చార ని అన్నారు. వాస్తవానికి తాను ఎంపీ అడిగానని చెప్పారు.

## సోనియా, రాహుల్ గాంధీలకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

- నేషనల్ హెరాల్డ్ కేసులో హైకోర్టు నోటీసులు
- ఈడీ ఛార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకోవడానికి ట్రయల్ కోర్టు నిరాకరణ
- ట్రయల్ కోర్టు తీర్పును ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసిన ఈడీ

వివరాలు 2లో..



## కర్ణాటకలో సీఎం మార్పును డిసైడ్ చేసేది ఆయనే



- కర్ణాటక నాయకత్వ మార్పుపై రాహుల్ గాంధీదే తుది నిర్ణయమని చెప్పిన సిద్ధరామయ్య
- అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటానని స్పష్టీకరణ
- సీఎం మార్పుపై పదేపదే ప్రశ్నిస్తున్న మీడియాపై అసహనం వ్యక్తం చేసిన సీఎం
- డీకే శివకుమార్‌తో రాజన్న భేటీని సమర్థించిన ముఖ్యమంత్రి

వివరాలు 2లో..



## తెలంగాణను వణికిస్తున్న చలి...

### పలుచోట్ల సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు!

- తెలంగాణను కమ్మేసిన తీవ్రమైన చలిగాలులు
- సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో అత్యల్పంగా 5 డిగ్రీల ఉష్ణోగ్రత
- 17 జిల్లాల్లో 10 డిగ్రీల కంటే తక్కువకు పడిపోయిన ఉష్ణోగ్రతలు
- ఏడు జిల్లాలకు భారత వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ
- హైదరాబాద్‌తో సహా పలు ప్రాంతాల్లో దట్టంగా కమ్ముకున్న పొగమంచు

వివరాలు 2లో..

## రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2025లో నేరాలు పెరిగాయి

- 2024తో పోలిస్తే పెరిగిన నేరాల సంఖ్య
- మహిళలపై 4 శాతం పెరిగిన నేరాలు
- సైబర్ నేరాలకు పాల్పడిన వారిపై 3,734 కేసులు నమోదు చేసినట్లు వెల్లడి

హైదరాబాద్ పెన్ పవర్: రాచకొండ పోలీస్ కమిషన రేట్ పరిధిలో 2025 సంవత్స రంలో నేరాలు పెరిగాయని సీపీ సుధీర్ బాబు వెల్లడిం చారు. 2024 సంవత్సరంతో పోలిస్తే

వివరాలు 2లో..




## ఉద్యోగాలు మా బాధ్యత కాదు... చేతులెత్తేసిన పాక్ ప్రభుత్వం!

- ఉద్యోగాల కల్పన ప్రభుత్వ బాధ్యత కాదు
- ఆ బాధ్యత ప్రైవేటు రంగందేనన్న పాక్ ఆర్థిక మంత్రి
- దేశంలో 80 లక్షల మందికి పైగా నిరుద్యోగులు
- ప్రభుత్వ వైఫల్యాలతో కుప్పకూలుతున్న పరిశ్రమలు
- పెట్టుబడులు లేక పారిశ్రామిక రంగం తీవ్ర సంక్షోభం

పెన్ పవర్ డెస్క్:పాకిస్థాన్‌లో తీవ్ర ఆర్థిక సంక్షోభం, పెరుగుతున్న నిరుద్యో గంపై ఆ దేశ ప్రభుత్వం కీలక వ్యాఖ్యలు చేసింది. ఉద్యో గాల కల్పన ప్రభుత్వ

వివరాలు 2లో..



## మాస్కోలో కారు బాంబు దాడి.. రష్యాకు చెందిన కీలక జనరల్ మృతి

- బాంబు దాడిలో మృతి చెందిన ఆపరేషనల్ అడిషనల్ ట్రైనింగ్ డైరెక్టర్ అధిపతి
- ఆయన కారు కింద అమర్చిన పరికరం పేలడంతో మృతి
- ఈ దాడి వెనుక ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ హస్తం ఉన్నట్లు అనుమానాలు

పెన్ పవర్ డెస్క్:మాస్కోలో జరిగిన కారు బాంబు దాడిలో కీలక రష్యా సైనిక జనరల్ ఒకరు మృతి

వివరాలు 2లో..



## తెలంగాణకు పరిశ్రమలు రావొద్దని కేసీఆర్ కుట్ర చేస్తున్నారు..

### పెట్టుబడులు వస్తుంటే అసూయ ఎందుకు.. : మంత్రి శ్రీధర్ బాబు



- పెట్టుబడులు రావొద్దన్నట్లుగా కేసీఆర్ మాట్లాడారు: మంత్రి శ్రీధర్ బాబు
- ఒప్పందాలను తక్కువ చేసి మాట్లాడారని విమర్శ
- అనుభవం కలిగిన నాయకుడిగా సూచనలు చేస్తారని భావించామన్న మంత్రి
- నిరుద్యోగులకు ఉద్యోగాలు రావొద్దని బీఆర్ఎస్ కోరుకుంటోందని ఆరోపణ


హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు రావొద్దన్నట్లుగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిన్న మాట్లాడారని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. ఇటీవల గ్లోబల్ సమ్మిట్‌లో జరిగిన ఒప్పందాలను మాజీ ముఖ్యమంత్రి తక్కువ చేసి మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుభవం కలిగిన నాయకుడిగా రాష్ట్ర అభివృద్ధికి ఆయన సూచనలు చేస్తారని తాము భావించామని, కానీ అందుకు భిన్నంగా పెట్టుబడులకు వ్యతిరేకంగా మాట్లాడారని విమర్శించారు.రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉద్యోగాలు రావొద్దని బీఆర్ఎస్ నాయకత్వం కోరుకుంటున్నట్లుగా ఉందని ఆరోపించారు. గ్లోబల్ సమ్మిట్ వేదికగా లక్షల కోట్ల రూపాయల ఎంవోయూలు కుదిరాయని ఆయన అన్నారు. ఒప్పందం చేసుకున్న

వివరాలు 2లో..

## ఈ అంశంలో జోక్యం చేసుకోలేం

- జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజనపై హైకోర్టు వ్యాఖ్యలు
- వార్డుల పునర్వ్యవస్థీకరణకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ల కొట్టివేత
- ఈ విషయంలో జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పిన హైకోర్టు
- డివిజన్ల సంఖ్యను 150 నుంచి 300కు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం

వివరాలు 2లో..





## ఛత్తీస్ గఢ్ సరిహద్దులో మావోయిస్టుల భారీ డంప్ ధ్వంసం

- మీనాగట్ట అడవుల్లో ఆయుధ తయారీ కేంద్రం
- ధ్వంసం చేసిన భద్రతా దళాలు
- భారీ ఎత్తున పేలుడు పదార్థాలు స్వాధీనం

పెన్ పవర్ డెస్క్:ఒడిశా-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టులు దాచి పెట్టిన భారీ ఆయుధ సామగ్రిని భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. మావోయిస్టుల కదలికలపై అందిన పక్కా సమాచారంతో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టిన జవాన్లు, మీనాగట్ట అడవుల్లో భూమిలో పాతిపెట్టిన పేలుడు పదార్థాలను మరియు ఆయుధాలను వెలికితీశారు.సరిహద్దు జిల్లాల్లోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు

వివరాలు 2లో..

## అదానీ, అంబానీల కోసమే ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేశారు

- జీ రామ్ జీ చట్టాన్ని తీసుకురావడంపై సీతక్క ఫైర్
- గాంధీ పేరు తీసేసి ఆయనను మరోసారి హత్య చేశారన్న సీతక్క
- పథకాన్ని కాపాడాలని అన్ని గ్రామాల్లో తీర్మానం చేస్తామని వెల్లడి



హైదరాబాద్ పెన్ పవర్:జాతీయ ఉపాధి హామీ చట్టం స్థానంలో వీబీ జీ రామ్ జీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకురావడంపై విపక్ష నేతలు విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా తెలంగాణ మంత్రి సీతక్క ఈ అంశంపై మాట్లాడుతూ...

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# కవితా కళానిధి బలిజేపల్లి

కాలం ఎదైనా, ప్రజల వినోదం కోసం అత్యధికంగా ఆదరింపబడిన కళ నాటకం. 20 వ దశ కారంభంలో ఒకరు నాటకీకరించిన కథనే స్వీకరించి పలువురు అనువదించ డం, అదే కథనే నాటకాలుగా రాయడం జరిగింది. నాటకాలలో పద్యాలకు, పాటలకు ప్రాధాన్యత అధికంగా ఇచ్చిన కాలమది. ఈ విధంగా పలు పలువురు రచయితలు అత్యధికంగా రాసి ప్రదర్శనలకు అవకాశం కల్పించిన నాటకం సత్య హరిశ్చంద్ర. అందునా బలిజేపల్లి లక్ష్మీకాంత కవి హరిశ్చంద్ర నాటకం మిగుల ప్రజాదరణ పొందింది.ఎందరో నాటక రచయితలకు సినిమా నిర్మాత దర్శకులకు స్ఫూర్తిని కలిగించిన లక్ష్మీకాంత కవి గురించి తెలియ పరిచే చిరు ప్రయత్నం ఇది.బలిజేపల్లి లక్ష్మీకాంతం లేదా లక్ష్మీకాంత కవి (డిసెంబరు 23, 1881 – జూన్ 30, 1953) స్వాతంత్ర్య సమరయోధులు, అవధాని, నాటక రచయిత, రంగస్థల, సినిమా నటులు."తిరమై సంపదలెల్ల వెంట నొకరీతిన్"...'మాయామేయ జగంబె నిత్యమని, సంభావించి'... 'చతురంభోధి పరీత భూధరణీ రక్షాదక్ష' ... సాగిరావు ఏరికిన్ ఏసరికి యేపాటు విధించెనో... "దళమౌ పయ్యేదలో నడం గియు...లాంటి హరిశ్చంద్ర నాటకంలోని పద్యాల మాధుర్యాన్ని ఒకసారైనా ఆస్వాదించని తెలుగు నాటక అభిమానులు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. ఇవి అన్నీ బలిజేపల్లి లక్ష్మీకాంత కవి విరచిత 'సత్య హరిశ్చంద్రీయము' నాటకం లోనివే. భారతీయ భాషల్లో 'హరిశ్చంద్ర' నాటకానికి ఒక ప్రత్యేక స్థానముంది. మూకీ యుగంలో నాలుగు సార్లు, టాకీ యుగంలో ఇరవై సార్లు వెండి తెర కెక్కిన ఒకే ఒక కథ ఇది. 1913లో చలనచిత్ర పితామహుడు దాదా సాహెబ్ ఫాల్కే 'రాజా హరిశ్చంద్ర' సినిమాను పూర్తిస్థాయి మూకీ చిత్రంగా మరాఠీలో నిర్మిం చిన తరవాత అదే కథను 'సత్య వాది రాజా హరిశ్చంద్ర' పేరుతో మరాఠీలోనే 1917లో లఘు చిత్రంగా నిర్మించారు. ఇదే మూల కథను 'సత్యవాది రాజా హరిశ్చంద్ర' పేరుతోనే రుస్తుంజీ ధోతీవాలా కూడా బెంగాలీ భాషలో నిర్మిం చాడు. తెలుగులో 1935లో ఒకసారి 1956లో మరొక సారి 1965లో చివరి సారి హరిశ్చంద్ర సినిమా వచ్చింది. ఇన్నిసార్లు ఇదే కథను సినిమాగా మలచడానికి కారణం... ఆ నాటికే ముందే ఆ నాటకం ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేయడమే. ఆ నాటక కర్త కవితా కళానిధి బలిజేపల్లి కావడం తెలుగు వాళ్లకు గర్వకారణం. ఆ నాటకంలోని పద్యాలు, సంభాష ణలు నాడు వెలుగు వారి నోళ్లలో నిరంతరం నానుతునే ఉండేవి.1935లో తెలుగు తొలిటాకీ చిత్రం 'భక్త ప్రహ్లాద' నిర్మించిన స్టార్ ఫిలిం కార్పొరేషన్ సంస్థ 'హరిశ్చంద్ర' సినిమాను తెలుగులో నిర్మించి నప్పుడు బలిజేపల్లి నాటకాన్ని స్ఫూర్తిగా తీసుకోవడం గమనార్హం. ఆ చిత్రానికి మాటలు, పాటలు, పద్యాలు బలిజేపల్లి కవే సమ కూర్చడం విశేషం.1936లో అదే ఈస్ట్ ఇండియా కంపెనీ వారు సి. పుల్లయ్య దర్శకత్వంలో 'సతీ అనసూయ', 'ధృవ విజయము' జంట సినిమా లను నిర్మించారు. ఈ చిత్రాల నిర్మాణం కలకత్తాలోనే జరిగింది. ఈ చిత్రాలకు కథ, మాటలు, పాటలు, పద్యాలు రాసేందుకు బలిజేపల్లిని చిత్తజల్లు పుల్లయ్య కలకత్తాకు ఆహ్వానించారు. తెలుగులో వచ్చిన తొలిబాలల చిత్రం ధృవ విజయం కావడం విశేషం.1938లో జయా ఫిలిమ్స్ సంస్థ చిత్రపు నరసింహారావు దర్శకత్వంలో తొలి చిత్రంగా 'కృష్ణ జరాసంధ' సినిమాను నిర్మించింది. వేలూరి శివరామశాస్త్రి రచించిన కథకు బలిజేపల్లి పాటలు, పద్యా లు సమకూర్చారు. 1939లో జగదీశ్ ఫిలిమ్స్, అధినేత వై.వి.రావు (యరగుడిపాటి వరద రావు) దర్శకత్వంలో 'మళ్ళీ పెళ్లి' అనే సాంఘిక చిత్రాన్ని నిర్మించారు. ఆ చిత్రానికి మాటలు, పాటలు బలిజేపల్లి రాశారు. 1921-23 ప్రాంతాల్లో కాళ్ళకూరి నారాయణ రావు వరకట్న పిశాచిని నిరసిస్తూ 'వరవిక్రయం' అనే నాటకాన్ని రచించారు. ఆ నాటకానికి బలిజేపల్లి మాటల తోబాటు అందుకు అవసరమైన పాటలు కూడా రచించి మంచి స్క్రిప్టును తయారు చేశారు. పుల్లయ్య కోరికమీద అందులో బలిజేపల్లి పిసినిగొట్టు భూస్వామి 'సింగరాజు లింగరాజు' పాత్రను పోషించారు.1940లో బలిజేపల్లి ఎ.వి.ఎం వారు నిర్మించిన 'భూకైలాస్', న్యూటన్ స్టూడియో తరపున వై.వి.రావు నిర్మాణ దర్శకత్వంలో వచ్చిన 'విశ్వమోహిని' సినిమాలకు సంభాషణలు సమకూర్చారు. శ్రీజగదీశ్ సంస్థ బ్యానర్ మీద దర్శకనిర్మాత సమర్పించిన రెండవ చిత్రం 'విశ్వమోహిని'. ఈ చిత్రానికి మాటలు, పాటలు సమకూర్చింది బలిజేపల్లి లక్ష్మీకాంతం. 1942లో "జీవన్ముక్తి" చిత్రానికి మాటలు పాటలు సమకూర్చిన బలిజేపల్లి 'రాజగురు' పాత్రను పోషించారు. బుర్రకథను ఆధారం చేసుకొని బాలనాగమ్మ' చిత్రాన్ని నిర్మించగా, బలిజేపల్లి అద్భుతమైన కథను సమకూర్చి, దానికి సంభా షణలు, పాటలు రాశారు. ఇందులో బలిజేపల్లి నవభోజరాజు పాత్రను పోషించడం విశేషం.1944లో శ్రీజగదీష్ ఫిలిమ్స్ వై.వి.రావు 'తహసిల్దార్' అనే చిత్రాన్ని నిర్మించగా బలిజేపల్లి 'సీతయ్య', 'పానకాలు' అనే రెండు పాత్రలను పోషించారు. బలిజేపల్లి రచించిన నవల 'బ్రహ్మరథం' ఆధారంగా 1947లో శ్రీవెంకట్రామా పిక్చర్స్ బ్యానర్ మీద మీర్జాపురం రాజావారు ప్రధమ కానుకగా చిత్రపు నారాయణమూర్తి దర్శకత్వంలో 'బ్రహ్మరథం' చిత్రాన్ని నిర్మించగా, చిత్రానికి కథ, మాటలు, పాటలు బలిజేపల్లి సమకూర్చారు.బలిజేపల్లి కథ, మాటలు, పాటలు సమకూర్చి నటించిన చివరి సినిమా 'రక్షరేఖ' (1949). ఆర్. పద్మనాభన్ నిర్మించి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అక్కినేని నాగేశ్వరరావు, భానుమతి, అంజలీదేవి, కస్తూరి శివరావు, వంగర వెంకటసుబ్బయ్య, కనకం, గంగారత్నం ముఖ్య తారాగణం. ఇందులో బలిజేపల్లి ప్రతాప మహారాజు పాత్రను పోషించారు. అక్కినేని ఆయన కొడుకు సుధాకరుడుగా నటించారు. గుంటూరు జిల్లా బాపట్ల తాలూకా ఇటికంపాడులో 23 డిసెంబర్, 1881 సంవత్సరంలో నరసింహ శాస్త్రి, ఆదిలక్ష్మమ్మలకు జన్మించిన బలిజేపల్లి 30 జూన్,1953న కాళహస్తిలో పరమ పదించారు.

# ఈ అంశంలో జోక్యం చేసుకోలేం

జీహెచ్ఎంసీ వార్డుల పునర్వ్యవస్థీకరణకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. డివిజన్ల పునర్విభజనను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లపై హైకోర్టులో విచారణ జరిగింది.

జీహెచ్ఎంసీలో డివిజన్ల సంఖ్యను 150 నుంచి 300కు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిని సవాల్ చేస్తూ ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. ఎంసీహెచ్ఆర్‌డీలో సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సమర్పించిన నివేదిక ఆధారంగా వార్డుల పునర్విభజన చేశామని ప్రభుత్వం తెలిపింది. అయితే ఆ నివేదికను బహిర్గతం చేయలేదని, అభ్యంతరాల స్వీకరణకు తగినంత గడువు ఇవ్వలేదని పిటిషనర్ తరపు న్యాయవాదులు వాదించారు.

చట్టపరిధిలోనే డీలిమిటేషన్ నోటిఫికేషన్‌ను జారీ చేసినట్లు ప్రభుత్వం తరపు న్యాయవాది ఇటీవల కోర్టుకు వివరించారు. సమాచారం ఇప్పటికే వెబ్‌సైట్‌లో ఉంచామని, ఇప్పటి వరకు అందిన 3,100 అభ్యంతరాలను పరిష్కరిస్తున్నామని ప్రభుత్వం కోర్టుకు తెలియజేసింది.

## తెలంగాణకు పరిశ్రమలు రావొద్దని కేసీఆర్ కుట్ర చేస్తున్నారు..

- మొదటి పేజి తరువాయి

ప్రతి సంస్థ ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చేసేలా ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో కూడా ఒప్పందం చేసుకున్న ప్రతి పరిశ్రమ రాలేదని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు.అప్పుడు తాము కూడా దానిపై రాజకీయం చేయలేదని అన్నారు. ఏ రాష్ట్రంలో లేనంత స్థాయిలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించామని అన్నారు. హైదరాబాద్ నగరానికి వచ్చేందుకు ఎన్నో అంతర్జాతీయ సంస్థలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. ఒక్క ఏడాదిలోనే 75 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను తీసుకువచ్చామని అన్నారు. అత్యధిక జీసీసీలు వచ్చిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని వెల్లడించారు.

గత ఏడాది రాష్ట్రానికి రూ.3.40 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చామని మంత్రి తెలిపారు. కొత్త పెట్టుబడులతో 1.40 లక్షల మందికి ఉద్యోగ,

ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో ఎన్నో ప్రభుత్వ సంస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రపంచ అవసరాలలో మూడొంతుల వ్యాక్సిన్లు హైదరాబాద్ నుంచే ఎగుమతి అవుతున్నాయని శ్రీధర్ బాబు తెలిపారు.

## తెలంగాణను వణికిస్తున్న చలి...

తెలంగాణ రాష్ట్రాన్ని చలిగాలులు వణికిస్తున్నాయి. సోమవారం పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం రెడ్డిపల్లెలో 6.9 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాలకు గాను 17 జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తక్కువగా నమోదయ్యాయి.కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో 7, ఆదిలాబాద్ జిల్లా అర్లిలో 8.3, వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్‌లో 8.7, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో 9.5, కామారెడ్డిలో 9.7 డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్ నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, ఆదిలాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో దట్టమైన పొగమంచు కమ్ముకుంది.

ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ (×వీణ) ఏడు జిల్లాలకు కోల్డ్ వేవ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ఈ ప్రాంతాల్లో డిసెంబర్ 26 వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు 5 నుంచి 10 డిగ్రీల మధ్య ఉండే అవకాశం ఉందని తెలిపింది.

మరోవైపు హైదరాబాద్,

హనుమకొండ, కరీంనగర్, వరంగల్‌తో సహా 15 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఇక్కడ ఉష్ణోగ్రతలు 11 నుంచి 15 డిగ్రీల మధ్య ఉండొచ్చని అంచనా వేసింది. రానున్న 24 గంటల్లో హైదరాబాద్‌లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం వేళ పొగమంచు కురిసే అవకాశం ఉందని, గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు వరుసగా 28, 13 డిగ్రీలుగా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ బులెటిన్‌లో పేర్కొంది.

## రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2025లో నేరాలు పెరిగాయి

- మొదటి పేజి తరువాయి

ఈ ఏడాది నేరాల సంఖ్య పెరిగిందని ఆయన తెలిపారు. 2024లో 28,626 కేసులు నమోదు కాగా, 2025లో 33,040 కేసులు నమోదైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సంవత్సరం 579 కిడ్నాప్ కేసులు... 1,224 పోక్సో కేసులు... 73 హత్యలు... 330 అత్యాచారాలు నమోదయ్యాయి.మహిళలపై నేరాలు గత ఏడాదితో పోలిస్తే 4 శాతం పెరిగినట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది రూ.20 కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. డ్రగ్స్ కేసుల్లో మొత్తం 668 మంది నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది 21,056 కేసులను పరిష్కరించినట్లు సీపీ తెలిపారు. 12 కేసుల్లో దోషులకు 20 ఏళ్ల జైలు శిక్ష పడిందన్నారు.సైబర్ నేరాలకు పాల్పడిన వారిపై 3,734 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

6,188 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశామని అన్నారు. సైబర్ క్రైమ్ బాధితులకు రూ.40.10 కోట్లను రిఫండ్ చేసినట్లు వెల్లడించారు. డ్రగ్స్ రవాణా చేస్తున్న 495 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇందులో తెలంగాణకు చెందిన వారు 322 మంది, ఇతర రాష్ట్రాల వారు 172 మంది, ఒక విదేశీయుడు ఉన్నట్లు తెలిపారు.

## ఛత్తీస్ గఢ్ సరిహద్దులో మావోయిస్టుల భారీ డంప్ ధ్వంసం

భారీ విధ్వంసానికి ప్లాన్ చేస్తున్నట్లు ఇంటిలిజెన్స్ వర్గాల నుంచి సమాచారం అందింది. దీనితో రంగంలోకి దిగిన ప్రత్యేక బలగాలు, స్థానిక పోలీసు దళాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ తనిఖీల్లో మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రాన్ని, ప్రదేశంలో మావోయిస్టులు నిల్వ చేసిన భారీ ఆయుధ గిడ్డంగిని గుర్తించారు. ఆయుధ తయారీ కేంద్రాన్ని ధ్వంసం చేసి, అక్కడున్న ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం, స్వాధీనం చేసుకున్న వాటిలో భారీ ఎత్తున ఐఈడీ పేలుడు పదార్థాలు, వైర్లు, డిటోనేటర్లు, మందుగుండు సామగ్రి మరియు కొన్ని దేశవాళీ తుపాకులు ఉన్నాయి. వీటితో పాటు మావోయిస్టులకు సంబంధించిన యూనిఫామ్‌లు, కిట్ బ్యాగులు మరియు విప్లవ సాహిత్యాన్ని కూడా భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. భారీ స్థాయిలో పేలుడు పదార్థాలు లభించడంతో ఆ ప్రాంతంలో అదనపు బలగాలను రంగంలోకి దించారు. మావోయిస్టులు భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకుని ఈ పేలుడు పదార్థాలను అమర్చాలని భావించి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతమంతా జల్లెడ పడుతున్నామని, అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

## ఉద్యోగాలు మా బాధ్యత కాదు... చేతులెత్తేసిన పాక్ ప్రభుత్వం!

- మొదటి పేజి తరువాయి

బాధ్యత కాదని, ఆ పని పూర్తిగా ప్రైవేటు రంగమే చూసుకోవాలని పాక్ ఆర్థిక మంత్రి ముహమ్మద్ ఔరంగజేబు స్పష్టం చేశారు. తీవ్రమైన ఆర్థిక ఒడిదొడుకులు, ఉద్యోగాల కొరతతో సతమతమవుతున్న దేశంలో ఆయన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.ప్రస్తుతం పాకిస్థాన్‌లో నిరుద్యోగం రేటు 7.1 శాతానికి చేరింది. అధికారిక లెక్కల ప్రకారమే దేశంలోని 7.72 కోట్ల కార్మిక శక్తిలో 80 లక్షల మందికి పైగా ఉద్యోగాలు లేకుండా ఉన్నారు. పేదరికం, అల్పాదాయం పెరిగిపోవడంతో ప్రజల జీవన ప్రమాణాలు పడిపోతున్నాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో, ఉద్యోగ కల్పనకు అనువైన వాతావరణాన్ని సృష్టించాల్సిన ప్రభుత్వమే బాధ్యత నుంచి తప్పుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### ప్రైవేటు రంగం ఎందుకు విఫలమవుతోంది?

సిద్ధాంతపరంగా ఉద్యోగాల కల్పనలో ప్రైవేటు రంగం కీలకమే అయినప్పటికీ, పాకిస్థాన్‌లో అందుకు అనుకూల పరిస్థితులు లేవు. నిరంతర రాజకీయ అస్థిరత, ఆర్థిక విధానాల్లో స్పష్టత లేకపోవడం, అనూహ్యంగా మారే పన్నుల విధానం, అధిక వడ్డీ రేట్లు, ఇంధన కొరత, కరెన్సీ అస్థిరత వంటి కారణాలతో ప్రైవేటు కంపెనీలు విస్తరణకు ముందుకు రావడం లేదు. దీనికి తోడు, నిర్మాణ, రియల్ ఎస్టేట్ వంటి రంగాలలో చట్టవిరుద్ధ శక్తులు, మాఫియాల బెదిరింపులు పెరిగిపోయాయని, బిల్డర్ల నుంచి భారీగా డబ్బు వసూలు చేస్తున్నారని అసోసియేషన్ ఆఫ్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ ఆరోపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో పెట్టుబడిదారులు వెనక్కి తగ్గుతున్నారు.

### కుప్పకూలుతున్న పారిశ్రామిక రంగం

గడిచిన ఆరేళ్లుగా పాకిస్థాన్ పారిశ్రామిక రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. లాహోర్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నివేదిక ప్రకారం, తయారీ రంగంలో ప్రైవేటు పెట్టుబడులు 2019 ఆర్థిక సంవత్సరంలో రూ.706 బిలియన్ల నుంచి 2025 నాటికి రూ.377 బిలియన్లకు, అంటే ఏకంగా 46 శాతం పడిపోయాయి. కొత్త పెట్టుబడులు రాకపోగా, ఉన్న యంత్రాలను ఆధునీకీకరించేందుకు కూడా నిధులు లేని దుస్థితి నెలకొంది. బంగ్లాదేశ్, వియత్నాం వంటి దేశాలతో పోలిస్తే పాకిస్థాన్‌లో విద్యుత్ ఛార్జీలు అధికంగా ఉండటం కూడా పోటీతత్వాన్ని దెబ్బతీస్తోంది.

ఉద్యోగాలను నేరుగా సృష్టించకపోయినా, వాటి కల్పనకు అవసరమైన స్థిరమైన విధానాలు, చౌక రుణాలు, నిరంతరాయ ఇంధన సరఫరా, శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ మౌలిక సమస్యలను పరిష్కరించకుండా బాధ్యతను ప్రైవేటు రంగంపైకి నెట్టడం వ్యూహం కాదు, అది బాధ్యతారాహిత్యమే అవుతుందని పాకిస్థాన్‌కు చెందిన ప్రముఖ ఆంగ్ల పత్రిక 'డాన్' తన కథనంలో విశ్లేషించింది.

## అదానీ, అంబానీల కోసమే ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేశారు

- మొదటి పేజి తరువాయి

ఉపాధి హామీ చట్టానికి కేంద్రం మహాత్మా గాంధీ పేరును తీసేసి, ఆయనను మరోసారి హత్య చేసిందని అన్నారు. గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. అదానీ, అంబానీల మైనింగ్ తవ్వకాలకు కూలీలను సరఫరా చేసేందుకే ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేశారని సీతక్క మండిపడ్డారు. ఈ చట్టాన్ని రక్షించుకునే బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. ఉపాధి హామీ పథకాన్ని కాపాడాలని అన్ని గ్రామాల్లో తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. ఈ నెల 27 లేదా 28 తేదీలో ర్యాలీలు నిర్వహిస్తామని చెప్పారు. వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించేందుకు, వలసలను అరికట్టేందుకు గత యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని తీసుకొస్తే... ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీకి ఉరి వేసిందని దుయ్యబట్టారు.

## కర్ణాటకలో సీఎం మార్పును డిసైడ్ చేసేది ఆయనే

కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై కొనసాగుతున్న ఊహాగానాలకు తెరదించేలా సీఎం సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర సీఎం మార్పు రగడపై అగ్రనేత నేత రాహుల్ గాంధీ నిర్ణయం తీసుకుంటారని అన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకునే నిర్ణయానికే తామంతా కట్టుబడి ఉంటామని ఆయన స్పష్టం చేశారు. సోమవారం తన సొంతూరు మైసూరులో ఆయన మీడియాతో మాట్లాడారు.సీఎం మార్పుపై మీడియా పదేపదే చర్చించడంపై సిద్ధరామయ్య అసహనం వ్యక్తం చేశారు. "ఈ విషయంపై ఇన్ని ప్రశ్నలు ఎందుకు? నేను ఇప్పటికే శాసనసభలో దీని గురించి మాట్లాడాను. మళ్ళీ చర్చ అనవసరం" అని అన్నారు. తాను పూర్తికాలం సీఎంగా కొనసాగుతానని ఇటీవల అసెంబ్లీ వేదికగా ప్రకటించిన సిద్ధరామయ్య, తాజా వ్యాఖ్యలతో బంతిని అధిష్ఠానం కోర్టులోకి నెట్టారు.గతవారం మంత్రి కేఎన్ రాజన్న, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో భేటీ అయిన విషయంపై అడిగిన ప్రశ్నకు సిద్ధరామయ్య స్పందిస్తూ.. "డీకే శివకుమార్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు. ఆయన్ను కలవడంలో తప్పేముంది?" అని ప్రశ్నించారు.మరోవైపు, సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య ఆధిపత్య పోరుపై ప్రతిపక్ష బీజేపీ విమర్శలు గుప్పిస్తోంది. కాంగ్రెస్ అధిష్ఠానానికి ఈ సమస్యను పరిష్కరించే సత్తా లేదని ఎద్దేవా చేస్తోంది. ఈ వారంలో డీకే శివకుమార్ ఢిల్లీ పర్యటనకు వెళ్లనుండటం, శనివారం జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి సిద్ధరామయ్యకు ఆహ్వానం అందే అవకాశం ఉండటంతో.. కర్ణాటక రాజకీయాలు మరింత వేడెక్కాయి.

## సోనియా, రాహుల్ గాంధీలకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్ర నాయకు లు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలతో ఈడీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకోవడానికి ట్రయల్ కోర్టు నిరాకరించింది. ఈ తీర్పును ఈడీ ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసింది. దీంతో రాహుల్, సోనియా గాంధీతో పాటు ఈ కేసులోని ఇతరులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది.నేషనల్ హెరాల్డ్ పత్రికను నడిపే ఏజేఎల్‌కు కాంగ్రెస్ పార్టీ రూ.90 కోట్ల రుణం అందించింది. అందుకు బదులుగా ఏజేఎల్ కంపెనీ ఆస్తులను తమ ఆధీనంలోకి తీసుకుంది. అయితే ఈ వ్యవహారంలో సోనియా, రాహుల్, ఇతర కాంగ్రెస్ నేతలు మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండేజ్, సుమన్ దూబే తదితరులు మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు ఈడీ ఆరోపిస్తోంది.ఏజేఎల్ కంపెనీ ఆస్తులను స్వాధీనం చేసుకున్న యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ప్రధాన వాటాదారులుగా ఉన్నారు. ఈ సంస్థ కేవలం రూ.50 లక్షలు చెల్లించి ఏజేఎల్‌కు చెందిన సుమారు రూ.2 వేల కోట్ల విలువైన ఆస్తులు పొందారని ఈడీ తన ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది.

## మాస్కోలో కారు బాంబు దాడి.. రష్యాకు చెందిన కీలక జనరల్ మృతి

- మొదటి పేజి తరువాయి

చెందారు. ఈ విషయాన్ని రష్యా దర్యాప్తు సంస్థ వెల్లడించింది. రష్యా సాయుధ దళాల జనరల్ స్టాఫ్‌కు చెందిన ఆపరేషనల్ ట్రైనింగ్ డైరెక్టర్ అధిపతి లెఫ్టినెంట్ జనరల్ ఫనిల్ సర్వరోవ్, బాంబు దాడి ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో మరణించినట్లు ఆ సంస్థ తెలిపింది.ఆయన కారు కింద అమర్చిన పరికరం పేలడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. అపార్టుమెంట్ దగ్గర కారు పార్కింగ్ ప్రాంతంలో జరిగిన ఈ దాడి వెనుక ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ హస్తం ఉన్నట్లు రష్యా అధికారులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

గత మూడేళ్లుగా రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఈ యుద్ధాన్ని ఆపేందుకు వివిధ దేశాలు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఉద్రిక్తతలు మాత్రం తగ్గడం లేదు. ఇటీవల కాస్పియన్ సముద్రంలోని రష్యా కీలక చమురు క్షేత్రంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులు నిర్వహించింది. ముమ్ముందు మరిన్ని దాడులు చేస్తామని కూడా హెచ్చరించింది.

## ప్రభుత్వానికి చేరిన GHMC వార్డుల విభజన తుది నివేదిక..

# రేపో, మాపో ఫైనల్ నోటిఫికేషన్..!




**హైదరాబాద్ పెన్ పవర్:** జీహెచ్ఎంసీ వార్డుల విభజన తుది నివేదిక ప్రభుత్వానికి చేరింది. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సోమవారం (డిసెంబర్ 22) సీఎస్ రామకృష్ణా రావుకి ఫైనల్ రిపోర్ట్ అందజేశారు. కాగా, ఔటర్ రింగ్ రోడ్డు (ORR) లోపల ఉన్న 20 మున్సిపాలిటీలు,7 కార్పొరేషన్లను ప్రభుత్వం జీహెచ్ఎంసీలో విలీనం చేసిన విషయం తెలిసిందే. దీనికి అనుగుణంగా జీహెచ్ఎంసీలో డివిజన్ల సంఖ్యను 150 నుంచి 300కి పెంచింది. ఈ క్రమంలో డివిజన్ల విభజనపై 6 వేలకు పైగా అభ్యంతరాలు వచ్చాయి. అభ్యంతరాలను పరిశీలించిన అధికారులు సహేతుకమైన వాటిని పరిగణలోకి తీసుకున్నారు. ఈ మేరకు వార్డుల విభజన ప్రిలిమినరీ నోటిఫికేషన్‌కి మార్పులు చేసి ఫైనల్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వానికి సమర్పించారు. ప్రభుత్వ పరిశీలన అనంతరం జీహెచ్ఎంసీ వార్డుల విభజనపై రేపు లేదా ఎల్లుండి ఫైనల్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందంటున్నారు అధికారులు. మరోవైపు.. జీహెచ్ఎంసీ వార్డుల విభజనకు హైకోర్టు నుంచి కూడా క్లియరెన్స్ వచ్చింది. జీహెచ్ఎంసీ డీలిమిటేషన్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్లు హైకోర్టు కొట్టేసింది. ఈ అంశంలో జోక్యం చేసుకోలేమని న్యాయస్థానం తేల్చిచెప్పింది.







# చెర్లపల్లి "ఐఓసిఎల్"
## స్మార్ట్ టెర్మినల్‌లో మాక్ డ్రిల్..

అగ్ని ప్రమాదాల నివారణపై జాతీయ మార్గదర్శకాలతో సమన్వయ విన్యాసం..

- ఎన్‌డిఎంఏ మార్గనిర్దేశకత్వం 'ఐఓసిఎల్' చెర్లపల్లిలో పరిశ్రమల ప్రమాదాలపై మాక్‌డ్రిల్.
- ఆయిల్ ఓవర్‌ఫ్లోతో అగ్ని ప్రమాదాన్ని కృత్రిమ పరిస్థితి సృష్టించి విన్యాసాలు..
- అత్యవసర నివారణ చర్యలు, శాఖల సమన్వయంపై ప్రత్యక్ష ప్రదర్శన..
- మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా పర్యవేక్షణలో మాక్ డ్రిల్ నిర్వహణ..
- ఎన్‌డిఆర్ఎఫ్ మొదలుకొని జీహెచ్ఎంసి వరకు అనేక కీలక శాఖలు పాల్గొన్నాయి..

-4 లో

## హైదరాబాద్ నెక్నాంపూర్ లో రూ. రెండు వేల 500 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా.. 23 ఎకరాలను కాపాడిన హైడ్రా..



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లోని నెక్నాంపూర్ లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడింది హైడ్రా. నెక్నాంపూర్ లోని సర్వే నంబర్ 20లో ఉన్న 23 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్లు ఫిర్యాదు రావడంతో సోమవారం ( డిసెంబర్ 22 ) రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు ఆక్రమణలను తొలగించారు. కబ్జాకు గురైన భూమి విలువ

-మిగతా 4లో



## హైదరాబాదులో ముగిసిన శీతాకాల విడిది...
# ఢిల్లీ పయనమైన రాష్ట్రపతి ముర్ము

- ముగిసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఐదు రోజుల శీతాకాల విడిది
- హైదరాబాద్ పర్యటన ముగించుకుని సోమవారం ఢిల్లీకి తిరుగుపయనం
- హకీంపేట ఎయిర్‌పోర్టులో వీడ్కోలు పలికిన గవర్నర్, సీఎం రేవంత్ రెడ్డి
- పర్యటనలో భాగంగా పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న రాష్ట్రపతి

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాదులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఐదు రోజుల శీతాకాల విడిది సోమవారంతో ముగిసింది. ఈ సాయంత్రం హైదరాబాద్ పర్యటనను ముగించుకుని ఆమె ఢిల్లీకి తిరుగుపయనమయ్యారు. హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరులు ఆమెకు ఘనంగా

-4 లో

# ఇటుక బట్టీలే కాదు..!
# భవన నిర్మాణాలు అక్రమమేనా..?

**దుండిగల్, పెన్ పవర్, డిసెంబర్ 22:** అధికారులు అందరూ మనవారే..! అంటున్న చంద్రన్న.. కావాలంటే ఫోన్ చేయాలా అంటూ ప్రశ్నించిన వారికి చెప్పడం విశేషం.. దుండిగల్ జీహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని గండిమైసమ్మ అపురూప కాలనీలో, స్టిల్ట్ o3 పర్మిషన్‌తో అదనంగా రెండు అంతస్తులు.. గాగిల్లాపూర్‌లో స్టిల్ట్ o 2 అనుమతులతో తీసుకుని పార్కింగ్ ఆక్రమణతో ఏడాది క్రితం నిర్మించిన, పాత ఇంటిపై అదనంగా మరో రెండు అంతస్తుల నిర్మాణం.. సంబంధిత నిర్మాణ దారులు దాదాపు ఇరవై ఏళ్ళుగా ఇటుక బట్టీల వ్యాపారులుగా ఆరోపణలు ఉన్నాయి.. ఇటుక బట్టీలు కూడా నిబంధనలకు విరుద్ధంగా, గ్రామాల నడుమ ఇటుక బట్టీలతో కాలుష్యాన్ని వెదజల్లుతూ, ప్రజలు అనారోగ్య బారిన పడటానికి కారణంగా ఆరోపణలు వస్తున్నాయి.. నిజానికి ఈ ఇటుక బట్టీలకు కావల్సిన అనుమతులు ఎవరు ఇస్తున్నారు.. ఏం చేస్తున్నారో కానీ, పలువురికి ముడుపులు ముట్ట చెప్పేందుకు, ఇటుక బట్టీల నిర్వహకుల నుండి, లక్షల్లో వసూళ్ళు చేస్తున్నట్టు సమాచారం. ఈ వ్యవహారం మొత్తం గత దశాబ్ద కాలంనుండి ఒకే వ్యక్తి మేనేజ్ చేస్తున్నట్టు వినికిడి.. ఈ ఇటుక బట్టీల నిర్వహణలో అవకతవకల మేనేజ్ చేసే, క్రమంలో కొందరు అధికారుల పరిచయాన్ని అదనుగా తీసుకుని, తమకు అందరూ తెలుసని, ఏం చేస్తారో చేసుకోమని చెబుతూ,సంబంధిత వ్యక్తి ఈ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి..! అక్రమ నిర్మాణాలపై కంప్లైంట్‌లు వస్తున్నాయని, ప్రశ్నించిన టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని సైతం, అందిరిని నేను చూసుకుంటానని, అధికారులు అందరూ నాకు తెలుసని, అక్రమ నిర్మాణ దారులు చెప్పడం గమనార్హం.. మరోవైపు "టిజి-బిపాస్" చట్టాన్ని ఉల్లంఘించి, నిర్మాణాలు చేపడుతుంటే..! దుండిగల్ సర్కిల్ పట్టణ ప్రణాళిక అధికారి టిపిఎస్ సంజునా, చర్యలు తీసుకోకపోవడం, నిర్మాణ దారులు చెప్పేది నిజమేనని స్పష్టమవుతుంది..

- దుండిగల్ ప్రాంతంలో ఇటుకబట్టీ నిర్వాహకుల అక్రమ కట్టడాలు..
- అనుమతులు ఒకరకం..! నిర్మాణాలు మరోరకం..!
- టిజి-బిపాస్ చట్టం నిర్వీర్యం..! నిబంధనలకు తిలోదకాలు..



దుండిగల్ సర్కిల్ అపురూప కాలనీలో డిసెంబర్ 10న ఇలా ఉన్న నిర్మాణం..

-4 లో



ఆదివారం (డిసెంబర్ 22 వరకు) బయట రంగులు, లోపల పనులు..

- దుండిగల్ జీహెచ్ఎంసి సర్కిల్ గండిమైసమ్మ అపురూప కాలనీలో ఒకరు..!
- గాగిల్లాపూర్ సర్వే నెం.235లో..! పాతింటిపై కొత్తగా రెండంతస్తులతో మరొకరు..
- ఇక్కడ అపురూప- అక్కడ గాగిల్లాపూర్ నిర్మాణ దారులు ఇద్దరూ బంధువులేనట..
- "స్టిల్ట్o2 అనుమతులు తీసుకుని నిర్మాణం పూర్తైన ఏడాదికి అదనంగా మరో రెంతస్తులు.
- గాగిల్లాపూర్‌లో చంద్రన్న అక్రమ కట్టడంలో.. పార్కింగ్ ఆక్రమణ.. పైన రెండంతస్తులు.

## చంద్రబాబును ఓసారి గురువు అంటారు,
# మరోసారి కాదంటారు

### రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు విమర్శ


- చంద్రబాబు మీ గురువు అని మేం అంటే రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేస్తాడన్న హరీశ్ రావు
- మొన్న వెంకయ్యతో స్వయంగా చంద్రబాబే తన గురువు అని అంగీకరించాడని వెల్లడి
- ఓసారి దేవత అంటారు, మరోసారి బలిదేవత అంటారని విమర్శ



-మిగతా 4లో

## కూల్చుతున్నారా.. కూలిపోతున్నాయా..?

### పెద్దపల్లి జిల్లాలో వరుసగా చెక్ డ్యామ్‌లు కూలిపోవడంపై ప్రభుత్వం సీరియస్



**హైదరాబాద్ పెన్ పవర్:** పెద్దపల్లి జిల్లాలో వరుసగా చెక్ డ్యామ్‌లు కూలిపోవడంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ అయ్యింది. ఈ మేరకు చెక్ డ్యాములు కూలిపోవడంపై విజిలెన్స్ ఎంక్వయిరీకి ప్రభుత్వం ఆదేశించింది. గత నెల గుంపుల, రెండు రోజుల క్రితం అడవి సోమన్ పల్లి చెక్ డ్యామ్‌లు కూలిపోవడంపై ఇరిగేషన్ మినిస్టర్ ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.వేలకోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మిస్తే చెక్ డ్యాములు ఎందుకు కూలుతున్నాయో అధికారుల క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని ఆదేశించారు. కూల్చుతున్నారా..? కూలిపోతున్నాయా..?

-మిగతా 4లో

# తెలంగాణలో అక్రిడిటేషన్లపై జీవో రిలీజ్

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలోని జర్నలిస్టులకు అక్రిడిటేషన్ జారీ విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2016 నాటి పాత నిబంధనలను రద్దు చేస్తూ, 'తెలంగాణ మీడియా అక్రెడిటేషన్ రూల్స్-2025'ను ఖరారు చేస్తూ ప్రభుత్వం జీవో నంబర్ 252 ను సోమవారం కె.రామకృష్ణరావు జారీ చేశారు. కొత్త నిబంధనల ప్రకారం రాష్ట్ర స్థాయి (SMAC), జిల్లా స్థాయి (DMAC) అక్రెడిటేషన్ కమిటీల పదవీ కాలం రెండేళ్లుగా నిర్ణయించారు. కొత్త కమిటీలు ఏర్పాటయ్యే వరకు పాతవే కొనసాగుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ సమాచారాన్ని సేకరించేందుకు రిపోర్టర్లకు గుర్తింపుగా అక్రెడిటేషన్ కార్డు, డెస్క్ జర్నలిస్టులకు మీడియా కార్డు ఇవ్వనున్నారు.

### కమిటీల నిర్మాణం:

**రాష్ట్ర కమిటీ (SMAC):** మీడియా అకాడమీ చైర్మన్ చైర్మన్‌గా, ఐఅండ్‌పిఆర్ కమిషనర్ కో-చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఇందులో వివిధ జర్నలిస్ట్ యూనియన్ల ప్రతినిధులు, పీసీఐ సభ్యులు ఉంటారు.

**జిల్లా కమిటీ (DMAC):** జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, డీపీఆర్వో మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

మీడియా కార్డులు కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు మాత్రమే పనికివస్తాయిని పేర్కొన్నారు.

### నిబంధనల ఉల్లంఘన జరిగితే:

అక్రెడిటేషన్ కార్డులను దుర్వినియోగం చేసినా, తప్పుడు సమాచారం ఇచ్చినా లేదా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా కార్డులను రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. పోగొట్టుకున్న కార్డుల స్థానంలో డూప్లికేట్ కార్డు కోసం రూ.250 చెల్లించాల్సి ఉంటుంది.

### డిజిటల్ మీడియాకు తొలిసారి నిబంధనలు

డిజిటల్ న్యూస్ మీడియాకు అక్రెడిటేషన్ ఇవ్వాలంటే సదరు వెబ్‌సైట్‌కు గత ఆరు నెలల్లో నెలకు కనీసం 5 లక్షల మంది విజిటర్స్ ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ మీడియా కేటగిరీలో గరిష్టంగా 10 కార్డులు మాత్రమే ఇస్తారని పేర్కొన్నారు.

#### ఎలిజిబిలిటీ క్రైటీరియా:

**న్యూస్ పేపర్లు:** కనీసం 2,000 ప్రతులు పంపిణీ అవుతున్న దినపత్రికలే అక్రెడిటేషన్‌కు అర్హులు. PRGI రిజిస్ట్రేషన్ తప్పనిసరి.

**ఎలక్ట్రానిక్ మీడియా:** శాటిలైట్ ఛానళ్లు 50% వార్తా కంటెంట్‌ను కలిగి ఉండాలి. లోకల్ కేబుల్ ఛానళ్లు రోజుకు కనీసం 3 బులెటిన్లు టెలికాస్ట్ చేయాలి.

**జర్నలిస్టుల అర్హత:** స్టేట్ లెవల్ అక్రెడిటేషన్ కోసం డిగ్రీ విద్యార్హత లేదా ఐదేళ్ల అనుభవం ఉండాలి.

నియోజకవర్గ, మండల స్థాయి రిపోర్టర్లకు ఇంటర్మీడియట్ విద్యార్హత తప్పనిసరి.

**ఫ్రీలాన్స్ & వెటరన్ జర్నలిస్టులు:**

15 ఏళ్ల అనుభవం ఉన్న ఫ్రీలాన్సర్లు, 30 ఏళ్ల అనుభవంతో పాటు 58 ఏళ్లు నిండిన వెటరన్ జర్నలిస్టులు కూడా కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చు.

# ఇటుక బట్టీలే కాదు..! భవన నిర్మాణాలు అక్రమమేనా..?

**దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారి సంజున-కమిషనర్ వెంకటేష్ నాయక్, ఈ ఇటుక బట్టీల నిర్వాహకుల అక్రమ కట్టడాలకు అంతగా, చర్యల మినహాయింపు ఇవ్వడానికి కారణం..? దుండిగల్ సర్కిల్‌పై జీహెచ్‌ఎంసి ఉన్నతాధికారులే తేల్చాలి..**

- 3 పేజి తరువాయి

దుండిగల్ మున్సిపాలిటీ, జీహెచ్‌ఎంసిలో విలీనం అయినప్పటికీ..! నిర్మాణ అనుమతులు, టిజి-బిపాస్ చట్ట ప్రకారం మంజూరు చేస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు, పర్యవేక్షణపై నిర్లక్ష్యం చేస్తున్నారు.. పాత మున్సిపల్ పద్ధతి అవలంబించి సహకరించడం విమర్శల పాలవుతుంది.., అదనపు అంతస్తులు, పార్కింగ్ ఆక్రమణలు, జీరో సెట్‌బ్యాకుల కట్టడాలే నేటికీ కొనసాగుతున్నాయి.. దుండిగల్ సర్కిల్ పరిధి గండిమైసమ్మ అపురూప కాలనీలో, ఓ ఇటుక బట్టీల వ్యాపారి మున్సిపల్ అనుమతులు "స్టిల్ట్‌ం3" అంతస్తులకి పర్మిషన్ తీసుకుని, నిర్మాణం మాత్రం "స్టిల్ట్ ం5" ఫ్లోర్‌లు నిర్మించాడు.. అయితే అదనపు అంతస్తులు, సెట్‌బ్యాకుల ఆక్రమణ, పార్కింగ్‌లోనూ నిర్మాణం చేపట్టడంపై, టౌన్‌ప్లానింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్ళనా చర్యలు ఉండటం లేదు.. మరోవైపు నిర్మాణ దారుని సమీప బంధువు (మరో ఇటుక బట్టీల వ్యాపారి) జోక్యం చేసుకుని, అపురూప కాలనీలో అదనపు అంతస్తుల భవనం తన బావమరిది నిర్మాణమేనని, ప్రశ్నించిన వారికి చెప్పడం విశేషం.. అధికారుల చర్యలు లేకుండా, అక్రమ నిర్మాణ దారులు అధికారులు అందరూ తెలుసని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది.. ఈ అక్రమ అదనపు అంతస్తుల విషయం టౌన్‌ప్లానింగ్ అధికారులకు తెలిసే జరుగుతున్నాయని, తేటతెల్లం చేస్తోంది..

**గాగిల్లాపూర్‌లో పాతింటిపై కొత్తగా అక్రమ అంతస్తులు..**



**గాగిల్లాపూర్‌లో చంద్రబాబు పాతింటిపై అదనపు అంతస్తులు.. సెట్‌బ్యాకులు లేని ప్రమాదకర కట్టడం..**

దుండిగల్ సర్కిల్ గండిమైసమ్మ అపురూప కాలనీలో అదనపు అంతస్తుల బావమరిది అక్రమ కట్టడానికి, అండగా నిలబడి మేనేజ్ చేస్తున్న 'బావ'(ఇటుకల వ్యాపారి), అక్రమ నిర్మాణం సంగతి కూడా తెలుసుకోవాలని ఉందా..!

అయితే అదేంటో చూద్దాం..! దుండిగల్ సర్కిల్ గాగిల్లాపూర్ సర్వే నెం.235లో పాత ఇంటిపై కొత్తగా రెండు అదనపు అంతస్తుల గురించి ప్రశ్నిస్తే హాస్యాస్పద సమాధానం ఇస్తున్నారు.. అపురూప కాలనీలో తమ బావమరిది నిర్మాణమని, గాగిల్లాపూర్‌లో తన స్వంతమని సింపుల్‌గా చెప్పేశాడు.. అసలు ఈ "బావ బావమరిది" విఐపి కోవకు చెందిన వారా..? ఇద్దరూ ఇటుక బట్టీల వ్యాపారులే..! ఏదో అధికారుల సహకారంతో పరిసర గ్రామ ప్రజలకు కాలుష్యాన్ని వెదజల్లే, ఇటుక బట్టీ వారి అక్రమ నిర్మాణాలకు అధికారులు అండగా ఉండటం..! అవసరమైతే మాట్లాడిస్తాను అని చెప్పడం గమనార్హం..

### పాత నిర్మాణంలోనే నిబంధనలు ఉల్లంఘన.. కొత్తగా అక్రమ కట్టడం..

అసలు విషయం ఏమిటంటే..! గాగిల్లాపూర్ సర్వే నెం.235లో అక్రమ ఇటుక బట్టీల వ్యాపారి చంద్రబాబు సుమారు ఏడాదిన్నర క్రితమే, తన ఇంటి కోసం, దుండిగల్ మున్సిపల్ సమయంలోనే "స్టిల్ట్‌ం2" పర్మిషన్‌తో సెట్‌బ్యాకులు ఆక్రమించి, పార్కింగ్‌లోనూ నిర్మాణం చేపట్టి, పైన రెండంతస్తులు పద్ధతి ప్రకారమే నిర్మాణం పూర్తి చేశాడు బాగానే ఉంది.. తాజాగా దుండిగల్ మున్సిపాలిటీ, జీహెచ్‌ఎంసిలో విలీనమైంది.. ఈ విషయం కాస్త ముందస్తుగా తెలుసుకున్న చంద్రబాబు, అధికారులను మెప్పించి, ఒప్పించి పాతింటిపై అదనంగా రెండు అక్రమ అంతస్తుల నిర్మిస్తున్నాడు.. గాగిల్లాపూర్‌లో చంద్రబాబు అదనపు అక్రమ అంతస్తులు చేపడుతుంటే..! అపురూప కాలనీలో ఆయన బావమరిది రెండు అదనపు అక్రమ అంతస్తులు నిర్మాణానికి ఈయన సిఫార్సులట..

# చెర్లపల్లి "ఐఓసిఎల్" స్మార్ట్ టెర్మినల్‌లో మాక్ డ్రిల్..





**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 22:** జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ (ఎన్‌డిఎంఎ) మార్గనిర్దేశకత్వంలో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో మేడ్చల్ద- మల్కాజ్గిరి జిల్లాలోని పరిశ్రమల ప్రమాదాల నివారణపై కీలకమైన మాక్ డ్రిల్ నిర్వహించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసిఎల్) ఆధ్వర్యంలో, చెర్లపల్లి స్మార్ట్ టెర్మినల్ (హైదరాబాద్ టెర్మినల్)లో ఈ విన్యాసాన్ని సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి నిర్వహించారు.. సికింద్రాబాద్ చెర్లపల్లి ప్రాంతం, సర్వే నెం.183, ఫేజ్ - 3, మహాలక్ష్మి నగర్‌లో ఉన్న ఈ టెర్మినల్, ఒక ఆయిల్ ట్యాంక్ నుంచి మరో ట్యాంక్‌కు ఆయిల్ పంపింగ్ జరుగుతున్న సమయంలో ఆయిల్ ఓవర్‌ఫ్లో కావడంతో అగ్ని ప్రమాదం సంభవించినట్లుగా ఓ సన్నివేశాన్ని రూపొందించి, మాక్ డ్రిల్ చేపట్టారు..

ఈ కృత్రిమ ప్రమాద పరిస్థితుల్లో తక్షణం తీసుకోవాల్సిన అత్యవసర నివారణ చర్యలు, సిబ్బంది భద్రత, అగ్ని నియంత్రణ, ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు శాఖల మధ్య సమన్వయం ఎలా ఉండాలనే అంశాలపై ప్రత్యక్షంగా ప్రదర్శించారు. ముఖ్యంగా పరిశ్రమల ప్రాంతాల్లో సంభవించే ప్రమాదాల సమయంలో సమయపాలన, సమాచార మార్పిడి, బాధ్యతల విభజన ఎంత కీలకమో ఈ మాక్ డ్రిల్ ద్వారా స్పష్టంచేశారు..

ఈ మాక్ డ్రిల్‌ను మేడ్చల్%-%మల్కాజ్గిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా పర్యవేక్షణలో నిర్వహించారు.. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సంఘటితంగా పనిచేస్తూ ప్రమాద నివారణ చర్యలను అమలు చేశారు.. ఈ విన్యాసంలో ఎన్‌డిఆర్‌ఎఫ్-ఆర్‌డిఎఫ్, వైద్య శాఖ, అగ్నిమాపక శాఖ, పరిశ్రమల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, పోలీస్, ట్రాఫిక్ పోలీస్, పౌర సరఫరాల శాఖ, పశుసంవర్ధక శాఖ, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, జీహెచ్‌ఎంసి,లాజిస్టిక్స్ శాఖల అధికారులు చురుకుగా పాల్గొన్నారు.. అదేవిధంగా సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేకంగా మీడియా పాయింట్ ఏర్పాటు చేసి, వాస్తవ పరిస్థితులను మీడియాకు వివరించారు..







# హైదరాబాదులో ముగిసిన శీతాకాల విడిది... ఢిల్లీ పయనమైన రాష్ట్రపతి ముర్ము

-3 పేజి తరువాయి

వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ బి. శివధర్ రెడ్డితో పాటు పలువురు ఉన్నత స్థాయి సివిల్, రక్షణ శాఖ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రపతి ప్రయాణం సందర్భంగా బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం నుంచి హకీంపేట ఎయిర్‌బేస్ వరకు పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి, పలుచోట్ల ట్రాఫిక్‌ను మళ్లించారు. శీతాకాల విడిది కోసం డిసెంబర్ 17న హైదరాబాద్ వచ్చిన రాష్ట్రపతి, బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డిసెంబర్ 19న రామోజీ ఫిల్మ్ సిటీలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్‌పర్సన్‌ల జాతీయ సదస్సును ప్రారంభించారు. 20న బ్రహ్మకుమారీల శాంతి సరోవర్ 21వ వార్షికోత్సవ సభలో ప్రసంగించారు. 21న రాష్ట్రపతి నిలయంలో 'ఎట్ హోమ్' విందును ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా రాష్ట్రపతి శీతాకాల విడిది కోసం హైదరాబాద్ రావడం ఆనవాయతీ. ఈ సమయంలో రాష్ట్రపతి నిలయం నుంచే అధికారిక కార్యకలాపాలు నిర్వహిస్తారు. 1860లో నిర్మించిన ఈ భవనం, 1948లో హైదరాబాద్ భారత్‌లో విలీనమైన తర్వాత రాష్ట్రపతి విడిది కేంద్రంగా మారింది.

## చంద్రబాబును ఓసారి గురువు అంటారు, మరోసారి కాదంటారు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గురువు అని అంటే ఆయన తమపై విమర్శలు చేస్తారని, కానీ మొన్న మాజీ ఉపరాష్ట్రపతిని కలిసి చంద్రబాబే తన గురువు అని చెప్పారని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఒకసారి చంద్రబాబు నీ గురువు అంటే ఆగ్రహం వ్యక్తం చేస్తావు, మరోసారి తానే స్వయంగా నా గురువు అని అంగీకరిస్తాడని, దేవత అంటారు, బలిదేవత అంటారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి విమర్శలు చేయడంపై హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రయోజనాల కోసమే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాట్లాడారని అన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా పరిపుష్టి సాధించిందని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ అద్భుత ఆర్థిక ప్రగతి సాధించిందని అన్నారు. జీఎస్‌డీపీ, తలసరి ఆదాయంలో రాష్ట్రాన్ని దేశానికే తలమానికంగా కేసీఆర్ నిలిపారని అన్నారు. మూడు రెట్ల జీఎస్‌డీపీ, తలసరి ఆదాయం పెరిగిందని వెల్లడించారు. కానీ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటి పారుదల శాఖ మంత్రి అయి రెండేళ్లైనా ఇంకా ప్రిపేర్ కాకుండా సభకు వస్తున్నారని విమర్శించారు. ఆయన సగం సగం ప్రెస్ మీట్లు పెట్టి పరువు తీస్తున్నారని అన్నారు.

కేసీఆర్ నిన్న ప్రెస్ మీట్ పెట్టిన కాసేపటికే రేవంత్ రెడ్డి తన ఇంట్లోనే మీడియాతో చిట్‌చాట్ పెట్టారని అన్నారు. దీనితోనే ఆయనది ఎంత మరుగుజ్జు మనస్తత్వమో వెల్లడవుతోందని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఆర్థిక అరాచకత్వం పెరిగిందని రేవంత్ రెడ్డి మాట్లాడటం సరికాదని అన్నారు. రాజకీయాల కోసం రాష్ట్రం పరువు తీయవద్దని కోరారు. సొంత పార్టీ నాయకులనే తొక్కుకుంటూ ఎదిగినట్లు రేవంత్ రెడ్డి స్వయంగా చెప్పారని హరీశ్ రావు అన్నారు. రూ.50 కోట్లు పెట్టి రేవంత్ రెడ్డి పీసీసీ పదవిని కొనుగోలు చేసినట్లు గతంలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆరోపించారని గుర్తు చేశారు. నిజాయతీగా, త్యాగాల పునాదులపై ఎదిగిన నాయకత్వం బీఆర్ఎస్ పార్టీది అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే, మంత్రి పదవులను గడ్డిపోచల్లా త్యాగాలు చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీ నేతలదని అన్నారు.

## కూల్చుతున్నారా.. కూలిపోతున్నాయా..?

-3 పేజి తరువాయి

నాణ్యత లోపంతో కుంగిపోతున్నాయా..? విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే అడవి సోమనపల్లి చెక్ డ్యామ్ కూలడంపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు ఇరిగేషన్ శాఖ అధికారులు. కాగా, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మానేరు నదిపై 16 చెక్ డ్యామ్?లను రూ.128 కోట్లు ఖర్చు చేసి నిర్మించింది.

## హైదరాబాద్ నెక్నాంపూర్ లో రూ. రెండు వేల 500 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా.. 23 ఎకరాలను కాపాడిన హైడ్రా..

-3 పేజి తరువాయి

సుమారు రూ. రెండు వేల 500 కోట్లకు పైగా ఉండచ్చని అంచనా వేస్తున్నారు అధికారులు. ఆక్రమణలు తొలగించిన అధికారులు భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి.. ప్రభుత్వ భూమి అని తెలియజేస్తూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమి కబ్జాపై స్థానికుల ఫిర్యాదు రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు .రెవెన్యూ రికార్డుల ప్రకారం భూమి పూర్తిగా ప్రభుత్వ భూమిగా నిర్ధారణ అయినట్లు తెలిపారు అధికారులు. ఈ క్రమంలో సదరు భూమిలో అక్రమ కట్టడాలు, ప్రహరీలు, షెడ్డులను తొలగించారు హైడ్రా అధికారులు. హైడ్రా గతంలోనే కొన్ని నిర్మాణాలను నేలమట్టం చేసినప్పటికీ తాజాగా మరికొన్ని ప్రహరీలు, షెడ్డులు వెలిశాయంటూ హైడ్రాకు ఫిర్యాదు చేశారు స్థానికులు. ఈ క్రమంలో సామాన్యులను ముందు పెట్టి బడాబాబులు చేసిన కబ్జా ప్రయత్నాలకు బ్రేక్ వేసింది హైడ్రా. తప్పుడు రికార్డులతో భూమి స్వాధీనం చేసుకునే కుట్ర భగ్నం చేశామని తెలిపారు హైడ్రా అధికారులు. ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రాకు కృతజ్ఞతలు తెలిపారు స్థానికులు. నగర ప్రణాళిక నిబంధనల ప్రకారం ఈ భూమిని ఓపెన్ స్పేస్, గ్రీన్ జోన్లుగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నారు స్థానికులు.

## పారదర్శక పాలనకు ప్రత్యేక యాప్

**అచ్చంపేట, డిసెంబర్ 22 పెన్ పవర్:** ఉమ్మడి పాలమూరు జిల్లాలో మూడు విడతలుగా నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికల సమరం ముగిసింది. కొత్తగా ఎన్నికైన పాలకవర్గాలు ఈ నెల 22న కొలువు దీరనున్నాయి. ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచులు, వార్డు సభ్యులు పాలనా పగ్గాలు చేపట్టనున్నారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల అమలుకు నిధులు మంజూరు చేస్తుంటాయి. పంచాయతీలకు మంజూరయ్యే నిధులతో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్న విషయంలో పాలకవర్గ సమావేశాల్లో తీర్మానించి అమలు చేయాల్సి ఉంటుంది. నిధుల వ్యయం విషయంలో చాలా మంది అక్రమాలకు పాల్పడటంతో గతంలో చెక్ పవర్ రద్దుతో పాటు పదవులను కూడా కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి.

## అక్కినపల్లిలో నూతన సర్పంచ్, ఉపసర్పంచ్ ప్రమాణస్వీకారం

**నకిరేకల్, డిసెంబర్ 22 పెన్ పవర్:** నార్కట్పల్లి మండలం అక్కినపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో నూతన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణస్వీకారం ఈరోజు ఘనంగా జరిగింది. స్పెషల్ ఆఫీసర్ సార్ ఆంజనేయులు గారు నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. మొదట సర్పంచ్ సిరబోయిన నవ్య యాదవ్, ఆ తర్వాత ఉపసర్పంచ్ మిడిదొడ్డి లక్ష్మమ్మ సైదుల్, అనంతరం వార్డ్ సభ్యులు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జానకమ్మ, కారోబార్ శివ శంకర్, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అమెరికాలో నల్గొండ యువకుడి మృతి

**నల్లగొండ, డిసెంబర్ 22 పెన్ పవర్:** నల్గొండ మండలం మేళ్ల దుప్పలపల్లికి చెందిన పవన్ రెడ్డి అనే యువకుడు శనివారం తెల్లవారుజామున అమెరికాలో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందాడు. బీటెక్ పూర్తి చేసి, ఎంఎస్ చదివేందుకు రెండేళ్ల క్రితం అమెరికా వెళ్లిన పవన్, మిత్రులతో కలిసి పార్టీలో పాల్గొన్న తర్వాత అకస్మాత్తుగా మరణించాడు. పోస్టుమార్టం నివేదిక తర్వాత మృతికి గల కారణాలు మరింత స్పష్టమయ్యే అవకాశం ఉంది. ఉద్యోగానికి ఎంపికయ్యాడని సంతోషిస్తున్న తరుణంలోనే ఈ విషాదం చోటు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు.

## భద్రాద్రిలో ఘనంగా అధ్యయనోత్సవాలు


**భద్రాద్రి కొత్తగూడెం భద్రాచలం. పెన్ పవర్:** శ్రీ సీతారామచంద్ర స్వామివారి వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి .ముక్కోటి ఏకాదశి అధ్యాయనోత్సవాలలో భాగంగా 2వ రోజు స్వామివారు కూర్మావతారంలోముస్తాబై భక్తులకు దర్శనమిచ్చారు. కూర్మావతార రూపుడైన స్వామివారిని ఆలయ గర్భగుడి చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి ,అనంతరం మాడ వీధుల గుండా స్వామివారిని ఊరేగింపుగా మిథిలా స్టేడియం వద్దప్రత్యే కంగా ఏర్పాటు చేసిన మండపం వద్దకు వేదమంత్రాలు,కోలాటాల నడుమ ,మంగళ వాయి ద్యాల నడుమ తోడ్కొని ఆలయ అర్చకులు,ఈఓ దామోదర్ రావు దంపతులు తీసుకువ చ్చారు.కూర్మావతారం విశిష్టతదేవతలు, రాక్షసులు మందర పర్వతాన్ని కవ్వంగా,వాసుకి అనే పాముని తాడుగా చేసుకుని,అమృతం కోసం క్షీరసాగరాన్ని చిలుకుతున్న సమయంలో,ఏ ఆధారం లేక మందర గిరి మునిగిపోగా,దేవతలు,రాక్షసులప్రార్థనపై శ్రీహరి కూర్మావతారాన్ని ధరించి మునిగిపోయిన మందర పర్వతాన్ని తన వీపున నిలుపుకుని పైకెత్తి సహాయపడ్డాడు.ఈ అవతారాన్ని దర్శించుట వలన శని,గ్రహ సంబంధమైన లోపాలు తొలగిపోతాయి అనిభక్తుల విశ్వాసం.

## తీగలకుంటపల్లి గ్రామ సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేసిన మ్యాకల స్వర్ణలత, సురేందర్ రెడ్డి




**కోహెడ : పెన్ పవర్:** సిద్దిపేట జిల్లా కోహెడ మండలం తీగలకుంటపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో నూతన సర్పంచ్‌గా ఎన్నికైన మ్యాకల స్వర్ణలత, సురేందర్ రెడ్డి మరియు ఉప సర్పంచ్ మరియు నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నూతన పాలక మండలికి శు భాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం సర్పంచ్ మ్యాకల స్వర్ణలత, సురేందర్ రెడ్డి మాట్లాడుతూ. గ్రామ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. త్రాగునీటి సమస్యలు, డ్రైనేజీ వ్యవస్థ, రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, విద్యుత్ సౌకర్యాలు, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెడతానని అన్నారు. అలాగే గ్రామ ప్రజల సమస్యలను వెంటనే గుర్తించి, వార్డు సభ్యుల సహకారంతో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలో పారదర్శక పాలన అమలు చేస్తూ, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే పాలక వ్యవస్థను నిర్మిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ రాకేష్, గ్రామ కార్యదర్శి గౌతమ్, కారోబార్ మెట్టు వెంకటరెడ్డి, మరియు గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, యువత, మహిళలు పాల్గొని నూతన పాలక మండలికి అభినందనలు తెలిపారు.

## నారాయణపూర్ గ్రామ సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేసిన హరి పుష్పలత, అశోక్



**కోహెడ : పెన్ పవర్:** సిద్దిపేట జిల్లా కోహెడ మండలం నారాయణపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో నూతన సర్పంచ్‌గా ఎన్నికైన హరి పుష్పలత, అశోక్ మరియు ఉప సర్పంచ్ మరియు నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నూతన పాలక మండలికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం సర్పంచ్ హరి పుష్పలత, అశోక్ మాట్లాడుతూ. గ్రామ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. త్రాగునీటి సమస్యలు, డ్రైనేజీ వ్యవస్థ, రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, విద్యుత్ సౌకర్యాలు, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెడతానని అన్నారు. అలాగే గ్రామ ప్రజల సమస్యలను వెంటనే గుర్తించి, వార్డు సభ్యుల సహకారంతో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలో పారదర్శక పాలన అమలు చేస్తూ, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే పాలక వ్యవస్థను నిర్మిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి,కారోబార్, గ్రామపంచాయతీ సిబ్బంది. ప్రజా ప్రతినిధులు, యువత, మహిళలు పాల్గొని నూతన పాలక మండలికి అభినందనలు తెలిపారు.

## కోహెడ గ్రామ సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేసిన బందెల సుజాత, బాలకిషన్



**కోహెడ పెన్ పవర్:** సిద్దిపేట జిల్లా కోహెడ మండలం కోహెడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నూతన సర్పంచ్‌గా ఎన్నికైన బందెల సుజాత, బాలకిషన్ మరియు ఉప సర్పంచ్ కందాల వెంకటేష్, మరియు నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నూతన పాలక మండలికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం సర్పంచ్ బందెల సుజాత, బాలకిషన్ మాట్లాడుతూ. గ్రామ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. త్రాగునీటి సమస్యలు, డ్రైనేజీ వ్యవస్థ, రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, విద్యుత్ సౌకర్యాలు, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెడతానని అన్నారు. అలాగే గ్రామ ప్రజల సమస్యలను వెంటనే గుర్తించి, వార్డు సభ్యుల సహకారంతో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలో పారదర్శక పాలన అమలు చేస్తూ, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే పాలక వ్యవస్థను నిర్మిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ చంద్రశేఖర్, గ్రామ కార్యదర్శి మాధురి, కారోబార్ తలారి అనిల్, గ్రామపంచాయతీ సిబ్బంది. ప్రజా ప్రతినిధులు, యువత, మహిళలు పాల్గొని నూతన పాలక మండలికి అభినందనలు తెలిపారు.

# గ్రేటర్ పై రేవంత్ గురి...



**హైదరాబాద్, డిసెంబర్ 22, పెన్ పవర్:** సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు గేర్ మారుస్తున్నారు. జూబ్లీహిల్స్ బైఎలక్షన్ వరకు కాస్త స్లోగా..నెమ్మదిగా వెళ్లినట్లు కనిపించిన ముఖ్యమంత్రి..ఉప ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఫుల్ స్పీడ్‌లో దూసుకెళ్తున్నారు. వెంటనే పంచాయతీ ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి మూడు విడతల్లో పల్లెపోరును కంప్లీట్ చేశారు. మెజార్టీ సర్పంచ్ స్థానాలను గెలుచుకుని ఇంకా ఫుల్ జోష్‌లోకి వచ్చారు. ఈ క్రమంలో రాజకీయంగా వేగంగా పావులు కదుపుతున్నారు. పొలిటికల్ ఈక్వేషన్స్‌ను తనకు అనుకూలంగా మార్చుకుంటూ..ఒక్కో స్టెప్ ముందుకేస్తున్నారు.పంచాయతీ ఎన్నికల గెలుపుతో..గ్రేటర్ ఎన్నికలపై దృష్టి పెట్టారట సీఎం. తెలంగాణకు ఆర్థికంగానే కాదు.. రాజకీయంగా కూడా..హైదరాబాద్ గుండె లాంటిది. అయితే హైదరాబాద్‌లో గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క అసెంబ్లీని కూడా గెలువలేకపోయింది కాంగ్రెస్. అధికారంలోకి వచ్చిన తర్వాత..ఎమ్మెల్యేల మరణంతో వచ్చిన కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో విజయం సాధించి..గ్రేటర్‌లో రెండు సీట్లను తమ ఖాతాలో వేసుకోగలిగింది హస్తం పార్టీ. అటు పంచాయతీ పోల్స్, ఇటు రెండు బైఎలక్షన్లలో గెలుపు..ఇదే ఊపుతో గ్రేటర్‌లో పాగా వేసేలా పావులు కదుపుతోంది కాంగ్రెస్ పార్టీ.రేవంత్ రెడ్డి ఇప్పటినుంచే గ్రేటర్ ఎన్నికలపై ఫోకస్ పెట్టారట. జీహెచ్‌ఎంసీలో ప్రస్తుతం 150 డివిజన్లున్నాయి. అయితే పెరుగతున్న జనాభా..నగర విస్తరణ.. ఇప్పటికే మెర్జ్ అయిన మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థల జనాభాను దృష్టిలో పెట్టుకుని కీలక నిర్ణయాలు తీసుకుంటుంది రేవంత్ సర్కార్. ఔటర్ రింగ్ రోడ్ వరకు..గ్రేటర్‌ను విస్తరించాలని డిసైడ్ చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 300 డివిజన్లు కానున్నాయి. ఈ డివిజన్ల ఏర్పాటు కూడా తుది దశకు చేరుకుంది. డివిజన్ల ఏర్పాటు పూర్తవగానే..రిజర్వేషన్ ప్రక్రియను పూర్తిచేసి..ఎన్నికలకు వెళ్లాలనేది రేవంత్ రెడ్డి వ్యూహం అంటున్నారు.ఇంతలోపు గ్రేటర్ అభివృద్ధి ఫోకస్ చేస్తూడ. ఎన్నికలకు వెళ్లాలన్నది రేవంత్ ఆలోచనగా కనిపిస్తోంది. ఇటీవల నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సక్సెస్ కావడం..సమ్మిట్ లో వచ్చిన 5 లక్షల కోట్ల పెట్టుబడులను ఎక్స్‌పోజ్ చేసుకోవాలని సర్కార్ లక్ష్యంగా పెట్టుకుందట. మెట్రో విస్తరణ, ముఖ్యంగా పాతబస్తీకి మెట్రో..ఫ్యూచర్ సిటీ, మూసీ రివర్ డెవలప్ మెంట్ కారిడార్..ఇలాంటి అంశాలపై రేవంత్ రెడ్డి సీరియస్‌గా ఉన్నారు. దీంతో నగరవాసుల్లో కాంగ్రెస్‌పై పాజిటివిటి పెరిగిందని భావిస్తున్నారట కాంగ్రెస్ లీడర్లు. దీంతో పాటు వచ్చే నెలలో దావోస్ పర్యటనతో సీఎం రేవంత్ పెట్టుబడులు తీసుకొస్తారని అంచనా వేస్తున్నారు.ఇక ఫిబ్రవరిలో జీహెచ్‌ఎంసీ పాలక మండలి పదవి కాలం ముగుస్తుండటంతో..జనవరి నెలాఖరులో గ్రేటర్ నగారా మోగించాలని రేవంత్ ప్రణాళిక సిద్ధం చేసినట్లు టాక్. ఇక అభివృద్ధి, పెట్టుబడులు, సంక్షేమం ఇవన్నీ ఒక ఎత్తు అయితే..ఎంఐఎం పార్టీతో దోస్తీ మరింత కలసి వస్తుందని భావిస్తోందట అధికార పార్టీ. కాంగ్రెస్ పోటీ చేసే స్థానాల్లో ముస్లిం ఓట్లు తమకు కన్వర్ట్ కావడంతో పాటు..ఎంఐఎంతో కలిసి గ్రేటర్ పీఠాన్ని సొంతం చేసుకోవచ్చనేది రేవంత్ ఈక్వేషన్ అంటున్నారు.ఒకవైపు పంచాయతీ ఎన్నికల్లో గెలుపు, జూబ్లిహిల్స్‌లో విక్టరీ, గ్లోబల్ సమ్మిట్ సక్సెస్‌తోడ.. ఇదే సరైన సమయంగా భావిస్తున్న రేవంత్ రెడ్డిడ. గ్రేటర్‌తో పాటు..మరికొన్ని కార్పొరేషన్, మున్సిపాలీటలను కైవసం చేసుకోవాలని ఎత్తులు వేస్తున్నారట. ఆ తర్వాత..ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు వెళ్లాలన్నది ముఖ్యమంత్రి ఆలోచనగా చెబుతున్నారు. రేవంత్ గ్రేటర్ వ్యూహం ఎంత వరకు వర్కౌట్ అవతుందో చూడాలి

## దూకుడు మీద సిట్ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం




**:హైదరాబాద్: పెన్ పవర్:** హైదరాబాద్ ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో సిట్ వేగాన్ని పెంచింది. దాంతో వరుసగా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ట్యాపింగ్ రివ్యూ కమిటీలోని వారిని సిట్ మరోసారి విచారించింది. ఈ ట్యాపింగ్ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన ప్రభాకర్ రావు ఎస్ఐబీ చీఫ్‌గా ఉన్న సమయంలో రివ్యూ కమిటీలో ఉన్న జీఏడీ సెక్రటరీ, సీఎస్‌లు, ఇంటెలిజెన్స్ చీఫ్‌ను సిట్ మరోసారి విచారించింది. వారి ఇచ్చిన స్టేట్‌మెంట్లను సిట్ రికార్డు చేసింది. ముగ్గురు మాజీ ఐఏఎస్‌లతో పాటు మాజీ ఐపీఎస్ అధికారులను సిట్ సాక్షులుగా విచారించింది.మాజీ సీఎస్‌లు సోమేష్ కుమార్, శాంతి కుమారిలను విచారించింది. అలాగే సాధారణ పరిపాలన శాఖ మాజీ పొలిటికల్ సెక్రటరీ రఘునందన్ రావుతోపాటు మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ నవీన్ చంద్‌ను కూడా విచారించింది. ఎస్ఐబీ ఓఎస్డీగా ప్రభాకర్ రావును నియమించడంపై ఐఏఎస్‌లకు సిట్ పలు ప్రశ్నలు సంధించింది. గత ప్రభుత్వంలో ఈ ముగ్గురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కీలకంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే.రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలతోపాటు మీడియా ప్రతినిధుల ఫోన్లను సైతం ప్రభాకర్ రావు ట్యాప్ చేసినట్లు తమ దర్యాప్తులో సిట్ గుర్తించింది. ప్రభాకర్ రావు ఇచ్చిన నెంబర్లను యథావిధిగా హోం శాఖకు ఈ మాజీ ఐపీఎస్ అధికారులు పంపినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనుబంధ చార్జ్‌షీట్ ఫైల్ చేసేందుకు సిట్ ప్రయత్నాలు చేపట్టింది. మరోవైపు ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఇప్పటికే ఉన్నతాధికారులను సిట్ చీఫ్, హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ ఆదేశించిన విషయం విదితమే.రంగంలోకి సిద్ధిపేట సీపీ:మరోవైపు ఈ కేసులో మూడో రోజు ప్రభాకర్ రావు కస్టడీ విచారణ కొనసాగుతోంది. ఆయన్ని విచారించేందుకు సిట్‌లో సభ్యుడు అయిన సిద్ధిపేట సీపీ విజయ్ కుమార్ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రభాకర్ రావును సిద్ధిపేట సీపీ విచారించనున్నారు. గతంలో ఇదే కేసులో పలుమార్లు ప్రభాకర్ రావును విజయ్ కుమార్ విచారించిన విషయం విదితమే. ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో త్వరలో కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉందనే ఒక చర్చ సైతం సాగుతోంది.

## రాచకొండ పరిధిలో పెరిగిన నేరాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది నేరాలు పెరిగాయి. 2024లో 28,626 కేసులు నమోదు కాగా.. 2025లో ఈ సంఖ్య 33,040కు పెరిగింది. మహిళలపైనా గత ఏడాదితో పోలిస్తే 4 శాతం అధికంగా నేరాలు నమోదయ్యాయి. కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది 21,056 కేసులను (78 శాతం) పరిష్కరించాం. 12 కేసుల్లో దోషులకు 20 ఏళ్ల జైలుశిక్ష పడేలా దర్యాప్తు చేశామని సీపీ సుధీర్ బాబు అన్నారు.అడ్డగూడూరు పీఎస్ పరిధిలో జరిగిన హత్య కేసులో 17 మంది నిందితులకు జీవిత ఖైదు పడింది. సైబర్ నేరాలకు పాల్పడిన వారిపై 3,734 కేసులు నమోదు చేశాం. 6,188 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశాం. సైబర్ క్రైమ్ బాధితులకు రూ.40.10 కోట్లను రిఫండ్ చేశాం. డ్రగ్స్ రవాణా చేస్తున్న 495 మందిని అరెస్టు చేసి., 20 కోట్లు విలువ చేసే మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నాం. ఇందులో తెలంగాణకు చెందిన వారు 322 మంది, ఇతర రాష్ట్రాల వారు 172 మంది, ఒక విదేశీయుడు ఉన్నారు. కమిషనరేట్ పరిధిలో 227 ఎన్డీపీఎస్ అనుమానిత షీట్లను తెరిచాం. నాన్బెయిలబుల్ వారెంట్ ఫ్రీ కమిషనరేట్గా రాచకొండను తీర్చిదిద్దాం" అని రాచకొండ సీపీ సుధీర్ బాబు వెల్లడించారు.ఈ యేడాది 579 కిడ్నాప్ కేసులు, 1224 పోక్సో కేసులు, దోపిడి కేసులు 3, దొంగతనాలు 67, ఇళ్లలో చోరీలు 589, వాహనాల చోరీలు 876, సాధారణ చోరీలు 1,161, హత్యలు 73, అత్యాచారాలు 330, వరకట్నం మరణాలు 12, గృహ హింస కేసులు 782 నమోదయ్యాయని అన్నారు

## కొత్త సర్పంచుల ప్రమాణ స్వీకారం: గ్రామాల్లో సందడి

**గద్వాల, డిసెంబర్ 22 పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రంలో కొత్త సర్పంచులు, వార్డ్ మెంబర్లు, ఉప సర్పంచులు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. జోగులాంబ గద్వాల జిల్లా, గద్వాల్లోని ఇర్కిచేడు గ్రామంలో సర్పంచ్ ఆంజనేయులు బాధ్యతలు చేపట్టారు. గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ కార్యదర్శులు తమపై భారం తగ్గుతుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## బాధ్యతలకు సిద్ధం.. నిధులొస్తేనే అభివృద్ధి పథం

**మహబూబ్నగర్, డిసెంబర్ 22 పెన్ పవర్:** ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పంచాయతీ పాలకవర్గాలు కొలువుదీరనున్నాయి. అభివృద్ధి, కొత్త పాలకులపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. అయితే పంచాయతీల ఖజానా ఖాళీగా ఉండటంతో పనులెలా చేయాలని ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే గత సర్పంచులు చేసిన పనులకు సంబంధించి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.180 కోట్ల మేర బిల్లులు పెండింగ్లో ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులతో పాటు సాధారణ, ఉపాధి హామీ పథకం, పన్నుల వసూలు తదితర నిధులే పంచాయతీలకు

ప్రధాన ఆదాయ వనరు. ఉద్యోగుల జీతభత్యాలకు 30 శాతం, పారిశుద్ధ్యం వీధిదీపాలకు, మంచినీరు తదితర వాటికి 15 శాతం చొప్పున రహదారులు, కాల్వలకు 20 శాతం, ఇతర అవసరాలకు 10 శాతం చొప్పున నిధులు వెచ్చించాల్సి ఉంటుంది.

## బీఆర్ఎస్ కార్యక్రమానికి ఫంక్షన్ హాల్ బ్రేక్

**రంగారెడ్డి : పెన్ పవర్:**శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్లో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటన నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అనిల్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈనెల 26వ తేదీన కేటీఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరేందుకు శ్రీ గోదాకృష్ణ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమం విషయంలో స్థానిక కార్పొరేటర్, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే ఇద్దరూ కలిసి ఫంక్షన్ హాల్ యాజమాన్యాన్ని భయభ్రాంతులకు గురి చేయడంతో ఆరోజు జరగవలసిన ఫంక్షన్ ను ఇక్కడ వద్దంటూ వారు చెప్పారని అన్నారు. తాము ఇప్పటికే నిర్వాహకులకు డబ్బులు సైతం అడ్వాన్స్ రూపంలో చెల్లించామని ఎమ్మెల్యే భయపెట్టడంతో ఇలా జరిగిందన్నారు. ఇలాంటి పద్ధతులు మార్చుకోవాలని ఎమ్మెల్యేకు సూచించారు. స్పీకర్ సైతం పార్టీ ఫిరాయింపుల పైన స్పందించి ఎమ్మెల్యే గాంధీ బిఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నారని చెప్పిన విషయాన్ని గుర్తు చేసిన ఆయన తనతో పాటు ఈనెల 26వ తేదీన కేటీఆర్ వస్తున్న నేపథ్యంలో సభకు వచ్చి చేరికలు భాగస్వాములు కావాలని ఆయన కి సూచించారు. ఇలాంటి బెదిరింపులకు తాము భయపడమని ఎట్టి పరిస్థితుల్లో కేటీఆర్ సమక్షంలో భారీ ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు బిఆర్ఎస్ లో చేరుతారని వెల్లడించారు

## ప్రియుడు నిరాకరించడంతో యువతి ఆత్మహత్య

**రంగారెడ్డి: పెన్ పవర్:** ప్రేమ విఫలమై ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాచకొండ కమిషనరేట్ మీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్మాస్గూడ ఎస్ఎస్ఆర్ నగర్ కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా నివాసం ఉంటున్న అంబాదళ అశోక్,రూప వీరికి ఇద్దరు పిల్లలు. బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి విహారిక (20), స్థానికంగా ఉండే కిషోర్ కొన్ని సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. ప్రేమించిన వ్యక్తి పెళ్లికి నిరాకరించడంతో తీవ్రమైన స్థాపంతో విహారికి ఆత్మహత్య చేసుకుంది. ఈనెల 17న ఇంటి నుండి వెళ్లిపోయింది.తల్లిదండ్రులు మీర్పేటలో మిస్సింగ్ కేసు నమోదు చేసారు. కిషోర్ 18న అమ్మాయిని తీసుకువచ్చి ఇంటి వద్ద వదిలివెళ్లాడు. పెళ్లి చేసుకోమని తల్లిదండ్రులు కోరడంతో కిషోర్ నిరాకరించాడు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

# టీబీజేపీకి ఏమైంది...

**హైదరాబాద్, డిసెంబర్ 22, పెన్ పవర్:** భారతీయ జనతాపార్టీ.. దశాబ్దా కాలంగా దేశంలో ఒక వెలుగు వెలుగుతోంది. మెజారిటీ రాష్ట్రాల్లో సొంతంగా, కొన్ని రాష్ట్రాల్లో మిత్రులతో కలిసి అధికారంలో ఉంది. కానీ తెలంగాణలో బీజేపీ బలపడడం లేదు. ప్రజలు ఆ పార్టీని ఆదరిస్తున్నా.. గెలిపించాలని చూస్తున్నా.. ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడంలో పార్టీ విఫలవుతోంది. ఇందుకు తాజాగా ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన హెచ్చరికే నిదర్శనం. ఎంఐఎం పార్టీకన్నా బలహీనంగా ఉందని పోల్చడం ద్వారా తెలంగాణలో పార్టీ పరిస్థితిని ఎంపీలకు గుర్తు చేశారు.బీజేపీకి సినీ నటుల ఆదరణ ఎక్కువ. చాలా మంది టాలీవుడ్, బాలీవుడ్, మాలీవుడ్, మరాఠా, కన్నడ, మళయాలీ నటులు బీజేపీలో ఉన్నాయి. తాజాగా సీనియర్ నటి ఆమని తాజాగా బీజేపీలో చేరనుందని ప్రకటించడంతో పార్టీలో ఉత్సాహం నెలకొంది. అయినా తెలంగాణలో బీజేపీ బలపడడం లేదు. తెలంగాణ ప్రజలు బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని ఆశిస్తున్నారు. అయితే, కొందరు నాయకులు కాంగ్రెస్‌తో, మరికొందరు బీఆర్‌ఎస్‌తో దగ్గరి సంబంధాలు పెంచుకుంటున్నారు, ఇది పార్టీ ఐక్యతకు సవాల్‌గా మారింది.బీజేపీ పంచాయతీ ఎన్నికల్లో నిర్మల్ జిల్లాలో కాంగ్రెస్‌కు మించి స్థానాలు సాధించింది. ఇక్కడ ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ఉన్న ప్రాంతంలో భారీగా పంచాయతీలు గెలవడం నాయకుల స్వేచ్ఛాయుత నిర్ణయాలకు ఉదాహరణ. అయినప్పటికీ, అంతర్గత విరోధాలు పెరగడంతో పార్టీకి కష్టాలు తెచ్చాయి. ప్రధాని మోదీ ఇటీవల హెచ్చరించినా, నాయకుల పద్ధతి మారలేదు.లోక్‌సభ ఎన్నికల్లో 8 స్థానాలు ఇచ్చి మద్దతు పొందినా, కంటోన్‌మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో త్వరిత




నిర్ణయాలు తీసుకోలేక భారీ నష్టం అయింది. సర్పంచ్ ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చినా, అధిష్టానం నాయకులకు స్వతంత్రత ఇవ్వడంలో విఫలమవుతోంది. ఇలా కొనసాగితే చారిత్రక తప్పు జరుగుతుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.పార్టీలో అందరూ పనిచేసే నాయకులు ఉన్నప్పటికీ, అంతర్గత కలహాలు, జాప్య నిర్ణయాలు భవిష్యత్‌ను ప్రమాదంలోకి నెట్టుతున్నాయి. ఇప్పటికైనా ఐక్యత పెంచి, నాయకుల స్వేచ్ఛను ప్రోత్సహించాలి. లేకపోతే తెలంగాణలో బీజేపీ అవకాశాలు దూరమవుతాయి.

# మధ్య తరగతి వారి కోసం గచ్చిబౌలిలో ఇళ్లు

**హైదరాబాద్, డిసెంబర్ 22, పెన్ పవర్:** పేద, మధ్య తరగతి ప్రజలకు సొంతిల్లు ఒక కల. అందులో హైదరాబాద్ వంటి నగరంలో సొంతిల్లు ఉంటే అది చాలు. అదీ గచ్చిబౌలిలో ఇల్లు తక్కువ ధరకు లభిస్తే అంతకంటే ఏంకావాలి? అందుకోసమే తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పేద, మధ్యతరగతి ప్రజల కోసం సింగిల్ బెడ్ రూం ఇళ్లను అందుబాటులోకి తెచ్చింది. సింగిల్ బెండ్ రూం ఇళ్లను తెలంగాణలోని ముఖ్యమైన ప్రాంతాల్లో విక్రయించేందుకు ప్రభుత్వం సిద్ధమయింది. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈవేలం ద్వారా ఈ గృహాలను సొంతం చేసుకునే వీలుంది.ప్రధానంగా హైదరాబాద్ వంటి నగరంలో అదీ గచ్చిబౌలి లో ఒక చిన్న ఇల్లు ఉన్నా చాలు. ఇక జీవితం స్థిరపడిపోయినట్లే. అందుకే లోయర్ ఇన్ కమ్ గ్రూపుల వారి కోసం తీపికబురు చెప్పింది. హైదరాబాద్ తో పాటు ఖమ్మం, వరంగల్ లోని 339 ప్లాట్లను అందుబాటులోకి తెచ్చింది. తక్కువ మొత్తంతో ఈ ప్లాట్లను కొనుగోలు చేసే వీలుంది. ఇరవై ఆరు లక్షల నుంచి ముప్ఫయి లక్షలోపు చెల్లించి ప్లాట్ ను సొంతం చేసుకునే వీలుంది. తెలంగాణ హౌసింగ్ బోర్డు ఈ మేరకు పత్రికల్లోనూ ప్రకటన జారీ చేసింది. అయితే నెలకు యాభై వేల రూపాయలు లోపు ఉన్నవారు మాత్రమే ఈ ఇంటిని సొంతం చేసుకోవడానికి అర్హులు.తెలంగాణ హౌసింగ్ బోర్డు వీటిని నిర్మించింది. ఇందులో ఖాళీగా ఉన్న 339 ప్లాట్లను విక్రయించేందుకు వేలం నిర్వహిస్తుంది. గచ్చిబౌలిలో 111 ప్లాట్లు ఉన్నాయి. వరంగల్ లో 102, ఖమ్మంలో 126 ప్లాట్లు అందుబాటులో ఉన్నాయని, ఇవన్నీ ప్రైమ్ ఏరియాలోనే అందుబాటులో ఉన్నట్లు తెలిపింది. అయితేవీటిని కొనుగోల చేయడానికి గడువును కూడా విధించింది. 540 - 620 చదరపు అడుగుల్లో వీటిని నిర్మించారు. ఒక చిన్న కుటుంబానికి ఈ ఇళ్లు సరిపోతాయని,భవిష్యత్ బాగుంటుందన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతుంది.గచ్చిబౌలిలో ప్లాట్ల ధర 26 లక్షల నుంచి 36.20 లక్షలవరకూ నిర్ణయించింది. వరంగల్ లో 19 నుంచి 21.50 లక్షలకు, ఖమ్మంలో 11.25 లక్షలకు మాత్రమే విక్రయించనున్నారు. ఈ ప్లాట్లను సొంతం చేసుకోవాలంటే లక్షరూపాయలు డిపాజిట్ ను చెల్లించాల్సి ఉంటుంది. ఆన్ లైన్ లోనూ, మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకునే వీలుంది. గచ్చిబౌలి ప్లాట్లను వచ్చే నెల 6వ తేదీ, వరంగల్ ప్లాట్లను జనవరి 8న, ఖమ్మంలోని ప్లాట్లను జనవరి 10న లాటరీ తీస్తారు. లాటరీ లో ఎంపికయిన వారికి మాత్రమే ప్లాట్లను కేటాయించనున్నారు. మరిన్ని వివరాలకు https://tghb.cgg.gov.in వెబ్ సైట్ లో చూడవచ్చు

# జనవరి చివరి తర్వాత...

**హైదరాబాద్, డిసెంబర్ 22, పెన్ పవర్:**తెలంగాణలో పంచాయతీ ఎన్నికల సందడి ముగిసింది. హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేసిన సర్పంచ్ అభ్యర్థులు ఎక్కువ స్థానాల్లో గెలవగా.. బీఆర్ఎస్ కూడా గట్టి పోటీ ఇచ్చింది. మొత్తం మూడు విడతలుగా ఎన్నికలు జరగ్గా.. 1205 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 11,497 స్థానాలకు ఎన్నికలు జరగ్గా.. 1,25,23,137 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 85.360 శాతం పోలింగ్ నమోదైంది. కాంగ్రెస్ మద్దతుదారులు 7,010, బీఆర్ఎస్ మద్దతుదారులు 3502 మంది గెలిచారు. ఇక బీజేపీ 688 స్థానాలను దక్కించుకుంది.సర్పంచ్ ఎన్నికలు ముగియడంతో ఇప్పుడు అందరూ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనేది చర్చనీయాంశంగా మారింది. అయితే ఓటర్ల సమగ్ర సవరణ జాబితా సిద్ధం చేయాల్సి ఉండటం వల్ల ఈ ఎన్నికల నిర్వహణ ఆలస్యమవుతోంది. వచ్చే ఏడాది జనవరి తొలి వారంలో కేంద్ర ఎన్నికల సంఘం సమగ్ర సవరణ జాబితా విడుదల చేసే అవకాశముంది. ఈ జాబితా ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం భావిస్తోంది. సర్పంచ్ ఎన్నికలతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ న్యాయపరమైన చిక్కుల వల్ల ఆగిపోయాయి. ఓటర్ల సవరణ జాబితా వచ్చిన తర్వాత ఈ ఎన్నికలను నిర్వహించనున్నారు. ఓటర్ల సవరణ జాబితా అందిన తర్వాత వార్డుల వారీగా ఓటర్ల విభజన చేయాల్సి ఉంటుంది. దీంతో జనవరి చివరి నాటికి ఎన్నికలు నిర్వహించే అవకాశం లేదని తెలుస్తోంది.ఇక ఫిబ్రవరిలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరిగే అవకాశముందని తెలుస్తోంది. అలాగే మున్సిపల్ ఎన్నికలను కూడా నిర్వహించాల్సి ఉంది. అయితే మున్సిపల్ వార్డుల విభజనకు సంబంధించిన వివరాలను ప్రభుత్వం ఇంకా ఈసీకి అందించలేదు. ఈ ప్రక్రియ పూర్తైన తర్వాత మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశముంది. దీంతో ఫిబ్రవరిలో మిగిలిన స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగే అవకాశముందని సమాచారం. సర్పంచ్ ఎన్నికల్లో




గెలిచిన జోష్‌లో కాంగ్రెస్ ఉండగా.. రాబోయే ఎన్నికల్లో కూడా గట్టి పోటీ ఇవ్వాలని బీఆర్ఎస్ భావిస్తోంది.

# పంజా విసురుతున్న చలిడేంజర్ లో హైదరాబాద్ ఎయిర్



**హైదరాబాద్, డిసెంబర్ 22, పెన్ పవర్:**తెలంగాణలో చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ప్రజలు గజగజా వణికిపోతు న్నారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు రాష్ట్రంలోనే అత్యల్పంగా సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో ఐదు డిగ్రీల సెల్సియస్ నమోదైంది. దాదాపు 15 జిల్లాల్లో 10డిగ్రీల సెల్సియస్ లోపే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వికారాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, అదిలాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాల్లోని అనేక మండలాల్లో చలి తీవ్రత అధికంగా ఉంది. అయితే, తెలంగాణలోని మమంగళ, బుధవారాల్లో చలితీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది.తెలంగాణపై చలి పులి పంజా విసురుతోంది. రికార్డు స్థాయి అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం, రాత్రి వేళల్లో బయటకు రావాలంటే ప్రజలు వణికిపోతున్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు చలి ఎక్కువగా ఉన్న సమయాల్లో బయటకు రావొద్దని, ఒకవేళ వచ్చినా చలి తీవ్రతను తట్టుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇదిలాఉంటే.. హైదరాబాద్ నగరంలో ప్రమాదకర స్థాయికి వాయు కాలుష్యం చేరింది.దేశ రాజధాని ఢిల్లీ సహా ఇతర నగరాలకు ముప్పుగా మారిన వాయు కాలుష్యం తాజాగా.. హైదరాబాద్ నగరాన్ని చుట్టుముట్టింది. భాగ్యనగర వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 255కు చేరుకుని ప్రమాదకర స్థాయికి చేరింది. ముఖ్యంగా బాలానగర్, సనత్ నగర్, జీడిమెట్ల, మల్లాపూర్ వంటి పారిశ్రామిక, రద్దీ ప్రాంతాల్లో కాలుష్యం తీవ్రంగా ఉంది. శీతాకాలపు పొగమంచుకు తోడు వాహనాల ఉద్గారాలు, చెత్త దహనం వల్ల గాలిలో సూక్ష్మ ధూళి కణాలు భారీగా పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో సైనసైటిస్, డస్ట్ అలర్జీ, శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, ముఖ్యంగా ఉదయం వేళల్లో వ్యాయామాలకు దూరంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు రాత్రిపూట రాష్ట్ర వ్యాప్తంగా 4.5 నుంచి 11.12 డిగ్రీల సెల్సియస్ మధ్య కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి తీవ్రతతో ఉదయం 8గంటల తరువాతే ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వస్తున్నారు.సంగారెడ్డి జిల్లాల్లో పదేళ్ల రికార్డు స్థాయి కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ జిల్లాలోని కోహిర్ లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 4.5డిగ్రీలు నమోదైంది. గతేడాది ఇదే సమయంలో 17.8డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ లో 4.8డిగ్రీలు నమోదైంది. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోనూ పదేళ్లలోనే అత్యంత తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఖమ్మం, వనపర్తి, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట మినహా మిగిలిన జిల్లాల్లో 10డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ జిల్లాల్లోనూ 11.2 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలితీవ్రత ఎక్కువగా ఉండటంతో చిన్న పిల్లలు, వృద్ధులు రాత్రి, ఉదయం వేళ్లలో బయటకు రావొద్దని వైద్య నిపుణులు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వచ్చినా చలి తీవ్రతను తట్టుకునేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.హైదరాబాద్ నగరంలో కూడా ఈ ఏడాదిలోనే అత్యంత చలితీవ్రత నమోదైంది. నగరంలో సగటు కనిష్ఠ ఉష్ణోగ్రత 10 డిగ్రీలుగా ఉన్నప్పటికీ.. జీహెచ్ఎంసీ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ఇది ఇంకా తక్కువగా ఉంది. శేరిలింగంపల్లిలో 7.8డిగ్రీలు, మల్కాజిగిరి ప్రాంతంలో 8.3 డిగ్రీలు, రాజేంద్ర నగర్ ప్రాంతంలో 9.1 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## నూతన సర్పంచుల ప్రమాణ స్వీకారానికి హాజరైన ఎమ్మెల్యే



**ఆదిలాబాద్, డిసెంబర్ 22 పెన్ పవర్:** నిర్మల్ రూరల్ మండలం చిట్యాల్, తల్వేద గ్రామపంచాయతీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సోమవారం హాజరయ్యారు. కొత్త సర్పంచ్ లు ఏనుగు సుప్రియ వెంకట్ రెడ్డి, గుమిడ్యాల లక్ష్మీ, ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నిర్మల్ నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

## గ్రామాల అభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**బోథ్, డిసెంబర్ 22(ఎ.ఎం.ఎస్):** నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జి కూచాడి శ్రీహరి రావు మాట్లాడుతూ, గ్రామాల అభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సారంగాపూర్, నర్సాపూర్ (జి), దిలవార్ పూర్, దిమ్మదుర్తి, స్వర్ణ గ్రామాల్లో సోమవారం నూతన గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుందని, నూతన సర్పంచులు గ్రామాలను మోడల్ విలేజ్ గా తీర్చిదిద్దాలని ఆయన అన్నారు.

## శ్రీ రాములయ్య ద్వితీయ వార్షికోత్సవం: భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న వేడుకలు

**నిర్మల్, డిసెంబర్ 22 పెన్ పవర్:** నిర్మల్ రూరల్ మండలంలోని న్యూ ముజ్గి గ్రామంలో శ్రీ రాములయ్య ద్వితీయ వార్షికోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతోంది. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరిస్తున్నారు. సోమవారం యజ్ఞ క్రతువులో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంబరి గంగాధర్, నానం నాగేందర్, ఆడెపు నర్సయ్య, రాజుల భూమన్నలు పాల్గొన్నారు.

## జాఫ్రాపూర్ సర్పంచ్, ఉపసర్పంచ్ ప్రమాణ స్వీకారం

**ముథోల్, డిసెంబర్ 22 పెన్ పవర్:** సోన్ మండలంలోని జాఫ్రాపూర్ గ్రామ సర్పంచ్ గా బర్ల రాజు రెడ్డి, ఉపసర్పంచ్, వార్డ్ సభ్యులు సోమవారం అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి తోడిశెట్టి పరమేశ్వర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పద్ధతులలో గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు పాటుపడాలని సూచించారు. అనంతరం నూతన ప్రజాప్రతినిధులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు.

## నిర్మల్ ప్రభుత్వ కళాశాలలో ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

**ఖానాపూర్, డిసెంబర్ 22 పెన్ పవర్:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మల్ గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం సుధాకర్ ఒక ప్రకటనలో ఈ విషయాన్ని తెలిపారు. గణిత శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ కట్ట రమేష్ మాట్లాడుతూ, పుట్టినరోజును 4/4 గమ్మాత్తుగా తయారు చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డా యు గంగాధర్, జాకీర్, సూర్య సాగర్, శ్రీహరి, రహమాన్, త్రిపాఠీ రెడ్డి, డా రంజిత్ కుమార్ తో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచ్, ఉప సర్పంచ్, సభ్యులకు శుభాకాంక్షలు!



**కరీంనగర్, డిసెంబర్ 22 పెన్ పవర్:** కరీంనగర్ జిల్లా, రామగిరి మండలం నాగేపల్లి గ్రామపంచాయతీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. నూతన సర్పంచ్, ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ, వారి నాయకత్వంలో గ్రామం అభివృద్ధి చెందాలని, సమస్యలు పరిష్కారమై ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దబడాలని ఆకాంక్షించారు. ఈ శుభాకాంక్షలు 2025 డిసెంబర్ 22న తెలిపినట్లుగా ఉంది.

## అయ్యప్ప స్వామి పడిపూజ ఘనంగా నిర్వహణ, అన్నదానం

**మానకొండూరు, డిసెంబర్ 22 పెన్ పవర్:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని పోరండ్ల గ్రామంలో సోమవారం ఉదయం అర్చకులు కలకుంట్ల శేషాచారి శ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో తోడెంగ పర్శరాములు గారు అయ్యప్ప స్వామి పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకం, కెన్నెస్వాముల నృత్యాలు చేస్తూ భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చింతల్ ఠాణాలో సర్పంచ్ లేకుండానే ప్రమాణం

**హుజూరాబాద్, డిసెంబర్ 22 పెన్ పవర్:** : వేములవాడ అర్బన్ మండలం చింతల్ ఠాణా ఆర్ అండ్ ఆర్ కాలనీ పంచాయతీలో సర్పంచ్ లేకుండానే పంచాయతీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం నిర్వహించనుంది. సర్పంచ్ అభ్యర్థి శేర్ల మురళి ఎన్నికలకు ముందే గుండెపోటుతో మరణించినప్పటికీ, 11వ తేదీన జరిగిన ఎన్నికల్లో 358 ఓట్ల తేడాతో గెలుపొందారు. దీంతో అధికారులు ప్రస్తుతానికి ఉపసర్పంచ్, వార్డు సభ్యులతో ప్రమాణం స్వీకారం చేయించాలని నిర్ణయించారు.

# సెంటిమెంట్ రాజకీయాలనే నమ్ముకున్న కేసీఆర్



**హైదరాబాద్, డిసెంబర్ 22, పెన్ పవర్:** చాలాకాలం తర్వాత గులాబీ దళపతి కేసీఆర్ తెలంగాణ భవన్ కు వచ్చారు.. కొంతకాలంగా వరుస ఓటములు ఎదుర్కొంటూ.. అంతర్గతంగా కూడా ఇబ్బంది పడుతున్న పార్టీకి జవసత్వం కల్పించాలని కెసిఆర్ నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా వ్యవసాయ క్షేత్రం నుంచి నేరుగా శనివారం రాత్రి నంది నగర్ వచ్చారు.. ఆ తర్వాత ఆదివారం భారత రాష్ట్ర సమితి కార్యాలయంలో పార్టీ ఎంపీలు, ఇతర నాయకులతో సమావేశం నిర్వహించారు. ఏ అంశాలపై సమావేశం నిర్వహిస్తామో గులాబీ పార్టీ ముందుగానే మీడియాకు లీకులు ఇచ్చింది. దానికి తగ్గట్టుగానే ఆ పార్టీ అనుకూల మీడియా డబ్బాలు కొట్టింది.సమావేశంలో కేసీఆర్ మరోసారి సెంటిమెంట్ మాటలను మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటే తెలంగాణ రాష్ట్రం పాలిట శాపం అని కెసిఆర్ వ్యాఖ్యానించారు. సమైక్య రాష్ట్రంలో ఉమ్మడి పాలమూరు జిల్లా వివక్షకు గురైందని ఆరోపించారు. పాలమూరు జిల్లాకు రావాల్సిన నీళ్లు ఇప్పటికీ రావడంలేదని.. పాలమూరు, రంగారెడ్డి జిల్లాలకు 174 టీఎంసీల నీళ్లు రావాలని, కానీ అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఆర్పీ యాక్ట్ ప్రకారం కూడా అదే అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాన్ని పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. వాస్తవానికి పాలమూరు, రంగారెడ్డి జిల్లాల కోణంలో మాట్లాడితే పెద్దగా ఇబ్బంది ఉండేది కాదు. కానీ ఎప్పుడైతే ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటే.. తెలంగాణ రాష్ట్రానికి అతిపెద్ద అన్యాయమని కెసిఆర్ అనడంతో ఒక్కసారిగా చర్చ మొదలైంది.గులాబీ పార్టీ మొదటి నుంచి కూడా సెంటిమెంట్ రాజకీయాలను మాత్రమే నమ్ముకుంది. 2014, 2018 ఎన్నికల్లో సెంటిమెంట్ రగిలించి అధికారాన్ని దక్కించుకుంది. 2023లో ఈ పాచిక పారలేదు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో స్వయంగా కేసీఆర్ వచ్చి ప్రచారం చేసినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. ఆ పార్టీ చరిత్రలో తొలిసారిగా 0 ఎంపీ సీట్లను దక్కించుకుంది. ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో.. అంతకుముందు జరిగిన కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కూడా గులాబీ పార్టీ దారుణమైన ఫలితాలను చవిచూసింది.

పంచాయతీ ఎన్నికల్లో కూడా గులాబీ పార్టీ అనుకున్న స్థాయిలో స్థానాలు రాలేదు.మరికొద్ది రోజుల్లో జెడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తున్న నేపథ్యంలో గులాబీ దళపతి రంగంలోకి వచ్చారు. భారత రాష్ట్ర సమితి కార్యాలయంలో పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు..”ఒకప్పుడు యూరియా ఇంటికి, చేరు వద్దకు వచ్చేది. ఇప్పుడు కుటుంబమంతా లైన్లో నిలబడే పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రకటించకపోగా ఉన్న వాటిని ఆపేసింది. రాష్ట్రంలో ప్రజల ఆస్తుల విలువ పూర్తిగా తగ్గిపోయింది. రైతులను ఆదుకోవడానికి.. వారి పొలాలకు నీరును అందించడానికి నిర్మించిన చెక్ డ్యాములు కూడా పేల్చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో గులాబీ పార్టీ మెరుగైన ఫలితాలు సాధించింది. ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టంగా కనిపించింది. గర్వంగా ఎగిరే కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ప్రజలు బుద్ధి చెప్పారు. మేము అధికారంలో ఉన్నప్పుడు అహంకారం ప్రదర్శించలేదు. పార్టీ గుర్తులతో జరిగే ఎన్నికలయితే గులాబీ పార్టీ సత్తా తెలిసేది. నన్ను తిట్టడం, చావాలని శాపాలు పెట్టడమే ఈ ప్రభుత్వ విధానమని” కెసిఆర్ పేర్కొన్నారు.చాలా రోజుల తర్వాత పార్టీ రాష్ట్ర కార్యాలయంలోకి వచ్చిన కేసీఆర్.. చాలా విషయాలు మాట్లాడతారని అందరూ అనుకున్నారు.. కానీ ఆయన సెంటిమెంట్ రాజకీయాలని మళ్ళీ నమ్ముకున్నారు. అయితే ఇప్పటికే రెండు రాష్ట్రాల్లో వాతావరణం ఒకప్పటి మాదిరిగా లేదు.. అక్కడివాళ్ళు ఇక్కడ.. ఇక్కడి వాళ్ళు అక్కడ రకరకాల వ్యాపారాలు చేస్తున్నారు. ప్రజలు కూడా స్నేహభావంతోనే ఉన్నారు. 2023 లో ఎన్నికలు జరిగే ఒకరోజు ముందు నాగార్జునసాగర్ డ్యాం మీద ఏపీ పోలీసులు ఎంతటి హంగామా చేశారో అందరికీ తెలుసు. అప్పుడే తెలంగాణ ప్రజలు తమ మనోగతాన్ని ఓటు రూపంలో వెల్లడించారు. అలాంటప్పుడు ఇప్పుడు కేసీఆర్ ఏపీ ఏర్పాటు తెలంగాణ శాతం అనే మాటలను ప్రజలు ఎంతవరకు నమ్ముతారనేది వేచి చూడాల్సి ఉంది.

# ఇమ్మాన్యుయేల్ కు బిగ్ బాస్ నుంచి 33 లక్షలు



**హైదరాబాద్, డిసెంబర్ 22, పెన్ పవర్:** బిగ్ బాస్ సీజన్ 9.. నరాలు తెగే ఉత్కంఠ మధ్య కళ్యాణ్ పడాలను విజేతగా ప్రకటించారు నాగార్జున. అయితే ఈ గ్రాండ్ ఫినాలే ఎపిసోడ్ లో అడియన్స్ సైతం అవాక్కయ్యేలా ఊహించినది జరిగింది అంటే అదిఇమ్మాన్యుయేల్ ఎలిమినేషన్ మాత్రమే. నిజానికి ఓటింగ్ ప్రకారం ఇమ్మూ టాప్ 3లో బయటకు రావాల్సింది. కానీ ఎవరూ ఊహించని విధంగా టాప్ 4లో బయటకు వచ్చేశాడు. దీంతో అందరూ షాకయ్యారు. మరోవైపుఇమ్మూ అన్ ఫెయిర్ ఎలిమినేషన్ అంటూ నెట్టింట కామెంట్స్ చేస్తున్నారు అడియన్స్. కమెడియన్ గా హౌస్ లోకి అడుగుపెట్టిన ఇమ్మూ.. కమెడియన్ అంటే కేవలం కామెడీ చేయడమే కాదని.. టాస్కులలోనూదుమ్మురేపాడు. సీజన్ మొత్తంలో అత్యధిక టాస్కులు గెలిచిన వ్యక్తి సైతం ఇమ్మూనే. అలాగే హౌస్ లో మూడు సార్లు కెప్టెన్ అయ్యాడు. పది వారాలపాటు నామినేషన్స్ లేకపోయినా.. ఎక్కువగా ఓటింగ్‌తెచ్చుకున్నాడు .ఇమ్మూ లేకపోతే ఈ సీజన్ 9 లేదు అనేట్టుగా తన కామెడీ తో ప్రేక్షకులను ఎంటర్టైన్ చేశాడు. అలాగే తన ఆట తీరుతో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచాడు. విన్నర్ కాకపోయినా.. టాప్ 3లో ఉంటాడని అందరూఅనుకున్నారు. కానీ అసలు ఎవరూ అనుకోని విధంగా టాప్ 4లో ఎలిమినేట్ కావడంతో అందరూ ఆశ్చర్యపోయారు. ఎలిమినేట్ తర్వాత ఇమ్మూ మాట్లాడుతూ.. బిగ్ బాస్ చాలా నేర్పించిందని.. చాలా వదులుకునిఇక్కడికి వచ్చాను.. ఎలా ఉన్నా మనిషిలా ఉండాలని బిగ్ బాస్ నేర్పించిందని.. పేరెంట్స్ విలువ తెలిసేలా చేసిందని చెప్పుకొచ్చాడు.ఇదెలా ఉంటే.. ఇప్పుడు ఇమ్మూ బిగ్ బాస్ రెమ్యునరేషన్ గురించి నెట్టింట టాక్‌నడుస్తుంది. ఇమ్మూకు రోజుకు రూ.35 వేల రెమ్యునరేషన్ ఇచ్చినట్లు సమాచారం. అంటే.. వారానికి రూ.2.25 లక్షలు తీసుకున్నారని.. మొత్తం 15 వారాలకు గానూ ఏకంగా రూ.33 లక్షల 75 వేల పారితోషికంతీసుకున్నట్లు సమాచారం. విన్నర్ కావాల్సిన ఇమ్మూ.. చివరకు టాప్ 3లోనూ లేకుండా ఎలిమినేట్ కావడంపై అడియన్స్ ఫైర్ అవుతున్నారు. అన్ ఫెయిర్ ఎలిమినేషన్ అంటూ నెట్టింట సీరియస్ అవుతున్నారు.

# కాంగ్రెస్ పార్టీలో పంచాయతీ సెగ..16 మంది ఎమ్మెల్యేలపై సీరియస్..!!

**హైదరాబాద్, డిసెంబర్ 22, పెన్ పవర్:** తెలంగాణలో ఇటీవల ముగిసిన పంచాయతీ ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీకి ఒకవైపు విజయోత్సాహాన్ని ఇచ్చినా, మరోవైపు అంతర్గత లోపాలను ఎత్తిచూపాయి. క్షేత్రస్థాయిలో పార్టీ పట్టును నిరూపించుకోవాల్సిన ఈ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడంపై ఏఐసీసీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ముఖ్యంగా సొంత నియోజకవర్గాల్లో పట్టు కోల్పోయిన 16 మంది ఎమ్మెల్యేలపై హైకమాండ్ ఆగ్రహం వ్యక్తం చేయడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఢిల్లీ నుంచి పార్టీ హైకమాండ్.. రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ లతో అత్యవసర టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఈ చర్చల్లో ప్రధానంగా 16 మంది ఎమ్మెల్యేల పనితీరుపై చర్చ జరిగినట్లు సమాచారం. అధికారంలో ఉండి కూడా సగం స్థానాలకే పరిమితం కావడం చెంపపెట్టు వంటిదని అధిష్టానం అభిప్రాయపడింది. కనీసం 80 శాతం స్థానాలను గెలుచుకుంటేనే అది అసలైన అధికార బలమని హైకమాండ్ స్పష్టం చేసింది.చాలా చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా పార్టీ నేతలే రెబెల్స్‌గా బరిలోకి దిగారు. వీరిని బుజ్జగించడంలో లేదా దారికి తెచ్చుకోవడంలో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్ ఛార్జ్ లు విఫలమయ్యారని పార్టీ గుర్తించింది. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచామన్న ధీమాతో క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని, ఓటర్ల నాడిని పట్టించుకోకపోవడం కొందరు ఎమ్మెల్యేలకు శాపంగా మారింది. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ఉన్న ప్రాంతాల్లోనే సర్పంచ్ అభ్యర్థులు ఓడిపోవడం వారి ప్రాబల్యానికి గండికొట్టింది. గ్రూపు రాజకీయాలు పార్టీ మూలాలనే దెబ్బతీశాయని విశ్లేషణలు వస్తున్నాయి.ఓటమి పాలైన లేదా తక్కువ మెజారిటీ వచ్చిన నియోజకవర్గాల ప్రతినిధుల నుంచి సీఎం రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్ వివరణ కోరారు. “పార్టీ గీత దాటకుండా పని చేయాలి.. సమన్వయం లేకపోతే భవిష్యత్తులో కఠిన నిర్ణయాలు ఉంటాయి” అని గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా సర్పంచ్ ఎన్నికల్లో ఓటమి అంటే క్షేత్రస్థాయిలో పునాదులు కదలడమేనని, ఇది రాబోయే మున్సిపల్ లేదా స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపుతుందని హైకమాండ్ ఆందోళన వ్యక్తం చేస్తోంది.అధికార పార్టీకి సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగులేని ఆధిక్యం ఉంటుంది. కానీ, ఈసారి 50 శాతం మార్కు దగ్గరే ఆగిపోవడం ప్రతిపక్షాలకు ఆయుధంగా మారింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి వెళ్లడంలో లోపం ఉందా? అనే కోణంలో పార్టీ సమీక్షించుకోవాల్సి ఉంది. పీసీసీ చీఫ్ మారిన తర్వాత జరిగిన మొదటి కీలక ఎన్నిక కావడంతో, కేడర్‌ను ఏకతాటిపైకి తేవడంలో ఇంకా కసరత్తు అవసరమనిపిస్తోంది.మొత్తానికి, పంచాయతీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ శ్రేణులకు ఒక మేల్కొలుపు లాంటివి. హైకమాండ్ సీరియస్ అవ్వడం ద్వారా ఎమ్మెల్యేలపై పని ఒత్తిడి పెరిగింది. రానున్న రోజుల్లో ఈ 16 మంది ఎమ్మెల్యేలు తమ పనితీరును మెరుగుపరుచుకోకపోతే, పార్టీలో క్రమశిక్షణ చర్యలు తప్పవనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 80 శాతం గెలుపు లక్ష్యాన్ని చేరుకోలేకపోవడం ద్వారా పార్టీ ఆశించిన క్లీన్ స్వీప్ కల నెరవేరలేదని చెప్పవచ్చు

# టీ రేషన్ యాప్...



**నిజామాబాద్, డిసెంబర్ 22, పెన్ పవర్:** తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డ్ ఉన్నవారి సౌకర్యం కోసం 'టీరేషన్' అనే అత్యాధునిక మొబైల్ యాప్‌ను ఇటీవల ప్రవేశపెట్టింది. ఈ యాప్ ద్వారా రేషన్ సేవలను ఇంటి నుంచే సులభంగా పరిశీలించవచ్చు, ఎటువంటి ఇబ్బందులు లేకుండా. సాంకేతికత ఆధారంగా రూపొందించిన ఈ యాప్, పౌరులకు పారదర్శకతను, సౌలభ్యాన్ని అందిస్తుంది. ఈ యాప్ ప్రధాన లక్ష్యం ఏమిటంటే, రేషన్ షాపులకు వెళ్లి ఎదురుచూడాల్సిన ఇబ్బందులను తగ్గిస్తుంది. మొబైల్‌లోనే అన్ని వివరాలు కనిపిస్తాయి. సమయం, శ్రమ ఆదా అవుతాయి.'టీరేషన్' యాప్ లో అన్ని ముఖ్య సమాచారం తెలుగు భాషలో లభిస్తుంది, కాబట్టి గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్యులకు కూడా అర్థమవుతుంది. మీ రేషన్ కార్డు యాక్టివ్‌గా ఉందా లేదా సస్పెండెడ్‌గా ఉందా అనేది తక్షణం తెలుసుకోవచ్చు. కార్డు ఆధార్‌తో సరిగ్గా లింక్ అయిందా లేదా పెండింగ్‌లో ఉందా అని తిరిగి చూడవచ్చు. మీ రేషన్ డీలర్ సంప్రదింపు నంబర్, షాప్ అడ్రస్, లొకేషన్ మ్యాప్‌తో కలిపి చూడొచ్చు. నెలవారీ రేషన్ కోటా, ఇప్పటివరకు ఎంత సరుకు (బియ్యం, చనా దాలు మొదలైనవి) పొందారో, మిగిలిన మొత్తం అంతా క్లియర్‌గా కనిపిస్తాయి. మునుపటి నెలల డ్రా వివరాలు, కొత్త అప్‌డేట్‌ల గుర్తింపు నోటిఫికేషన్లు. ఈ ఫీచర్లు ఈ కేవైసీ ప్రక్రియలతో ముడిపడి ఉంటాయి, కాబట్టి డేటా కచ్చితంగా ఉంటుంది.యాప్‌ను ఉపయోగించడం చాలా సులభం. గూగుల్ ప్లే స్టోర్‌లో 'టీరేషన్' టైప్ చేసి శోధించండి. అధికారిక యాప్‌ను ఫ్రీగా ఇన్‌స్టాల్ చేయండి. మొదటిసారి ఓపెన్ చేసినప్పుడు మీ రేషన్ కార్డు నంబర్ లేదా రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌తో లాగిన్ చేయండి. మొబైల్‌కు వచ్చే ఓటీపీ ఎంటర్ చేసి వెరిఫై చేయండి. లాగిన్ అయిన తర్వాత మెయిన్ స్క్రీన్‌లో అన్ని వివరాలు కనిపిస్తాయి. మెనూల ద్వారా స్పెసిఫిక్ సెక్షన్లకు వెళ్లవచ్చు. ఆండ్రాయిడ్, ఐఓఎ రెండింటిలోనూ త్వరలో అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు. ఇంటర్నెట్ లేకపోతే ఆఫ్‌లైన్ మోడ్‌లో కూడా కొన్ని ఫీచర్లు పనిచేస్తాయి.ఈ యాప్ రేషన్ వ్యవస్థలో పారదర్శకతను బలోపేతం చేస్తుంది. లబ్ధిదారులు తమ కోటాను పూర్తిగా పొందుతున్నారా అని తనిఖీ చేసుకోవచ్చు, డీలర్లపై దెబ్బ తీస్తుంది. ప్రభుత్వం లక్ష్యం పీడీఎస్(పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్)ను డిజిటల్‌గా మార్చడం. ఇది మహిళలు, రోజువారీ కూలీలు, గ్రామీణ ప్రజలకు మరింత సహాయకరం. ఏదైనా సమస్యలు ఉంటే యాప్‌లోనే ఫిర్యాదు చేయవచ్చు.తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ గవర్నెన్స్‌లో ముందంజలో ఉంది. ఇటీవల మీసేవా వాట్సాప్ ఆప్ ద్వారా సర్వీసులు ఆర్డర్ చేయడం, యూరియా యాప్ ద్వారా ఎరువులు ట్రాక్ చేయడం అందుబాటులోకి వచ్చాయి. 'టీరేషన్' కూడా ఇలాంటి డిజిటల్ పరివర్తనలో భాగం.

## చొప్పదండి మండల ఉప సర్పంచ్ ల ఫోరం

### అధ్యక్షునిగా అనిల్ కుమార్ యాదవ్ ఏకగ్రీవం

**చొప్పదండి, డిసెంబర్ 22 పెన్ పవర్:** కరీంనగర్ జిల్లా, చొప్పదండి మండల ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షునిగా ఆర్నకొండ ఉప సర్పంచ్ జక్కుల అనిల్ కుమార్ యాదవ్ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల ఉప సర్పంచులు సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం ఉప సర్పంచులు సమిష్టిగా కృషి చేస్తామని, తనపై విశ్వాసం ఉంచిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## తోటగోపయ్యపల్లిలో ఏకగ్రీవంగా పంచాయతీ పాలకవర్గం ఎన్నిక

**వేములవాడ, డిసెంబర్ 22 పెన్ పవర్:** పెద్దపల్లి జిల్లా మంథని మండలం తోటగోపయ్యపల్లి గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ ఏర్పడింది. గ్రామ ప్రజలు ఏకమై సర్పంచ్, ఉపసర్పంచ్, మరియు 1, 2, 3, 5, 6 వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దొబ్బల రమేష్ సర్పంచ్గా, బొందుగుల అంజయ్య ఉపసర్పంచ్గా ఎన్నికయ్యారు. తోట కుమార్, తొట వినోద, చిన్నాల దేవేందర్, పచ్చునూరి సమ్మక్క, ఎరుకల శంకరయ్య వార్డు సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ పాలకవర్గం ఈరోజు స్వీకార మహోత్సవ కార్యక్రమంలో పాల్గొంది.

## చింతల్ఠాణా సర్పంచి ఎన్నికపై వీడని సందిగ్ధం

**సిరిసిల్ల, డిసెంబర్ 22 పెన్ పవర్:** చింతల్ఠాణా గ్రామ సర్పంచి ఎన్నికపై అనిశ్చితి కొనసాగుతోంది. నామినేషన్ అనంతరం సర్పంచి అభ్యర్థిగా బరిలో ఉన్న చెర్ల మురళి (50) గుండెపోటుతో మృతి చెందినా.. ఎన్నికల్లో 370 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. గెలిచిన అభ్యర్థి భౌతికంగా లేకపోవడంతో అధికారులు పూర్తి వివరాలతో రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదిక పంపారు. అయితే ఇప్పటి వరకు ఎన్నికల సంఘం ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించలేదు. దీంతో సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో సర్పంచుల ప్రమాణ స్వీకారం చేస్తున్నా చింతల్ఠాణాలో ఎవరు ప్రమాణ స్వీకారం చేస్తారన్న దానిపై స్పష్టత లేకుండా పోయింది. ఉప సర్పంచికి తాత్కాలికంగా సర్పంచి బాధ్యతలు అప్పగిస్తారా? లేక తిరిగి ఎన్నికలు నిర్వహిస్తారా? అనే అంశాలపై అధికారుల నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో గ్రామంలో సందిగ్ధ వాతావరణం నెలకొంది. ఎన్నికల కమిషన్ నిర్ణయమే కీలకమని భావిస్తున్న గ్రామస్థులు.. కమిషన్ నిర్ణయం కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

## నూతన సర్పంచ్ శీలం వెంకటమ్మ ప్రమాణ స్వీకారం

**పాలేరు, డిసెంబర్ 22 పెన్ పవర్:** నేలకొండపల్లి పాలేరు నియోజకవర్గంలో నూతన సర్పంచ్గా శీలం వెంకటమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జరిగిన విజయోత్సవ సభలో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. గ్రామ అభివృద్ధికి తోడ్పడతానని, ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటానని వెంకటమ్మ తెలిపారు. గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకొని తక్షణమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల తీర్పుకి అనుకూలంగా ఉన్నందుకు సర్పంచ్ వెంకటమ్మ గారు అభినందించారు.

## పిల్లలు ఇంట్లోనే.. ఊరంతా వెతికారు!



**ఖమ్మం, డిసెంబర్ 22 పెన్ పవర్:** ఖమ్మం జిల్లాలో ఒక వింత సంఘటన వెలుగు చూసింది. ఆరెంపుల గ్రామానికి చెందిన జంగం సురేశ్ కుమారుడు, అతని సోదరి కొడుకు ఇంటి ముందు ఆడుకుంటూ కనిపించకుండా పోయారు. కుటుంబసభ్యులు, గ్రామస్తులు నాలుగు గంటల పాటు ఊరంతా, సీసీ కెమెరాల ఆధారంగా, సోషల్ మీడియాలో వెతికారు. చివరికి, పిల్లలు ఇంట్లోనే ఆడుకుంటూ కనిపించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇంట్లో పిల్లలను పెట్టుకుని ఊరంతా వెతకడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

## మర్లపాడు సర్పంచ్ గా కనమాల ఆంధ్రయ్య ప్రమాణ స్వీకారం

**సత్తుపల్లి, డిసెంబర్ 22 పెన్ పవర్:** ఖమ్మం జిల్లా, సత్తుపల్లిలోని వేంసూరు మండల పరిధిలో గల మేజర్ గ్రామ పంచాయతీ మర్లపాడు గ్రామ సర్పంచ్ గా కనమాల ఆంధ్రయ్య సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎంపీడీఓ డి.కావ్య ఆయనతో ప్రమాణం చేయించారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఆంధ్రయ్య, పాలకవర్గ సభ్యులతో కలిసి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మందపాటి రాఘవరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి తిగుళ్ళ పుల్లారావు, ప్రజలు పాల్గొన్నారు.

## అప్పాయిగూడెం సర్పంచ్ గా ప్రవీణ్ ప్రమాణ స్వీకారం

**మధిర, డిసెంబర్ 22 పెన్ పవర్:** సింగరేణి మండల పరిధిలోని అప్పాయిగూడెం గ్రామపంచాయతీలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో అతి చిన్న వయసులోనే సర్పంచి పదవిని దక్కించుకున్న దళిత బిడ్డ దండు ప్రవీణ్, సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## బాలంపేట సర్పంచిగా ధనలక్ష్మి, ఉపసర్పంచ్గా అమరయ్య బాధ్యతలు స్వీకరణ

**వైరా, డిసెంబర్ 22 పెన్ పవర్:** : ఖమ్మం జిల్లా, సత్తుపల్లిలోని తల్లాడ మండలం బాలంపేట గ్రామ పంచాయతీ సర్పంచిగా కోసూరి ధనలక్ష్మి, ఉప సర్పంచ్గా తాలూరి పెద్ద అమరయ్య సోమవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచితో పాటు వార్డు సభ్యులు కూడా ప్రమాణం చేశారు. అనంతరం ధనలక్ష్మి మాట్లాడుతూ, బాలంపేట గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## జై భీమ్ సంస్థ వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



**వరంగల్ ఈస్ట్, డిసెంబర్ 22 పెన్ పవర్:** : జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్ డాక్టర్ బరిగెల శివ ఆధ్వర్యంలో, ఉమ్మడి వరంగల్ జిల్లా, వరంగల్ (వెస్ట్) లోని అను ఓల్డ్ ఏజ్ హోంలో సోమవారం వయోవృద్ధులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. తమ 10 సంవత్సరాల ప్రయాణాన్ని పురస్కరించుకొని, సమాజానికి తిరిగి ఇవ్వాలనే సంకల్పంతో, మానవత్వం ప్రధానంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ బరిగెల శివ మాట్లాడుతూ, జై భీమ్ టీవీ కేవలం వార్తలకే పరిమితం కాదని, పేదలు, బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలబడే బాధ్యతతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# నెల్లూరులో అనిల్ మౌనం..దేనికి సంకేతం

**నెల్లూరు, డిసెంబర్ 22,పెన్ పవర్:** నెల్లూరు రాజకీయాలను ఒకప్పుడు శాసించిన వైసీపీ కీలక నేతగా గుర్తింపు పొందిన పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్ ప్రస్తుతం పూర్తిగా మౌనంగా ఉండడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీస్తోంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడిగా, బలమైన గ్రౌండ్ లీడర్‌గా పేరున్న అనిల్ రాజకీయంగా యాక్టివ్‌గా కనిపించకపోవడం వైసీపీకి ఇబ్బందికరంగా మారిందన్న అభిప్రాయం వినిపిస్తోంది.ఇటీవల నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్‌గా ఉన్న స్రవంతి రాజీనామా చేయడం పెద్ద దుమారం రేపింది. ఈ పరిణామంతో ఆ పదవిని టీడీపీ దక్కించుకునే అవకాశాలు పెరిగాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇలాంటి కీలక సమయంలో వైసీపీ తరఫున బలమైన నాయకత్వం కనిపించకపోవడం పార్టీ బలహీనతను బయటపెడుతోందని విమర్శలు వస్తున్నాయి.పార్టీలో అనిల్ కుమార్ పాత్ర బలంగా ఉంటే మేయర్ రాజీనామా వరకు వ్యవహారం వెళ్లేదే కాదని వైసీపీ వర్గాల్లోనే చర్చ జరుగుతోంది. పార్టీ నాయకులను ఏకం చేయడం, సమస్యను ముందే చక్కదిద్దడం అనిల్ చేయగలిగేవారని పలువురు అభిప్రాయపడుతున్నారు. కానీ ఆయన నుంచి అలాంటి ప్రయత్నాలు కనిపించకపోవడంతో అసలు కారణం ఏమిటన్న ప్రశ్నలు మొదలయ్యాయి.గత ఎన్నికల్లో నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేసిన అనిల్



ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత మళ్లీ నెల్లూరు నగర రాజకీయాలపై దృష్టి పెట్టాలని ఆయన భావించినా, పార్టీ నుంచి అధికారిక బాధ్యతలు మాత్రం ఇప్పటివరకు అప్పగించలేదు. ఈ అంశమే ఆయన నిరాశకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. పార్టీ శ్రేణులు కూడా అనిల్ వెంట నిలబడకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టం చేసిందిఉద్దేశపూర్వకంగానే పార్టీ తనను పక్కన పెట్టిందన్న భావన అనిల్ అనుచరుల్లో బలంగా ఉంది. వైసీపీ నుంచి బయటకు వెళ్లిన కొందరు నాయకుల పాత్ర కూడా దీనికి కారణమని ఆయన భావిస్తున్నట్టు సమాచారం. ఈ అంశాలపై పార్టీ అధిష్టానం స్పందించకపోవడం అనిల్ మౌనానికి మరో కారణంగా మారిందని అంటున్నారు.ఒకప్పుడు తన అనుమతి లేకుండా ఫ్లెక్సీలు కూడా కట్టలేని స్థితి ఉన్న నెల్లూరు సిటీ లో ఇప్పుడు తన మాటకు విలువ లేకపోవడం అనిల్‌కు తీవ్ర మనస్తాపాన్ని కలిగిస్తోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పైగా సొంత బాబాయి టీడీపీలో చేరడం రాజకీయంగా ఆయనకు మరింత ఇబ్బందిగా మారింది. ఈ పరిస్థితుల్లో అనిల్‌కు మళ్లీ ప్రాధాన్యం దక్కుతుందా, లేక నెల్లూరు రాజకీయాల్లో ఆయన పాత్ర ముగింపు దశకు చేరిందా అన్నది కాలమే నిర్ణయించాల్సి ఉంది. ప్రస్తుతం మాత్రం నెల్లూరు రాజకీయాల్లో అనిల్ ప్రభావం కనిపించడం లేదన్నది స్పష్టంగా అర్థమవుతోంది

# అర్థం కానీ జగన్ వ్యూహం

**తిరుపతి, డిసెంబర్ 22, పెన్ పవర్:** రాజకీయంగా కొన్ని నిర్ణయాలు తీసుకోవడం అత్యంత సాహసం కూడా. చాలా రకాల అంశాలు ప్రభావితం చేస్తాయి. ఈ విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి డిఫెన్స్ లో పడిపోతున్నారు. ఏ నిర్ణయం కూడా సవ్యంగా తీసుకోలేకపోతున్నారు. మునుపటి దూకుడు ఆయనలో కనిపించడం లేదు. రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత ముఖ్యమంత్రి పదవి ఆశించారు జగన్మోహన్ రెడ్డి. ఆ పదవి ఇవ్వకపోయేసరికి పార్టీపై తిరుగుబాటు చేశారు. పార్టీ నుంచి బయటకు వచ్చేసారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేశారు. అప్పట్లో ఢిల్లీ నుంచి గల్లీ వరకు అజయమైనా శక్తిగా ఉంది కాంగ్రెస్ పార్టీ. అయినా సరే ఆ శక్తిని ఢీకొట్టారు జగన్మోహన్ రెడ్డి. కానీ ఇప్పుడు అంతటి శక్తిగా ఉన్న బిజెపిని చూసి మాత్రం భయపడి పోతున్నారు. ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోతున్నారు. స్నేహం కోసం వస్తున్న వారిని దూరం పెడుతున్నారు. ఇష్టమైన వారితో కలవలేక పోతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. భావోద్వేగాలను సైతం వ్యక్తం చేయలేని స్థితిలో ఉన్నారు.సాధారణంగా ప్రతిపక్షంలో ఉన్నవారికి ఏ చిన్నపాటి తోడు దొరికినా వదలరు. కానీ ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి తోటి రాజకీయ పార్టీలను కలుపుకెళ్లే ప్రయత్నం చేయలేకపోతున్నారు. దానికి కారణం భారతీయ జనతా పార్టీ. జాతీయస్థాయిలో ఆ పార్టీకి ఎదురు నిలిచే ఏ పార్టీ కూడా నిలవడం లేదు. అందుకే జగన్ తన పార్టీ కోసం.. తన పార్టీ అస్తిత్వం కోసం బిజెపితో వ్యతిరేకత తెచ్చుకోవడం లేదు. చివరకు బిజెపిని వ్యతిరేకించే పార్టీలను దగ్గర చేసుకునే ప్రయత్నం చేయడం లేదు. ఏపీలో మూడు పార్టీలు పొత్తులో ఉండగా.. మిగిలినవి కాంగ్రెస్, వామపక్షాలతో పాటు ఉనికి లేని పార్టీలు. తనకు తాను పెద్ద పార్టీగా చెప్పుకునే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వాటిని కలుపు కెళ్లే సాహసం చేయడం లేదు. దానికి కారణం భారతీయ జనతా పార్టీ. ఆ పార్టీకి వ్యతిరేకంగా వెళ్లడమే కాదు.. ఆగ్రహం తెప్పించే ఏ పనికి కూడా జగన్మోహన్ రెడ్డి ముందుకు రావడం లేదు. అయితే జగన్మోహన్ రెడ్డి ని సింహం, ఢిల్లీని గడగడ లాడించిన నాయకుడు వంటి స్లొగన్స్ తో ఆకాశానికి ఎత్తేస్తుంటారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు. కానీ ఇప్పుడు బీజేపీ విషయంలో తమ అధినేత అనుసరిస్తున్న వైఖరి వారికి సైతం మింగుడు పడడం లేదు.ఇటీవల ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అంశంపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళనను తీవ్రతరం చేసింది. అదే అంశంపై సిపిఐ పోరాటం చేస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉద్యమాన్ని అభినందిస్తోంది. అయితే సిపిఐ వైఖరి చూస్తుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో అడుగులు వేయాలని అనిపిస్తుంది. కానీ జగన్మోహన్ రెడ్డి నుంచి ఎటువంటి పిలుపు లేదు కదా.. సంకేతాలు కూడా లేవు. ప్రజల్లో మార్పు ప్రారంభమైందని జగన్ అంచనాలు వేస్తున్నారు. మళ్లీ అధికారంలోకి వస్తామన్న ధీమాతో ఉన్నారు. కానీ కొన్ని వర్గాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అంటేనే అసంతృప్తితో ఉన్నాయని.. ఆగ్రహంతో ఉన్నాయని తెలుసుకోలేకపోతున్నారు. 2024 ఎన్నికలకు ముందు చంద్రబాబు విషయంలో బిజెపి వైఖరి వేరేలా ఉండేది. ఎప్పుడైతే పవన్ ముందుకు వచ్చి టిడిపి తో పొత్తు ప్రకటన చేశారో.. క్రమేపి



బిజెపి వైఖరిలో మార్పు వచ్చింది. ఇప్పుడు కూడా సిపిఐ ద్వారా మిగతా రాజకీయ పక్షాలను తన వైపు తెచ్చుకోవచ్చు జగన్మోహన్ రెడ్డి. కానీ బిజెపి విషయంలో వెనుకడుగు వేస్తున్నారు. ఇలా ఆలోచనకు వెళ్తే మాత్రం చాలా కష్టం

# రైటర్స్ కథపై ఆసక్తికర చర్చమోడీ తర్వాత ప్రధానిగా చంద్రబాబు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 22, పెన్ పవర్:** భారత రాజకీయాల్లో మోడీ తర్వాత ఎవరు? అనే ప్రశ్న ఎప్పుడూ ఆసక్తికరమే. అయితే, ప్రముఖ అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ ఇటీవల ప్రచురించిన కథనం ఈ చర్చను మరో మలుపు తిప్పింది. 2029 నాటికిప్రధాని మోడీ వయస్సు 79 ఏళ్లకు చేరుతుందని, ఆ సమయంలో ఆయన క్రియాశీల రాజకీయాల నుండి తప్పుకుంటే వారసులెవరు అనే కోణంలో రాయిటర్స్ ఒక ఆసక్తికర విశ్లేషణను బయటపెట్టింది.రాయిటర్స్అంచనా ప్రకారం, బిజెపిలో మోడీ తర్వాత అత్యంత శక్తివంతమైన నేతగా ఉన్న అమిత్ షా మొదటి వరుసలో ఉన్నారు. పార్టీ యంత్రాంగంపై ఆయనకున్న పట్టు, వ్యూహకర్తగా ఆయనకున్న గుర్తింపు దీనికి ప్రధానకారణాలు. ఇక మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక నేతగా ఉన్న దేవేంద్ర ఫడ్నవీస్ పేరును కూడా రాయిటర్స్ పరిగణనలోకి తీసుకోవడం గమనార్హం. అయితే, క్షేత్రస్థాయిలో అత్యంత ప్రజాదరణ పొందిన, హిందుత్వ బ్రాండ్అంబాసిడర్ గా పేరుగాంచిన యోగి ఆదిత్యనాథ్ పేరును రాయిటర్స్ విస్మరించడం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రంలో వరుస విజయాలు సాధిస్తూ, మోడీ తర్వాత అంతటిఫాలోయింగ్ ఉన్న నేతను కాదని ఫడ్నవీస్ పేరును తెరపైకి తేవడం వెనుక రాయిటర్స్ లాజిక్ ఏంటన్నది ప్రశ్నార్థకంగా మారింది.. ప్రధాని రేసులో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ పేర్లనుప్రస్తావించడం. ఒకవేళ 2029లో బిజెపికి స్పష్టమైన మెజారిటీ రాకుండా, ఎన్డీయే కూటమిలోని ప్రాంతీయ పార్టీలు బలంగా ఉంటే, అప్పుడు దక్షిణాది నేతగా చంద్రబాబుకు అవకాశం దక్కవచ్చని రాయిటర్స్అభిప్రాయపడింది. కానీ ఇక్కడ కొన్ని ప్రాథమిక వాస్తవాలను రాయిటర్స్ విస్మరించినట్లు కనిపిస్తోంది. 2029 నాటికి మోడీకి 79 ఏళ్లు వస్తాయని ఆయనను పక్కన పెడితే, చంద్రబాబు కూడా అదే వయస్సులో ఉంటారు.వాస్తవానికి మోడీ కంటే చంద్రబాబు 6 నెలలు పెద్ద. వయస్సు రీత్యా మోడీ తప్పుకుంటే, అంతకంటే పెద్దవారైన చంద్రబాబును బిజెపి అగ్రనాయకత్వం ఎలా అంగీకరిస్తుంది?. జాతీయ రాజకీయాల్లో బిజెపి నేడు అత్యంతశక్తివంతంగా ఉంది. గడ్కరీ, రాజ్ నాథ్ సింగ్ వంటి హేమాహేమీలను కాదని, ఒక ప్రాంతీయ పార్టీ నేతకు ప్రధాని పీఠాన్ని అప్పగించే పరిస్థితి ప్రస్తుతం కనిపించడం లేదు.చంద్రబాబు కానీ, లోకేశ్ కానీ ఏనాడూ తమకుప్రధాని కావాలనే ఆకాంక్ష ఉన్నట్లు ఎక్కడా వ్యక్తం చేయలేదు. "నా దృష్టి అంతా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పైనే" అని చంద్రబాబు పలుమార్లు స్పష్టం చేశారు. లోకేశ్ కూడా రాష్ట్ర రాజకీయాల్లోనే తన ముద్ర వేసేందుకుప్రయత్నిస్తున్నారు. రాజకీయ వర్గాల్లో సాగుతున్న ప్రచారం ప్రకారం.. 2029లో కేంద్రంలో ఎన్డీయే అధికారంలోకి వస్తే, చంద్రబాబుకు జాతీయ స్థాయిలో గౌరవప్రదమైన రాష్ట్రపతి లేదా గవర్నర్ వంటి పదవులుదక్కవచ్చని, ఆ సమయంలో రాష్ట్ర బాధ్యతలను లోకేశ్ కు అప్పగించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. 'ప్రధాని పదవి' అనేది మాత్రం అతిశయోక్తిగానే తోస్తోంది.అంతర్జాతీయ మీడియా సంస్థలు ఒక్కోసారిక్షేత్రస్థాయి సమీకరణాలను వదిలేసి, కేవలం గణాంకాలు లేదా పాత రాజకీయ ముద్రల ఆధారంగా విశ్లేషణలు చేస్తుంటాయి. రాయిటర్స్ కథనం కూడా ఆ కోవలోకే వస్తుంది. దక్షిణాదిలో టీడీపీకున్న పట్టును గుర్తించినరాయిటర్స్, దేశ ప్రధాని పదవి విషయంలో మాత్రం భారతీయ రాజకీయాల్లోని 'వయస్సు పరిమితులు', 'బిజెపి అంతర్గత పట్టు' వంటి కీలక అంశాలను సరిగ్గా అంచనా వేయలేకపోయిందనిపిస్తోంది. ఏదిఏమైనా, 2029కి ఇంకా చాలా సమయం ఉంది. పైగా తాను తప్పుకుంటానని మోడీ ఇంతవరకూ ప్రకటించలేదు. పార్టీ కూడా ఆయన్ను తప్పించే ఆలోచనలో లేదు. అయినా అప్పటి రాజకీయ పరిస్థితులు, బిజెపిబలాబలాలను బట్టి ఈ సమీకరణాలు ఎటువైపు అయినా మారవచ్చు.

## నిఫ్ట్ 2026 ప్రవేశాలు:

**హైదరాబాద్ పెన్ పవర్:** వరంగల్ వెస్ట్, డిసెంబర్ 22(ఎ.ఎం.ఎస్): భారత ప్రభుత్వ జౌళి శాఖ ఆధ్వర్యంలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (ఔఎఈ), 2026 విద్యా సంవత్సరానికి ప్రవేశాలను ఆహ్వానిస్తోంది. డిజైన్, మేనేజ్ మెంట్ మరియు టెక్నాలజీ రంగాలలో నిపుణులను తయారు చేసే నిఫ్ట్, గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ మరియు డాక్టోరల్ స్థాయిలలో కోర్సులను అందిస్తుంది. రిజిస్ట్రేషన్ కు చివరి తేదీ జనవరి 8, ఆలస్య రుసుముతో జనవరి 10 వరకు, ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 8న నిర్వహించబడుతుంది. ఫలితాలు ఏప్రిల్ లో వెలువడతాయి.

## పాముకాటుతో రైతు మృతి: లెంకాలపల్లిలో విషాదం

**వర్ధన్నపేట, డిసెంబర్ 22 పెన్ పవర్:** లెంకాలపల్లి గ్రామంలో సోమవారం పాముకాటుతో చికిత్స పొందుతున్న రైతు యాదండ్ల చిన్న కొమురయ్య (50) మృతి చెందాడు. శుక్రవారం మొక్కజొన్న పొలంలో పనిచేస్తున్నప్పుడు పాము కాటు వేయడంతో, కుటుంబ సభ్యులు అతన్ని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున కొమురయ్య తుదిశ్వాస విడిచాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కాంగ్రెస్ నాయకుడి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

**పరకాల, డిసెంబర్ 22 పెన్ పవర్:** హనుమకొండ జిల్లా కాజీపేట మండలం టేకులగూడెం గ్రామంలో సోమవారం, 64వ డివిజన్ మడికొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు జిట్టా నాగరాజు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి శు భాకాంక్షలు తెలిపారు తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి తొట్ల రాజు యాదవ్, కొప్పుల నవీన్ యాదవ్, పెనుకుల వినయ్, జిట్టా ప్రవీణ్ చంటి, పవన్, బన్నీ, అశోక్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పరకాల నూతన సర్పంచ్ కవిత మధుకు ఘన సన్మానం

**నర్సంపేట, డిసెంబర్ 22( పెన్ పవర్: :** హనుమకొండ జిల్లా పరకాల మండలం మల్లక్క పేట గ్రామ పంచాయతీ నూతన సర్పంచిగా శ్రీమతి. దొమ్మాటి కవిత మధు సోమవారం రోజు పదవీ బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ఎమ్మెల్యే రేవూరి నాయకత్వంలో, టీపీసీసీ మాజీ ఉపాధ్యక్షులు దొమ్మాటి సాంబయ్య దీవెనలతో గెలుపొందిన ఆమెను పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మడికొండ బ్రదర్స్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సర్పంచ్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఘర్షణ

**ములుగు, డిసెంబర్ 22 పెన్ పవర్: :** వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలో సర్పంచి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ నెలకొంది. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పంచాయతీ ఆవరణలో బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్ పాట పెట్టడంతో కాంగ్రెస్కు చెందిన వనపర్తి శోభన్ అభ్యంతరం తెలిపాడు. దీంతో మాటామాటా పెరిగి అక్కడే ఉన్న కుర్చీలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. కాంగ్రెస్ నాయకుడు శోభన్కి తలకు గాయమైంది. బీఆర్ఎస్ నాయకులు రమేశ్కు స్వల్పగాయాలు అయ్యాయి.

## అల్లీపూర్ నూతన సర్పంచ్ కుమార్ ప్రమాణ స్వీకారం

**మెదక్, డిసెంబర్ 22 పెన్ పవర్:** మెదక్ జిల్లా, శివంపేట్ మండలం, అల్లీపూర్ గ్రామంలో నూతన సర్పంచ్గా ఎన్నికైన చింతకాయల కుమార్, ఉపసర్పంచ్తో కలిసి అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని సర్పంచ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది.




## నవాబుపేట నూతన సర్పంచ్ రజిత ప్రమాణ స్వీకారం

**హుస్నాబాద్, డిసెంబర్ 22 పెన్ పవర్:** హుస్నాబాద్ నియోజకవర్గ చిగురుమామిడి మండలం నవాబుపేట నూతన గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రత్యేక అధికారి సమక్షంలో సర్పంచి గూళ్ల రజిత, ఉప సర్పంచ్ ఎన్నికల శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సర్పంచ్ రజిత మాట్లాడుతూ, నిస్వార్థంగా, అందరికీ అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తూ, గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి గ్రామ అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తూ గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జి పి సిబ్బంది, గ్రామ ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

## పెద్ద లింగారెడ్డిపల్లి నూతన సర్పంచ్కు రెడ్డి సంక్షేమ సంఘం సన్మానం

**సిద్దిపేట, డిసెంబర్ 22 పెన్ పవర్:** సోమవారం, 22 డిసెంబర్ 2025న సిద్దిపేట జిల్లా, సిద్దిపేట రూరల్ మండలం పెద్ద లింగారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్గా శ్రీ బట్టు భాస్కర్ రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిద్దిపేట ప్రశాంత్ నగర్ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పేరుడి వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు మారెడ్డి మల్లికార్జున్ రెడ్డి, మాజీ కోశాధికారి డాక్టర్ చంద్ర రెడ్డి, కార్యకర్త వట్టిపల్లి రాజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదం.. ఎదురెదురుగా ఢీకొన్న లారీలు

**గజ్వేల్, డిసెంబర్ 22 పెన్ పవర్:** తెల్లవారుజామున కురుస్తున్న దట్టమైన పొగ మంచు రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతుంది. సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలం న్యామతబాద్ శివారులో సోమవారం రెండు లారీలు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. అల్లాదుర్గం– మెటల్ కుంట రోడ్డులో రాయికోడు వైపు వెళ్తున్న చెరుకు లారీ, వరిపొట్టు లోడుతో గంగ్వార్ వస్తున్న లారీలు ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో రెండు లారీల డ్రైవర్లు, క్లీనర్లు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్లో మిర్జాపూర్(బి) ఆసుపత్రికి తరలించారు.

## పాముకాటుతో బాలిక మృతి

**నర్సాపూర్, డిసెంబర్ 22 పెన్ పవర్:** పాముకాటుతో బాలిక మృతిచెందిన ఘటన చేగుంట మండలం రెడ్డిపల్లి కాలనీలో శనివారం అర్ధరాత్రి జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలు.. బి.గంగాధర్ కుటుంబ సభ్యులతో కలిసి రెడ్డిపల్లి కాలనీ వద్ద 44వ జాతీయ రహదారి పక్కన రేకుల షెడ్డు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. పాత ఇనుప సామగ్రి కొనుగోలు చేస్తుంటారు. పదో తరగతి వరకు చదివి మానేసిన ఆయన కూతురు అక్షయ(16) తల్లిదండ్రులతో కలిసి రాత్రి భోజనం చేసి పడుకుంది. ఉదయం తల్లిదండ్రులు ఆమె లేపగా ఎంతకీ లేవలేదు. దీంతో స్థానికులను పిలవడంతో వారు వచ్చి చూశారు. రాత్రి గుర్తుతెలియని పాము కరవడంతో మృతి చెంది ఉంటుందని వారు అనుమానం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబసభ్యులను సర్పంచి నర్సింహ పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## పందెం కోళ్ల ముందు రాజకీయాలు లైట్



**ఏలూరు, డిసెంబర్ 22, పెన్ పవర్:** సంక్రాంతి పండుగకు ఇంకా సుమారు 25 రోజుల సమయం మాత్రమే ఉంది. ఈలోపే ఉభయ గోదావరి జిల్లాలు మరోసారి పందెం కోళ్ల హడావుడితో ఊగిపోతున్నాయి. గ్రామాల నుంచి పట్టణాల వరకూ ఎక్కడ చూసినా బరుల ఏర్పాట్లు, గిరులు గీయడం, వాటాల చర్చలు జోరుగా సాగుతున్నాయి. కోళ్ల కూకలు వినిపించకముందే రాజకీయ నాయకుల అడుగుల శబ్దాలు ఎక్కువయ్యాయి. జిల్లాకు ఇద్దరు చొప్పున కీలక నాయకులు ఆధిపత్యం కోసం ముందుకు వస్తుండటం ఈసారి ప్రత్యేకంగా కనిపిస్తోంది.గతంలో ఇది సాధారణ సంప్రదాయంగా జరిగిపోయేది. కానీ ఈసారి పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. కారణం , ఈసారి పార్టీలు, రాజకీయ భేదాలు అన్నీ పక్కనపెట్టి అందరూ కలిసిపోయారు. తెలుగుదేశం పార్టీకి చెందిన నేతలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రమే కాదు, ఇతర పార్టీలతో సంబంధం ఉన్నవారు కూడా ఒకే వేదికపై కనిపిస్తున్నారు. కోడి పందేల విషయంలో రాజకీయాలు అడ్డురావద్దనే ఉద్దేశంతో అందరూ కలిసి నిర్ణయాలు తీసుకుంటున్నారు.ఇంతవరకూ ఉభయ గోదావరి జిల్లాలకే పరిమితమైన ఈ సంప్రదాయం ఇప్పుడు కృష్ణా జిల్లా, గుంటూరు జిల్లా, నెల్లూరు జిల్లా వరకూ విస్తరించింది. అక్కడ కూడా భారీ స్థాయిలో బరులు సిద్ధమవుతున్నాయి. గ్రామాల మధ్య పోటీలు, నాయకుల మధ్య సమన్వయంతో ఈసారి మరింత పకడ్బందీగా ఏర్పాట్లు జరుగుతున్నాయన్న మాట వినిపిస్తోంది. సంప్రదాయ పండుగలకు రాజకీయ రంగు పులుమకూడదని నేరుగా చెప్పుకుంటూ, అందరూ కలివిడిగా ముందుకు సాగుతున్నారు.చిత్రమైన విషయం ఏంటంటే, ఒక పార్టీకి చెందిన నేతలు మరో పార్టీ నాయకుల నుంచి పెట్టుబడులు తీసుకోవడం బహిరంగ రహస్యంగా మారింది. టీడీపీ నేతలు వైసీపీ నాయకుల దగ్గర నుంచి, వైసీపీ నాయకులు ఇతర పార్టీల వారితో కలిసి వాటాలు పెట్టుకుంటున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఎవరికెవరికీ ఏ బరులు కావాలన్నది కూడా ముందుగానే ఖరారు చేసుకున్నారని తెలుస్తోంది. రెండు రోజుల క్రితం పశ్చిమ గోదావరి జిల్లాలోని ఓ నియోజకవర్గంలో పెద్ద సమావేశం పెట్టి, జిల్లా మొత్తం మీద బరుల నిర్వహణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారన్న సమాచారం ఉంది.ఇలా అందరూ కలిసిపోవడానికి మరో కారణం కూడా ఉందని చెబుతున్నారు. అనవసర రచ్చలు, పోలీసులకు సమాచారం ఇవ్వడం, మీడియాకు లీకులు, న్యాయపోరాటాలు వంటి సమస్యలు రాకుండా ఉండాలన్నదే అసలు ఉద్దేశం. చిన్న మొత్తాన్ని పెట్టి పెద్ద లాభాలు పొందాలన్న ఆలోచనతో అందరూ ఒకే దారిలో నడవాలని నిర్ణయించుకున్నారట. గుంటూరుకు చెందిన ఓ మాజీ ఎంపీ పశ్చిమంలో బరులను లీజుకు తీసుకున్నారని, నెల్లూరుకు చెందిన ఓ వైసీపీ నాయకుడు గుడివాడ ప్రాంతంలో ఏర్పాట్లు చేస్తున్నారన్న మాటలు వినిపిస్తున్నాయి. ఇలా రాజకీయాలకతీతంగా సాగుతున్న ఈ కలయిక, అభివృద్ధి విషయాల్లోనూ కనిపిస్తే బాగుంటుందన్న విమర్శ వినిపిస్తోంది

## ఖాదీ, ఖాకీ వార్...

**ఏలూరు, డిసెంబర్ 22, పెన్ పవర్:** ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, మాజీ ఏసీబీ చీఫ్, ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ మధ్య నెలకొన్న వివాదం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. గత ప్రభుత్వ హయాంలో రఘురామ కృష్ణరాజు అరెస్టు, కస్టడీలో చిత్రహింసల ఆరోపణల నేపథ్యంలో మొదలైన ఈ వివాదం, ఇప్పుడు డిప్యూటీ స్పీకర్ పదవి చుట్టూ తిరుగుతోంది. ఒక సిట్టింగ్ ఐపీఎస్ అధికారి, రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న వ్యక్తిపై బహిరంగంగా విమర్శలు చేయడం, ఆయనకు శిక్ష పడటం ఖాయమని జోస్యం చెప్పడం సర్వీస్ రూల్స్ ఉల్లంఘన కిందకు వస్తుందా? అనే చర్చకు దారితీసిందికొన్ని రోజుల కిందట రఘురామ కృష్ణరాజుపై ఓ పోస్ట్ పెట్టిన పీవీ సునీల్ కుమార్, ఇవాళ ఏకంగా ఓ వీడియో విడుదల చేశారు. ఇందులో అనేక సంచలన వ్యాఖ్యలు చేశారు. బ్యాంకులను మోసం చేసిన కేసులో రఘురామ కృష్ణరాజుపై విచారణ జరుగుతోందని, ఈ కేసులో ఆయనకు యావజ్జీవ కారాగార శిక్ష పడటం ఖాయమని సునీల్ కుమార్ సోషల్ మీడియా వేదికగా జోస్యం చెప్పారు. ఒకవేళ పదవిలో ఉండగా ఆయన జైలుకు వెళ్తే అది రాష్ట్ర పరువుకు భంగమని, అందుకే వెంటనే ఆయన్ను డిప్యూటీ స్పీకర్ పదవి నుంచి తప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా, తాను కూడా ఎస్‌బీఐ ఖాతాదారుడినే కాబట్టి, ఈ బ్యాంకు మోసం కేసులో ఒక బాధితుడిగా 'ఇంప్లీడ్' అవుతానని ప్రకటించడం సంచలనం సృష్టించింది.ఒక ఐపీఎస్ అధికారిగా ఉంటూ, క్రియాశీల రాజకీయాల్లో ఉన్న వ్యక్తులపై లేదా రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వారిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం, 1968కు విరుద్ధమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఐపీఎస్ అధికారులు రాజకీయ అంశాలపై బహిరంగంగా స్పందించకూడదు. అసెంబ్లీ ద్వారా ఎంపికైన డిప్యూటీ స్పీకర్‌ను తొలగించాలని కోరడం పరోక్షంగా ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేయడమే అవుతుంది. గతంలో రఘురామ వేసిన కేసుల వల్ల సునీల్ కుమార్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు దానికి ప్రతికారం తీర్చుకునే క్రమంలోనే ఆయన సర్వీస్ రూల్స్‌ను కూడా పక్కన పెట్టి మాట్లాడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయివైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో సీఐడీ చీఫ్‌గా ఉన్న సమయంలో రఘురామను అరెస్టు చేసినప్పుడు, సునీల్ కుమార్ అత్యుత్సాహం ప్రదర్శించారనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రఘురామ ఫిర్యాదు మేరకు సునీల్ కుమార్‌పై కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే "నేను రాష్ట్రం కోసమే మాట్లాడుతున్నాను" అని ఆయన ఇస్తున్న క్లారిటీని విశ్లేషకులు ఒక డిఫెన్స్ మెకానిజంగా చూస్తున్నారు.పీవీ సునీల్ కుమార్ వ్యాఖ్యలపై ప్రభుత్వం సీరియస్ అయ్యే అవకాశం ఉంది. సర్వీస్ నిబంధనలను అతిక్రమించినందుకు నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది. విచారణలో ఉన్న కేసుల గురించి ముందే తీర్పును ప్రకటించడం, యావజ్జీవ శిక్ష పడుతుందని చెప్పడం న్యాయవ్యవస్థను కించపరచడమే అవుతుందనే వాదన కూడా ఉంది.ప్రజాస్వామ్యంలో విమర్శలు సహజమే కానీ, బాధ్యతాయుతమైన ఖాకీ దుస్తుల్లో ఉండి శాసనసభ గౌరవాన్ని ప్రశ్నించడం ఏ మేరకు సమంజసమనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. రఘురామపై ఉన్న కేసులు న్యాయస్థానాల్లో తేలాల్సి ఉండగా, ముందే వీధి పోరాటానికి దిగడం సునీల్ కుమార్ వృత్తిగత భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

## ఇక యోగి ట్రీట్మెంటే సొల్యూషనా..

**విజయవాడ, డిసెంబర్ 22, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాత రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. భారీ మెజారిటీతో కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టింది. అయితే, అధికారం కోల్పోయిన వైసీపీ మాత్రం ప్రతిపక్ష హోదా లేకపోయినా ప్రభుత్వంపై నిత్యం విమర్శలు గుప్పిస్తూనే ఉంది. ఈ క్రమంలో కూటమి నేతలు ఇస్తున్న కౌంటర్ల తీరు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన సుదీర్ఘ రాజకీయ అనుభవంతో సాధారణంగా సంయమనం పాటిస్తుంటారు. కానీ, గత ప్రభుత్వ హయాంలో ఎదురైన చేదు అనుభవాల నేపథ్యంలో ఆయన కూడా ఇటీవల ఘాటు వ్యాఖ్యలు చేస్తున్నారు. "తోక కత్తిరిస్తా", "గుండెల్లో నిద్రపోతా" వంటి డైలాగులు కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతున్నప్పటికీ, విశ్లేషకుల దృష్టిలో ఇవి కేవలం మాటలకే పరిమితమవుతున్నాయనే అభిప్రాయం ఉంది.తాజాగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు మరింత దుమారం రేపాయి. "యూపీలో యోగి ఆదిత్యనాథ్ తరహా ట్రీట్‌మెంట్ ఇస్తాం", "కాళ్లు, చేతులు విరగ్గొడతాం" అని ఆయన చేసిన వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. అయితే, సోషల్ మీడియాలో నెటిజన్లు దీనిపై సెటైర్లు వేస్తున్నారు. "చట్టాన్ని అమలు చేసే అధికారం మీ చేతుల్లోనే ఉన్నప్పుడు, వార్నింగ్‌లు ఇవ్వడం ఎందుకు? నేరుగా చర్యలు తీసుకోవచ్చు కదా?" అనేది మెజారిటీ ప్రజల ప్రశ్న.ప్రభుత్వ పెద్దల తీరుపై ప్రజల్లో ప్రధానంగా కొన్ని రకాల వాదనలు వినిపిస్తున్నాయి. ఏదైనా చర్య తీసుకుంటే అది రాజకీయ కక్షసాధింపుగా ముద్ర పడుతుందనే భయం ప్రభుత్వంలో ఉందా? చట్టపరంగా పక్కా ఆధారాలు సేకరించడంలో జాప్యం జరుగుతోందా? అనే అనుమానం ఉంది. అదే సమయంలో వైసీపీ నేతలతో కూటమిలోని కొందరు కీలక నేతలు కుమ్మక్కు అయ్యారనే ఆరోపణలు సామాన్య ప్రజల్లో బలపడుతున్నాయి. అందుకే ఎంత రెచ్చగొట్టినా గట్టి చర్యలు తీసుకోవడం లేదని కొందరు విమర్శిస్తున్నారు. అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సమయంలో, కక్షసాధింపు రాజకీయాలకు వెళ్తే పెట్టుబడులు రావేమోనన్న భావనతో చంద్రబాబు ఆచితూచి అడుగులు వేస్తున్నారా? అనే కోణం కూడా ఉంది.ప్రజాస్వామ్యంలో విమర్శలు సహజం. కానీ, అసత్య ఆరోపణలు, వ్యక్తిత్వ హననం జరుగుతున్నప్పుడు ప్రభుత్వం తన దగ్గర ఉన్న చట్టపరమైన ఆయుధాలను వాడాల్సి ఉంటుంది. వ్యవస్థలను గాడిలో పెట్టడం అంటే కేవలం పాత పథకాల పేర్లు మార్చడం కాదు, తప్పు చేసిన వారిని చట్టం ముందు నిలబెట్టడం కూడా. "అధికారంలో ఉన్న వారు ప్రతిపక్షంలా మాట్లాడకూడదు. చట్టం తన పని తాను చేసుకుపోయేలా ఆదేశాలు ఇవ్వాలి. పదే పదే హెచ్చరికలు జారీ చేయడం వల్ల ప్రభుత్వ బలహీనత బయటపడుతుంది తప్ప, భయం పుట్టదు." అనేది రాజకీయ విశ్లేషకులు చెప్తున్న మాట.కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకం చాలా పెద్దది. వైసీపీ నేతల విమర్శలకు సమాధానం మాటలతో కాకుండా, పారదర్శకమైన విచారణలు, చట్టబద్ధమైన చర్యల ద్వారా చెబితేనే ప్రభుత్వానికి మైలేజ్ పెరుగుతుంది.

# ఔను...వాళ్లిద్దరూ కలిసిపోయారా...





**కడప, డిసెంబర్ 22,పెన్ పవర్:** ఆస్తులు, ఇంకా అనేక రకాల వివాదాలతో కొంతకాలంగా ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమంటున్నది. రాజకీయంగా షర్మిల జగన్మోహన్ రెడ్డి మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. వైసీపీ సోషల్ మీడియా వింగ్ కూడా షర్మిల మీద రాయడానికి వీలు లేని భాషలో ఆరోపణలు చేస్తున్నారు.జగన్, షర్మిల మధ్య ఆస్తుల వివాదాలు కొనసాగుతున్నాయి.. ఇప్పటికే షర్మిల అనేక సందర్భాలలో జగన్మోహన్ రెడ్డికి నోటీసులు పంపించారు. జగన్ కూడా అదే పని చేశారు. షర్మిల తనయుడి ఎంగేజ్మెంట్ కార్యక్రమానికి హాజరైన జగన్.. పెళ్లికి మాత్రం వెళ్ళలేదు. దీంతో వారిద్దరి మధ్య విభేదాలు మరింత పెరిగిపోయాయి. రెండు మూడు సంవత్సరాలుగా ఈ ఇద్దరి మధ్య ఉన్న దూరం అసలైన వైఎస్సార్ అభిమానులను బాధపెడుతోంది. తప్పు ఎవరిది, కారణం ఏమిటి అన్నది వేరే విషయం అయినా, ఒకప్పుడు కలిసి రాజకీయంగా ప్రయాణించిన అన్నా చెల్లెళ్లు ఇలా విడివిడిగా ఉండటం వారికి నచ్చడం లేదు. ఎప్పటికైనా ఈ కుటుంబం మళ్లీ ఒక్కటవ్వాలని, పరస్పర విభేదాలు పక్కన పెట్టాలని కోరుకునే వారు ఎక్కువగానే ఉన్నారు.సాధారణంగా "నీటి కంటే రక్తం చిక్కన" అనే మాట రాజకీయాల్లో కూడా చాలాసార్లు నిజమైంది. గతంలో తీవ్రంగా విభేదించిన రాజకీయ నేతలు, కుటుంబ సభ్యులు కాలక్రమంలో మళ్లీ కలిసిన సందర్భాలు ఉన్నాయి. ఆ కోణంలో చూస్తే జగన్, షర్మిల కూడా భవిష్యత్తులో కలిసే అవకాశం ఉందని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే అది ఎప్పుడు జరుగుతుందన్నది మాత్రం ఎవరూ స్పష్టంగా చెప్పలేని పరిస్థితి. ఇద్దరూ తమ తమ అభిప్రాయాల్లో గట్టి పట్టుదలతో ఉండటమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. ఇటీవల ఒక యూట్యూబ్ ఇంటర్వ్యూలో కడప జిల్లాకు చెందిన వైసీపీ కీలక నేత, మాజీ ఎమ్మెల్సీ సతీష్ కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆయన మాట్లాడుతూ జగన్‌కు తన చెల్లెలంటే ప్రత్యేక అభిమానం ఉందని, కుటుంబాన్ని ఎప్పుడూ గొప్పగా భావించే వ్యక్తి అని తెలిపారు. తాను జగన్‌ను దగ్గరగా చూశానని, ఆయన ఎప్పుడూ కావాలని తప్పులు చేసే మనిషి కాదని అన్నారు. తన అనుభవం ప్రకారం జగన్ ఇతరులకు మేలు చేయాలనే ఆలోచనతోనే పనిచేస్తారని వ్యాఖ్యానించారు. అందుకే అన్నా చెల్లెళ్లు మళ్లీ కలిసే అవకాశాన్ని కొట్టిపారేయలేమని ఆయన అభిప్రాయపడ్డారు.ఇదిలా ఉండగా షర్మిల ప్రస్తుతం ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆమె ప్రధానంగా అధికార కూటమిపైనే విమర్శలు చేస్తూ వస్తున్నారు. జగన్ గురించి కానీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గురించి కానీ ఆమె బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం లేదు. ఒక రాజకీయ పార్టీ నేతగా అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని విమర్శించడం సహజమేనని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. గతంలో వైసీపీపై తీవ్ర విమర్శలు చేసిన షర్మిల ఇప్పుడు వైఖరిలో మార్పు చూపుతున్నారా అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి.మొత్తంగా చూస్తే, జగన్‌షర్మిల మళ్లీ కలవాలని కోరుకునే భావన రాజకీయాల్లోనూ, ప్రజల్లోనూ ఉంది. అలాంటి పరిణామం జరిగితే అది సానుకూల మార్పుగా భావిస్తారు. ఇది సాధ్యమవుతుందా లేదా అన్నది కాలమే నిర్ణయించాలి. కానీ ఈ అంశం చర్చలో ఉండటం మాత్రం ఆ కుటుంబంపై ఉన్న అభిమానం ఎంత బలంగా ఉందో చెప్పే సంకేతంగా కనిపిస్తోంది.వీరిద్దరి మధ్య ఆగాదాన్ని పూడ్చడానికి చాలామంది ప్రయత్నాలు చేసినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది.. అయితే ఇప్పుడు షర్మిల, జగన్ కలిసిపోయారని కొంతమంది రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. జగన్మోహన్ రెడ్డి జన్మదినం.. ఈ సందర్భంగా సోదరి షర్మిల సోషల్ మీడియా వేదికగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. దీంతో రాజకీయ విశ్లేషకులు వారిద్దరు కలిసిపోయారని ప్రచారం చేస్తున్నారు. జగన్ పుట్టినరోజు కాబట్టి.. పైగా మాజీ ముఖ్యమంత్రి కాబట్టి షర్మిల సోషల్ మీడియా వేదిక శుభాకాంక్షలు తెలియజేశారని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. వారిద్దరూ కలిసి పోలేదని.. సోదరుడు కాబట్టి.. అందులోనూ అతడి జన్మదినం కాబట్టి షర్మిల శుభాకాంక్షలు తెలియజేశారని వారు గుర్తు చేస్తున్నారు. మరోవైపు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా సోషల్ మీడియా వేదికగా జగన్మోహన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని.. ప్రజాసేవలో నిమగ్నమై ఉండాలని సోషల్ మీడియా వేదికగా పవన్ కళ్యాణ్ కోరారు.. పవన్ కళ్యాణ్, షర్మిల చేసిన ట్వీట్లు ప్రస్తుతం ఏపీ రాజకీయాలలో సంచలనంగా మారాయి.మరోవైపు వైసీపీ నాయకులు ఏపీవ్యాప్తంగా జగన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. రక్తదానాలు.. రోగులకు ఆహారం పంపిణీ.. దుస్తుల అందజేత వంటి కార్యక్రమాలను చేస్తున్నారు.. ప్రపంచ దేశాలలో ఉన్న వైసిపి నాయకులు కూడా జగన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. షర్మిల, పవన్ మాత్రమే కాకుండా.. ఇంకా చాలామంది రాజకీయ నాయకులు సోషల్ మీడియా వేదికగా జగన్మోహన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు

# రెండో బిడ్డ ఉంటే ప్రభుత్వ ప్రోత్సహాకం



**విజయవాడ, డిసెంబర్ 22, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశముంది. ఆంధ్రప్రదేశ్ లో ఇకపై రెండో శిశువుకు జన్మనిస్తే ప్రోత్సాహకాలు ఇవ్వాలని చంద్రబాబు ప్రభుత్వం యోచిస్తుంది. ఆంధ్రప్రదేశ్ లో జనాభా తగ్గుతుండటంతో ఈ రకమైన నిర్ణయాన్ని త్వరలోనే చంద్రబాబు తీసుకుంటారని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. దేశంలోనే కాదు.. ఏపీలోనూ అందులో దక్షిణాది రాష్ట్రాల్లో గత కొన్నిరోజులుగా జనాభా సంఖ్య తగ్గుతూ వస్తుంది. దీంతో ఏపీ ప్రభుత్వం రెండో బిడ్డను కంటే ప్రోత్సాహకాలు ఇచ్చే యోచనలో ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్ లో వృద్ధుల జనాభా పెరగడంతో పాటు సంతానోత్పత్తి రేటు తగ్గుదల ఆందోళన కలిగిస్తుంది.ఇదే విషయాన్ని చంద్రబాబు పదే పదే అనేక బహిరంగ సభల్లో ప్రస్తావిస్తున్నారు. ప్రతి వారు ఇద్దరు లేదా ముగ్గురు సంతానాన్ని కలిగి ఉండాలని చెబుతూ వస్తున్నారు. అయితే పెరుగుతున్న ఖర్చులు, ఆర్థిక భారం దృష్ట్యా చాలా మంది సింగిల్ శిశువుకే పరిమితమవుతున్నారు. దీంతో పాటు సంతాన సాఫల్యత పెంచేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఫెర్టిలిటీ సెంటర్లను కూడా ఏర్పాటు చేయాలన్న ఉద్దేశ్యంలో ఉన్నట్లు ప్రచారం సాగుతుంది. జనాభా నియంత్రణ నుంచి జనాభా సుస్థిరత వైపు ప్రభుత్వ పాలసీని మార్చుకుని చంద్రబాబు ఆ దిశగా త్వరలోనే కీలక ప్రకటన చేయనున్నారని తెలిసింది. ఆంధ్రప్రదేశ్‌లో జనాభా సంక్షోభం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది.రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు ఆందోళనకరంగా పడిపోవడంతో, భవిష్యత్తులో తలెత్తే తీవ్ర పరిణామాలను నివారించేందుకు ప్రభుత్వం కీలక చర్యలకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఫ్రాన్స్, హంగేరీ వంటి దేశాల్లో అమలు చేస్తున్న తరహాలో 'రెండో బిడ్డను కనేవారికి' ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు ఓ అధికారి వెల్లడించారు. ఇటీవల అమరావతిలో జరిగిన 5వ కలెక్టర్ల సదస్సులో ఈ ఆందోళనకరమైన గణాంకాలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ బయటపెట్టారు. జాతీయ సగటు 28.4 ఏళ్లతో పోలిస్తే, ఏపీలో సగటు వయసు 32.5 ఏళ్లుగా ఉందని, ఇది రాష్ట్రం వేగంగా వృద్ధాప్యం వైపు వెళ్తోందనడానికి సంకేతమని ఆయన వివరించారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 1.5కు పడిపోయిందని, ఇది సాధారణంగా ఉండాల్సిన 2.1 కంటే చాలా తక్కువని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ. పనిచేయని వయసు జనాభా పెరుగుతోంది. ఇకపై పిల్లల్ని కనేలా కుటుంబాలను ప్రోత్సహించడంపైనే మన దృష్టి పెట్టాలనడం దీనిని సూచిస్తుంది

# ప్రచారంలో నిజమెంత

**విజయవాడ, డిసెంబర్ 22,పెన్ పవర్:** వైసీపీ అధినేత జగన్ అనేక మంది నాయకులను వచ్చే ఎన్నికలలో పక్కన పెట్టేస్తారని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. ముఖ్యంగా కొడాలి నాని, ఆర్కే రోజా, ఆళ్ల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విడదల రజని ఇలా అనేక మంది నేతలకు ఈ సారి నియోజకవర్గాలను మార్చడమో... లేక పక్కన పెట్టడమో చేస్తారన్న ప్రచారం ఇటీవల కాలంలో ఎక్కువగా వినిపిస్తుంది. చాలా నియోజకవర్గాల్లో జగన్ సీనియర్ నేతలకు ప్రత్యామ్నాయంగా యువ నేతల కోసం చూస్తున్నారని అంటున్నారు. అందులో నిజమెంత అన్నది మాత్రం వైసీపీ నేతలు చెప్పకపోయినా.. 2029 ఎన్నికల్లో మాత్రం జగన్ అలాంటి సాహసం చేయకపోవచ్చున్న అభిప్రాయం మాత్రం బలంగా పార్టీ లోనే వినపడుతుంది.2024 ఎన్నికల్లోనే మంత్రులను, ముఖ్యమైన నేతలను నియోజకవర్గాలను మార్చి జగన్ చేతులు కాల్చుకున్నారు. ఈసారి కూడా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని నగిరి నియోజకవర్గానికి, ఆళ్ల రామకృష్ణారెడ్డిని సత్తెనపల్లికి, విడదల రజనీని రేపల్లెకు పంపాలని దాదాపు డిసైడ్ అయ్యారన్న ప్రచారం ఉంది. ఇక ఆర్కే రోజాకు ఈసారి ఎక్కడా సీటు ఇవ్వకుండా అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీ ఇస్తామన్న హామీ ఇస్తారంటున్నారు.ఇందులో నిజం లేదని చెబుతున్నారు. ఎందుకంటే ఇప్పటికే ఆ యా నియోజకర్గాల్లో ఆ నేతలు విపరీతంగా పార్టీ కోసం పనిచేస్తున్నారు. కొత్త నాయకత్వం వస్తే మళ్లీ రెండు గ్రూపులవుతాయి. అందువల్ల పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. పైగా ఈ నేతల వల్ల పార్టీకి నష్టమేమీ లేదని, అటువంటి వారిని ఎందుకు తప్పిస్తారన్న ప్రశ్న ఎదురవుతుంది.వైసీపీని బద్నాం చేయడానికి కొందరు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని, వాటిని నమ్మవద్దంటూ నేతలకు వైఎస్ జగన్ ఇటీవల వారికే స్పష్టత ఇచ్చినట్లు తెలిసింది. నియోజకవర్గాల్లో కష్టపడి పనిచేయాలని, ప్రజాసమస్యలపై స్పందిస్తూ ఆందోళనకు దిగాలని జగన్ వారికి సూచించినట్లు సమాచారం. క్యాడర్ ను కూడా కాపాడుకుంటూ ప్రజల పక్షాన నిలస్తే టిక్కెట్ అదే వస్తుందని జగన్ చెబుతుండటంతో వారికి భరోసా వస్తుందట. పెద్దిరెడ్డినే తీసుకుంటే ఆయన తన నియోజకవర్గమైన పుంగనూరును వదిలపెట్టి బయటకు వచ్చే ప్రసక్తి ఉండదని చెబుతున్నారు. అలాగే కొడాలి నానిని మించిన నేత గుడివాడలో దొరకడం కూడా వైసీపీకి కష్టమే అవుతుందని, అందువల్ల జగన్ ఆ రిస్క్ ఎందుకు తీసుకుంటారన్నది పార్టీ నేతల నుంచి వినిపిస్తున్నటాక్

# తిరుమల కొండకు మరో మణిహారం

**తిరుమల, డిసెంబర్ 22, పెన్ పవర్:** తిరుమల కొండలకు మరో మణిహారంకలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల కొండలకు మరో మణిహారం చేరనుంది. భారత సాంప్రదాయ వైద్యానికి ప్రాణం పోసే ఔషధ మొక్కల సంరక్షణ లక్ష్యంగా తిరుమలలో టీటీడీ రూ.4.25 కోట్లతో దివ్య ఔషధ వనాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అరుదైన, అంతరించిపోతున్న ఔషధ మొక్కలకు నిలయంగా ఉన్న శేషాచలం అడవులకు జీవనాడిగా దివ్య ఔషధ వనాన్ని ఏర్పాటు చేయాలని టీటీడీ నిర్ణయం తీసుకుంది.ఔషధ మొక్కలను సంరక్షిస్తూ, ప్రజలకు పరిచయం చేయడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ లక్ష్యాలకు దివ్య ఔషధ వనం తోడ్పడనుంది. దక్షిణ భారతదేశంలోనే ఈ తరహాలో రూపొందనున్న ఈ ఔషధ వనం భక్తులు, పరిశోధకులు, విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులకు ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.టీటీడీ ఏర్పాటు చేయనున్న దివ్య ఔషధ వనంలో దేహ చికిత్స వనం, సుగంధ వనం, ప్రసాద వనం, జీవరాశి వనం, పవిత్ర వనం, పూజా ద్రవ్య వనం, కల్పవృక్ష ధామం, ఔషధ కుండ్, మూలికా వనం, ఋతు వనం, విశిష్ట వృక్ష వనం, ఔషధ మొక్కలు వంటి 13 రకాల ప్రత్యేక థీమ్ ఆధారిత విభాగాలు ఏర్పాటు చేయనున్నారు.తిరుమలలోని జీఎన్సీ టోల్ గేట్ కు సమీపంలో దిగువ, ఎగువ ఘాట్ రోడ్లకు మధ్యలో ఉన్న 3.90 ఎకరాల స్థలంలో

ఈ దివ్య ఔషధ వనం అభివృద్ధి చేసేందుకు టీటీడీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.వచ్చే నెలలో పనులు ప్రారంభించి మొక్కలను పెంచి, భక్తుల సందర్శనకు వీలుగా పార్కింగ్, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి వచ్చే ఏడాది చివరి నాటికి పూర్తిస్థాయిలో ఔషధ వనాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. రూ.4.25 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ఈ ప్రాజెక్టుకు టీటీడీ ఆమోదం తెలిపింది

# శీతాకాలంలో ఈ కూరగాయలు ఫ్రిజ్‌లో పెట్టకూడదా?



**హైదరాబాద్ పెన్ పవర్:** కూరగాయలు పాడవకుండా ఉండాలని మార్కెట్ నుండి తెచ్చిన వెంటనే ఫ్రిజ్‌లో పెట్టడం మనలో చాలా మందికి అలవాటు. అయితే అన్ని సీజన్లలో, అన్ని రకాల కూరగాయలను ఫ్రిజ్‌లో నిల్వ చేయడం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా చలికాలంలో కొన్ని కూరగాయలను ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల వాటి పోషక విలువలు తగ్గడమే కాకుండా, ఆరోగ్యానికి హాని కలుగుతుందని సూచిస్తున్నారు. అల్లంను ఫ్రిజ్‌లో పెడితే తేమ కారణంగా త్వరగా బూజు పడుతుంది. ఇది తెలియకుండా వాడితే కాలేయం, కిడ్నీలపై తీవ్ర ప్రభావం పడుతుంది. అలాగే బంగాళాదుంపలను ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల అందులోని స్టార్చ్ చక్కెరగా మారుతుంది. ఇది షుగర్ వ్యాధిగ్రస్తులకే కాకుండా అందరికీ అనారోగ్యకరమే. చలికాలంలో బంగాళాదుంపలు త్వరగా మొలకలు వచ్చే ప్రమాదం కూడా ఉంది. టమోటాలను ఫ్రిజ్‌లో పెడితే వాటి సహజ రుచి, ఆకృతి దెబ్బతింటాయి. చలికాలంలో వీటిని బయట గది ఉష్ణోగ్రత వద్ద నిల్వ ఉంచడమే ఉత్తమం. క్యారెట్, కాలీఫ్లవర్ వంటి వాటిని కూడా ఫ్రిజ్‌లో ఉంచకపోవడమే మంచిది. అధిక చలి వల్ల అవి మెత్తబడి, రుచిని కోల్పోతాయి. ఆకుకూరలను కొన్న వెంటనే శుభ్రం చేసి ఫ్రిజ్‌లో పెట్టినా, 24 గంటల లోపే వాడుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. లేదంటే వాటిలోని పోషకాలు నశించే అవకాశం ఉంది. కాబట్టి ఈ శీతాకాలంలో ఫ్రిజ్ వాడకంపై కాస్త జాగ్రత్త వహించండి.

# ట్రెండ్ కోసం క్రాక్స్ వాడుతున్నారా?



**హైదరాబాద్ పెన్ పవర్:** క్రోక్స్ చెప్పుల వాడకం ప్రస్తుతం ట్రెండ్‌గా మారింది, కానీ ఇవి మీ పాదాలకు, ముఖ్యంగా పిల్లలకు ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాదాలలో సహజంగా ఉండే వంపు (ఆర్చ్) అభివృద్ధికి క్రోక్స్ అడ్డుపడి, ఫ్లాట్‌ఫుట్ సమస్యకు దారితీస్తుంది. ఇది భవిష్యత్తులో మోకాలి నొప్పులు, ప్లాంటర్ ఫాసియాటిస్ వంటి అనేక ఆరోగ్య సమస్యలకు కారణం కావచ్చు. ఈ మధ్యకాలంలో చాలామంది క్రాక్స్ లేదా క్రాక్స్ లాంటి డిజైన్ ఉన్న చెప్పులు వాడుతుండడం చూస్తూ ఉన్నాం. ఇటు ఎండలోనూ అటు వానలోను సౌకర్యవంతంగా ఉంటుందని ఈ క్రాక్స్ ని చాలామంది వాడుతున్నారు. యూత్ లో ఇదొక ట్రెండ్ గా కూడా మారింది. జీన్స్ అయినా ఫార్మల్ అయినా షార్ట్స్ అయినా దేని పైన వేసుకున్న ఈ క్రాక్స్ అలా సూట్ అయిపోతాయి. అసలు క్రాక్స్ కనిపెట్టింది పడవల్లో వెళ్లి చేపలు పట్టే జాలర్ల కోసం. ఎప్పుడు తడిగా ఉండే బోట్స్ లో జారిపడకుండా ఉండేందుకు వీటిని ఉపయోగించేవాళ్ళు. ఆ తర్వాత యూరప్ యూత్ దీన్ని వరల్డ్ వైడ్ చేసి పడేసింది. సరే పెద్దవాళ్లు వేసుకోవడంలో పర్వాలేదు కానీ చిన్నపిల్లలకు కూడా తల్లిదండ్రులు క్రాక్స్ కొనివ్వడం, పిల్లలు కూడా వాటికి అలవాటు పడిపోయి క్రాక్స్ లాంటి చెప్పలే కావాలని అడగడం సహజంగా మారింది. ఇంతవరకు బాగానే ఉన్నా క్రాక్స్ వల్ల మెడికల్ ప్రాబ్లమ్స్ వస్తాయి అంటున్నారు డాక్టర్స్. ఎలా అంటే చిన్నప్పుడే కాళ్లలో ఒక ఆర్చ్ ఆకారంలో వంపుగా పాదాలు పెరుగుతాయి. మడమ కింద ఈ ఆర్చ్ చిన్న వయసు నుంచే డెవలప్ అవుతుంది. ఇది సహజంగా మన బరువును ఆపేందుకు, కాళ్ల పైన ఒత్తిడి తగ్గించేందుకు ఉపయోగపడే విధానం. అయితే ఈ క్రాక్స్ వాడటం వల్ల ఆ ఆర్చ్ ఆకారంలో కి పాదాలు మారడం తగ్గుతుందని నిపుణులు గమనించారు. దీనివల్ల ఫ్లాట్ ఫుట్ ప్రాబ్లం వస్తుంది. ఇది భవిష్యత్తులో అనేక రకాల కాళ్ల, మోకాళ్ళ సమస్యలకు కారణంగా మారుతుంది. దీనివల్ల వాకింగ్ స్టైల్ మారుతుంది, హీల్ పెయిన్ కూడా వస్తుంది. పాదాల కింద ఆనికాయలు కూడా ఏర్పడతాయి. ప్లాంట పేసైటిస్ అనే వ్యాధి కూడా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే క్రాక్స్ లాంటి డిజైన్ ఉన్న చెప్పుల బదులు సాఫ్ట్ మెటీరియల్ ఉన్న శాండిల్స్, లేదా ఆర్చ్ ఆకారంలో ఉండే షూస్ వాడడం బెటర్ అంటున్నారు డాక్టర్స్.

# ఇడ్లి ప్లేట్‌కు అంటుకుంటుందా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంట్లో ఇడ్లీలు తయారుచేసేటప్పుడు, సగం ఇడ్లీ ప్లేట్‌కు అంటుకుంటుంది. ఇలా ఎందుకు జరుగుతుందో మనకు తెలియకపోతే, పిండిని పిసికి కలుపమని చెబుతాము. మీకు కూడా అదే జరుగుతుందా? ఇడ్లీ ప్లేట్‌కు పిండి అంటుకోకుండా ఉండటానికి ఒక సులభమైన ఉపాయం ఉంది. ఒక చిన్న గిన్నె తీసుకొని దానిలో 2 టేబుల్ స్పూన్ల పిండి, 2 టేబుల్ స్పూన్ల నూనె కలపండి. ఈ మిశ్రమాన్ని మీరు ఇడ్లీ తయారు చేస్తున్న ప్లేట్?కు అప్లై చేయండి. 2 నిమిషాల తర్వాత, ఇడ్లీ పిండిని ప్లేట్లోకి పోసి ఉడికించాలి. నెయ్యి ఎందుకు జోడించాలి? చాలా మంది ఇడ్లీ ప్లేట్ కి నూనె రాసుకున్న తర్వాత ఇడ్లీ పోస్తారు. నూనె పోసినా పిండి దానికి అంటుకుంటుందని వారికి తెలియదు. ఆ సమస్య రాకుండా ఉండేందుకు, అంటుకోకుండా ఉండేందుకు మనం నెయ్యి కలుపుతాము. నెయ్యి, నూనె కలిపి రాసి పిండి పోస్తే, ఇడ్లీ అంటుకోకుండా బంతిలా బయటకు వస్తుంది. ఇడ్లీ పిండి అంటుకోకుండా ఎలా నివారించాలి?: ఇడ్లీ పిండి ఇడ్లీ ప్లేట్?కు అంటుకోకుండా ఉండటానికి, ముందుగా ఒక గిన్నెలో 1 టీస్పూన్ నెయ్యి, 1 టీస్పూన్ నూనె తీసుకుని, రెండు పదార్థాలను బాగా కలిపి ఇడ్లీ ప్లేట్ పై అప్లై చేయండి. నూనె-నెయ్యి మిశ్రమాన్ని అప్లై చేసే ముందు ఇడ్లీ ప్లేట్ తడిగా లేకుండా చూసుకోండి. లేకపోతే, నెయ్యి-నూనె మిశ్రమం ప్లేట్ కు అస్సలు అంటుకోదు. ఇడ్లీలు పోసేటప్పుడు గుర్తుంచుకోవలసిన విషయాలు: ఇడ్లీ పిండిని దానిలో పోయడానికి ముందు, మీరు ఇడ్లీ పాన్‌లో నీరు పోసి ఓవెన్‌లో ఉంచాలి. నీరు మరిగిన తర్వాత మాత్రమే, మీరు పిండి పోసిన ప్లేట్‌ను ఉంచాలి. చాలా మంది పిండిని దానిలో పోసి ఓవెన్ ఆన్ చేస్తారు. మీరు ఎప్పుడూ ఆ తప్పు చేయకూడదు. కొంతమంది ఇడ్లీ అని భావించి ఎక్కువసేపు ఓవెన్‌లో ఉంచుతారు. మీరు ఇడ్లీని ఎక్కువసేపు ఉడికినా, సగం ఇడ్లీ పాన్ లేదా గుడ్డకు అంటుకుంటుంది. ఓవెన్ ఆఫ్ చేయండి: సరైన సమయంలో ఇడ్లీ ఉడికిన తర్వాత, ఓవెన్ ఆఫ్ చేయండి లేదా ఇడ్లీ పాన్‌ను క్రిందికి తీసి కింద పెట్టండి. ఇడ్లీ ఉడికి ఓవెన్ నుండి తీసిన తర్వాత, వెంటనే మూత తెరవకండి. మీరు అలా చేస్తే, వేడి మూత నుండి వచ్చే ఆవిరి అంతా ఇడ్లీలోకి పోసి తడిసిపోతుంది. కాబట్టి, మీరు దానిని తెరిచి వేడి కొద్దిగా తగ్గినప్పుడు ఇడ్లీని బయటకు తీయవచ్చు.


# పెరిగిన చలికి బుగ్గలు పగులుతున్నాయా?



**హైదరాబాద్ పెన్ పవర్:** చలికాలంలో చర్మంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఈ సీజన్‌లో పొడి గాలుల కారణంగా చర్మం తేమ కోల్పోతుంది. దీంతో, అనేక సమస్యలు వస్తాయి. ముఖ్యంగా చర్మం పొడిబారడం. బుగ్గలపై చర్మం పొడి బారి పగిలిపోతుంది. కొన్ని సందర్భాల్లో బుగ్గలపై ఎర్రటి మచ్చలు ఏర్పడతాయి. ఇది ముఖ అందాన్ని పాడు చేస్తుంది. అయితే, డాక్టర్ చెప్పిన కొన్ని చిట్కాలు పాటిస్తే అవి మృదువుగా మారతాయి. శీతాకాలంలో రోజు రోజుకి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. పెరిగిన చలికి చర్మ సమస్యలు పెరుగుతాయి. ఇది చర్మం యొక్క ఆకృతిని ప్రభావితం చేస్తుంది. ఈ సీజన్‌లో చల్లని గాలి చర్మంలోని తేమను తీసివేస్తుంది. లోపలి నుంచి పగుళ్లకు కారణమవుతుంది. ఇది చనిపోయిన చర్మ కణాలతో పాటు తెల్లగా, పొడిగా కనిపించడానికి దారితీస్తుంది. అంతేకాకుండా చలికాలంలో పొల్యూషన్ కూడా ఎక్కువగా ఉంటుంది. ఈ పొల్యూషన్ కూడా చర్మంపై ప్రభావం చూపిస్తుంది. ఈ సీజన్‌లో చర్మ సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. లేదంటే.. చర్మం దెబ్బతింటుంది. ఇలాంటి సమస్యల్లో ఒకటి బుగ్గలు పగిలిపోవడం. అందం విషయంలో బుగ్గలు కీలకపాత్ర పోషిస్తాయి. పొడిగాలి వల్ల బుగ్గలు ఎక్కువ పొడిబారతాయి. బుగ్గలు ఎర్రటి మచ్చలతో నిండిపోతాయి. బుగ్గలపై గాయాలు కూడా అవుతాయి. ఇలా జరగడానికి కారణాలు, ఎలా నివారించాలో స్పెషలిస్ట్ డాక్టర్స్ చెప్పారు. బుగ్గలు పగిలిపోవడానికి కారణాలు..చర్మం పొడిబారడం లేదా బుగ్గలు ఎర్రబడటం వెనుక అనేక కారణాలు ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. చలి వాతావరణం: తక్కువ తేమ, శీతాకాలంలో చల్లని ఉష్ణోగ్రతలు చర్మాన్ని పొడిబారుస్తాయి. అంతేకాకుండా చాలా మంది చలికాలంలో ఇండోర్ హీటర్లు వాడతారు. దీని వల్ల తేమ మరింత తగ్గి చర్మం మరింత పొడిబారుతుంది. దీంతో, బుగ్గలు పగిలిపోతాయి. రసాయనాలు: స్నానానికి ఉపయోగించే సబ్బులు, షాంపూలు వంటి అనేక ఉత్పత్తులు కఠినమైన రసాయనాల్ని కలిగి ఉంటాయి. ఈ పదార్థాలు చర్మం యొక్క రక్షణ పొరను దెబ్బతీస్తాయి. పొడిబారడానికి కారణమవుతుంది. వేడి నీరు: చాలా మంది చలికాలంలో వేడి నీటితో స్నానం చేస్తుంటారు. ఇలా చేయడం వల్ల చర్మం తేమను కోల్పోతుంది. అందుకే చలికాలంలో వేడి నీటితో స్నానం చేయకుండా ఉండటం మంచిది. కొన్ని మందులు: టాపికల్ రెటినాయిడ్స్ వంటి కొన్ని మందులు కూడా చర్మం పొడిబారడానికి కారణమవుతాయి. బుగ్గలు పగలకుండా కాపాడే చిట్కాలేంటో ఇప్పుడు చుద్దాం. మాయిశ్చరైజింగ్ క్రీములు..పొడి చర్మం పగుళ్లకు కారణమవుతుంది. లేదా తీవ్రతరం చేస్తుంది. అందుకే చర్మాన్ని బాగా హైడ్రేట్‌గా ఉంచుకోవడం చాలా ముఖ్యం. క్రమం తప్పకుండా మాయిశ్చరైజర్ అప్లై చేయండి. చర్మం ఎక్కువ పగిలితే.. ఆయింట్‌మెంట్లు, క్రీముల్ని వాడటానికి ప్రయత్నించండి. ముఖ్యంగా స్నానం చేసిన వెంటనే రోజుకు రెండు నుంచి మూడు సార్లు మాయిశ్చరైజర్‌ని అప్లై చేయండి. అంతేకాకుండా శరీరంలోని పొడి ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ వహించండి. నూనె వాడండి..చలికాలంలో పొడి చర్మానికి కావాల్సిన తేమను అందించాలి. పగిలిన బుగ్గలకు నూనె రాయడం వల్ల వాటిని నివారించవచ్చు. ఇందుకోసం జోజోబా నూనె, కొబ్బరి నూనె, ఆలివ్ నూనె, షియా బటర్ వంటి వాటిని ప్రయత్నించండి. మీ బుగ్గలకు నూనె వద్దనుకుంటే..రాత్రి పూట పడుకునేముందు నెయ్యిని ఉపయోగించండి. ఇది చర్మం లోపలికి చొచ్చుకుపోయి తేమను అందిస్తుంది. పెట్రోలియం జెల్లీ..పెట్రోలియం జెల్లీ కూడా బుగ్గలపై పగిలిన చర్మాన్ని నయం చేస్తుంది. ఇది ఒక రక్షణ పొరను ఏర్పరుస్తుంది. ఇది పగుళ్లను నయం చేస్తుంది. ఇది చర్మంలోని తేమను లాక్ చేస్తుంది. పగిలిన చర్మాన్ని నయం చేయడంలో

సాయపడుతుంది. పొడి చర్మంతో పాటు పగిలిన బుగ్గలకు పెట్రోలియం జెల్లీని అప్లై చేయండి. పెట్రోలియం జెల్లీలో వాసెలిన్ కూడా ఉంటుంది. పొడిబారిన పెదవులకు పెట్రోలియం జెల్లీ ప్రభావవంతంగా ఉంటుంది. ఈ చిట్కాలు కూడా ట్రై చేయండి..ముఖం వాష్ చేసుకునేటప్పుడు హెర్బల్ ఫేస్ వాష్, గోరువెచ్చని నీటిని ఉపయోగించండి. ఆపై కలబంద జెల్ లేదా మాయిశ్చరైజర్ రాయడం మర్చిపోవద్దు. ఇది మీ బుగ్గల్ని మృదువుగా ఉంచడంలో సాయపడుతుంది. తేనె, కలబందను బుగ్గలకు అప్లై చేయడం వల్ల ఉపశమనం లభిస్తుంది. తేనె చర్మంలోని తేమను తగ్గించడంలో సాయపడుతుంది. ఇక, కలబంద చర్మాన్ని ప్రకాశవంతం చేయడంలో సాయపడుతుంది.

# డెస్క్ జాబ్ చేసేవారికి డాక్టర్ చెప్పిన సింపుల్ టెక్నిక్..



**హైదరాబాద్ పెన్ పవర్:** కార్పోరేట్ ఆఫీసుల్లో చాలా మంది ప్రతిరోజూ 8-9 గంటలు ఆఫీసులో కూర్చొని పని చేస్తారు. ఇది కొత్త పని సంస్కృతిగా మారింది. ఇంకొందరు అయితే.. 12 గంటలు కూర్చొని పనిచేస్తారు. ఇక, ఇంటికి వచ్చిన తర్వాత కూడా కుర్చీలోనే కూర్చుని టీవి చూడటం లాంటి పనులు చేస్తుంటారు. దీంతో ఒక రోజులో 12 నుంచి 14 గంటలు కూర్చోవడం అలవాటుగా మారింది. కూర్చోడం సౌకర్యంగా అనిపించవచ్చు. అయితే, ఈ అలవాటు క్రమంగా గుండె జబ్బులకు కారణమవుతుందని మీకు తెలుసా? ప్రస్తుతం చాలా మంది బిజీ లైఫ్‌స్టైల్ లీడ్ చేస్తున్నారు. చాలా మంది ఎక్కువ సమయం కూర్చునే జాబ్ చేస్తున్నారు. రోజుకు ఆఫీసులో 8 నుంచి 10 గంటలు కూర్చొని పనిచేస్తున్నారు. ఇక, ఇంటికి వెళ్లినా కూర్చునే ఫోన్లలో రీల్స్ చూడటం లేదా.. టీవీ చూడటం లాంటి పనులు చేస్తున్నారు. ఇది ఎంత మాత్రం మంచిది కాదంటున్నారు నిపుణులు. ఇలా గంటల తరబడి కూర్చుని గడపడం వల్ల ఆరోగ్యంపై చాలా ప్రతికూల ప్రభావాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. కూర్చుని పనిచేయడం వల్ల తరచుగా రక్త ప్రసరణ నెమ్మదిస్తుంది. ఇది దీర్ఘకాలంలలో ధమనుల్లో కొవ్వు పేరుకుపోయే ప్రమాదాన్ని పెంచుతుంది. ఇది గుండెపై ఎక్కువ ఒత్తిడిని కలిగిస్తుంది. దీంతో, గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం పెరుగుతుంది. గుండెపోటు ఈ రోజుల్లో చాలా మందిని భయపెడుతున్న అంశం. రోజు రోజుకి గుండెపోటు కేసులు వేగంగా పెరుగుతున్నాయి. అందుకే ఈ పరిస్థితిని నివారించాలి. దీని కోసం ప్రముఖ ఓ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఒక పరిష్కారం చెప్పారు. ఈ ఫార్ములా ఫాలో మీ గుండె సేఫ్ అంటున్నారు. ఎక్కువసేపు కూర్చుని పనిచేసేవాళ్లు ఫాలో అవ్వాల్సిన ఫార్ములా ఏంటో ఇప్పుడు చుద్దాం.


కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎక్కువసేపు కూర్చోవడం వల్ల గుండె జబ్బుల ప్రమాదం గణనీయంగా పెరుగుతుందని వివరించారు. అలాంటి పరిస్థితుల్లో మీరు “58 నిమిషాల పని మరియు 2 నిమిషాల వ్యాయామం” అనే ఫార్ములాను ఫాలో అవ్వాలని సూచించారు. దీని అర్థం మీరు ప్రతి గంటకు రెండు నిమిషాలు నిలబడి వ్యాయామం చేయాలి. మిగిలిన 58 నిమిషాలు పని చేయాలి. వ్యాయామం గుండెని ఆరోగ్యంగా ఉంచుతుందని డాక్టర్ చెప్పారు. డాక్టర్ మొత్తం 8 వేర్వేరు వ్యాయామాలను పంచుకున్నారు. వీటిని మీరు ప్రతి గంటకు ప్రత్యామ్నాయంగా చేయవచ్చు. అంటే ఒక గంటకు ఒక వ్యాయామం చేస్తే.. మరో గంటకు ఇంకో వ్యాయామం చేయవచ్చు. ప్రతి వ్యాయామం సుమారు 1 నిమిషం పడుతుంది. ఆ తర్వాత ఇంకో నిమిషం నడవాలి. ఈ విధంగా 58 నిమిషాల పని.. రెండు నిమిషాలు వ్యాయామానికి కేటాయించాలని డాక్టర్ సూచిస్తున్నారు. ఇన్స్టిట్యూట్ ఆఫ్ అలెర్జీ అండ్ ఇన్ఫెక్షియస్ డిసీజెస్ ప్రకారం.. రోజుకు ఆరు గంటలు లేదా అంతకంటే ఎక్కువసేపు నిరంతరం కూర్చోవడం వల్ల జీవక్రియపై ప్రభావం చూపుతుంది. శరీరం కేలరీలను నెమ్మదిగా బర్న్ చేస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి.? కొవ్వు సులభంగా పేరుకుపోతుంది. ఇది ఊబకాయం, రక్తంలో షుగర్ లెవల్స్, అధిక కొలెస్ట్రాల్ ప్రమాదాన్ని పెంచుతుంది. నిరంతరం కూర్చోవడం వల్ల నడుము, మెడ, తుంటి కండరాలు బలహీనపడతాయి. ఇది వెన్నునొప్పి, మెడ సమస్యలకు కారణమవుతుంది. ఎక్కువసేపు కూర్చోవడం వల్ల శారీరక ఆరోగ్యంపైనే కాకుండా మానసిక ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని అనేక అధ్యయనాలు కనుగొన్నాయి.

# నిద్ర కోసం సాక్సు వేసుకోవాలా?




**హైదరాబాద్ పెన్ పవర్:** చలికాలం వచ్చిందంటే చాలు.. రాత్రి వేళ పాదాలు ఐస్ ముక్కల్లా చల్లబడిపోతుంటాయి. ఆ చలిని తట్టుకోవడానికి చాలా మంది సాక్సులు వేసుకుని పడుకుంటారు. మరికొందరు ఇది ఆరోగ్యానికి మంచిది కాదు అని వాదిస్తుంటారు. చలికాలం వచ్చిందంటే చాలు.. రాత్రి వేళ పాదాలు ఐస్ ముక్కల్లా చల్లబడిపోతుంటాయి. ఆ చలిని తట్టుకోవడానికి చాలా మంది సాక్సులు వేసుకుని పడుకుంటారు. మరికొందరు ఇది ఆరోగ్యానికి మంచిది కాదు అని వాదిస్తుంటారు. అసలు రాత్రి పూట సాక్సులు ధరించి నిద్రపోవడం వల్ల మన శరీరంలో ఏం జరుగుతుంది? సైన్స్ ప్రకారం, మన పాదాలు వెచ్చగా ఉన్నప్పుడు మెదడుకు “శరీరం రిలాక్స్ అయ్యింది” అనే సంకేతం అందుతుంది. దీనిని ‘వాసోడైలేషన్’ అంటారు. సాక్సులు వేసుకోవడం వల్ల పాదాల్లోని రక్తనాళాలు వ్యాకోచించి, రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. దీనివల్ల శరీర ఉష్ణోగ్రత సమతుల్యంగా మారి, మీరు త్వరగా గాఢ నిద్రలోకి జారుకుంటారు. శీతాకాలంలో చాలా మందికి పాదాల పగుళ్లు ఇబ్బంది పెడుతుంటాయి. రాత్రి పూట పాదాలకు మంచి మాయిశ్చరైజర్ లేదా ఆయిల్ రాసి, పైన కాటన్ సాక్సులు వేసుకుంటే.. తేమ చర్మంలోనే ఉండి పాదాలు మృదువుగా మారుతాయి. కొందరికి చలి వల్ల చేతులు, కాళ్లు నీలం రంగులోకి మారి మొద్దుబారిపోతుంటాయి. అలాంటి వారికి సాక్సులు ధరించడం వల్ల పాదాల ఉష్ణోగ్రత స్థిరంగా ఉండి, రక్త ప్రసరణకు ఎలాంటి ఆటంకం కలగదు. లాభాలు ఉన్నాయని ఎలా పడితే అలా సాక్సులు వేసుకోకూడదు. కొన్ని జాగ్రత్తలు పాటించకపోతే ఇబ్బందులు తప్పవు. మరీ టైట్‌గా ఉండే సాక్సులు వేసుకుంటే రక్త ప్రసరణ ఆగిపోయే ప్రమాదం ఉంది. ఎప్పుడూ లూజ్‌గా ఉండే సాక్సులనే ఎంచుకోవాలి. రోజంతా వాడిన సాక్సులనే రాత్రి కూడా వేసుకోవద్దు. దీనివల్ల ఫంగల్ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది. నిద్రపోయే ముందు శుభ్రమైన, కొత్త సాక్సులు ధరించాలి. సింథటిక్ లేదా నైలాన్ సాక్సుల కంటే కాటన్ లేదా ఉన్ని సాక్సులు శ్రేయస్కరం. ఇవి పాదాలకు గాలి ఆడేలా చూస్తాయి. రాత్రి పూట సాక్సులు వేసుకుని పడుకోవడం వల్ల నిద్ర నాణ్యత పెరుగుతుందనేది వాస్తవం. అయితే పైన చెప్పిన జాగ్రత్తలు పాటిస్తేనే అది ఆరోగ్యానికి మంచిది. ఇకపై చలి రాత్రుల్లో హాయిగా నిద్రపోవాలంటే ఒక జత కాటన్ సాక్సులను సిద్ధం చేసుకోండి!

# వాయు కాలుష్యం ఊపిరితిత్తులకు హాని కలిగిస్తుందా?



గాలి నాణ్యత సూచికలో మార్పులు చాలా శ్వాసకోశ సమస్యలను కలిగిస్తున్నాయి . కానీ ఇటీవల కేంద్ర ప్రభుత్వం దీనిని పరిష్కరించడానికి ఏమీ చేయడం లేదని ప్రశ్న తలెత్తినప్పుడు, కేంద్ర పర్యావరణ మంత్రి దీనిని ఖండించారు. శ్వాసకోశ సమస్యలతో దీనికి సంబంధం లేదని అన్నారు. దీనికి తగినంత ఆధారాలు లేవని ఇటీవల చర్చనీయాంశమైంది. దీని వెనుక నిజం ఏమిటి? పర్యావరణ మార్పులకు, ముఖ్యంగా గాలి నాణ్యత సూచిక స్థాయికి మరియు శ్వాసకోశ సమస్యలకు మధ్య ఏదైనా సంబంధం ఉందా? లేదా? ఇక్కడ మనం చూడబోతున్నాం. ఊపిరితిత్తుల సామర్థ్యంపై ప్రభావం: గాలి నాణ్యత సూచిక స్థాయిలలో నిరంతర మార్పులు వివిధ ఆరోగ్య సమస్యలు, పర్యావరణ సమస్యలను కలిగిస్తాయి. ముఖ్యంగా గాలి నాణ్యత సూచిక స్థాయి చాలా పేలవంగా ఉండి చాలా కాలం పాటు కొనసాగినప్పుడు, అది ఊపిరితిత్తుల సామర్థ్యం తగ్గడానికి కారణమవుతుంది. అంటే, పల్మనరీ ఫైబ్రోసిస్ అభివృద్ధి చెందే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని అనేక వైద్య అధ్యయనాలు నిరూపించాయి. ఢిల్లీ, ఇతర పెద్ద నగరాలు మీకు ఏమీ తెలియదు. శీతాకాలం వచ్చినప్పుడు, ఢిల్లీ విపరీతమైన వాయు కాలుష్య ప్రదేశంగా మారుతుంది, అక్కడ పొగమంచు తప్ప మరేమీ ఉండవు. గాలి నాణ్యత సూచిక బాగా ఉన్న ఇతర పెద్ద నగరాలతో పోలిస్తే, ఢిల్లీ వాసులు అత్యంత తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్నారు. ముఖ్యంగా, వారి ఊపిరితిత్తుల వశ్యత దాదాపు 50% తగ్గిందని చెబుతారు. గాలి నాణ్యత లేకపోవడం వల్ల కలిగే సమస్యలు: సాధారణంగా, గాలి నాణ్యత నిరంతరం ప్రభావితమైనప్పుడు, మనం ఎదుర్కొనే మొదటి సమస్య చాలా స్పష్టంగా ఉంటుంది. సమస్య ఏమిటంటే శరీరం నిర్జలీకరణం చెందుతుంది మరియు చర్మం చాలా పొడిగా మారుతుంది. చర్మం పొరలుగా మారడం, పల్మనరీ ఫైబ్రోసిస్, సిఒపిడి, ఎంఫిసెమా, మొత్తం ఊపిరితిత్తుల పనితీరు బలహీనత, ఊపిరితిత్తుల స్థితిస్థాపకత కోల్పోవడం చాలా సాధారణం. తీసుకోవలసిన నివారణ చర్యలు: వాతావరణ మార్పు మానవ ఆరోగ్యంపై భారీ ప్రభావాన్ని చూపుతుంది. మనం దానిని నివారించాలనుకుంటే, దాని గురించి అవగాహన, విద్య, ముందు జాగ్రత్త చర్యలు, తగిన వైద్య సౌకర్యాలు, వాయు కాలుష్యం గురించి ప్రజలలో అవగాహన కల్పించడం చాలా ముఖ్యం. తీసుకోవలసిన నివారణ చర్యలు: వాతావరణ మార్పు మానవ ఆరోగ్యంపై భారీ ప్రభావాన్ని చూపుతుంది. మనం దానిని నివారించాలనుకుంటే, దాని గురించి అవగాహన, విద్య, ముందు జాగ్రత్త చర్యలు, తగిన వైద్య సౌకర్యాలు, వాయు కాలుష్యం గురించి ప్రజలలో అవగాహన కల్పించడం చాలా ముఖ్యం.

# విటమిన్ డి లోపాన్ని ఎలా పోగొట్టాలి?




కీళ్లే కాకుండా శరీరంలో అనేక రకాల సమస్యలు ఉంటాయి. విటమిన్ డి లేకపోవడం వల్ల శరీరం బలహీనత గురించి ఫిర్యాదు చేస్తుంది. వ్యక్తి మరింత అలసిపోయినట్లు అనిపిస్తుంది. శరీరం మెరుగైన రోగనిరోధక శక్తికి విటమిన్ డి చాలా ముఖ్యమైనది. శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడానికి రకరకాల విటమిన్లు అవసరం. కానీ తప్పుడు ఆహారపు అలవాట్ల వల్ల శరీరంలో విటమిన్ లోపం ఏర్పడుతుంది. ఈ రోజుల్లో విటమిన్ డి లోపానికి సంబంధించిన అనేక ఉదంతాలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. ఈ విటమిన్ లోపం వల్ల శరీరంలో కండరాలు, ఎముకల బలహీనతకు సంబంధించిన సమస్యలు వస్తాయి. దీని లోపం వల్ల జుట్టు రాలడంతోపాటు కొన్ని సందర్భాల్లో మానసిక సమస్యలు తలెత్తుతాయి. అటువంటి పరిస్థితిలో విటమిన్ డి లోపం లక్షణాలు, కారణాలు, నివారణ గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం. శరీరంలో విటమిన్ డి లోపం ఉంటే, అది కీళ్ల నొప్పుల సమస్యను కలిగిస్తుంది. . కీళ్లే కాకుండా శరీరంలో అనేక రకాల సమస్యలు ఉంటాయి. విటమిన్ డి లేకపోవడం వల్ల శరీరం బలహీనత గురించి ఫిర్యాదు చేస్తుంది. వ్యక్తి మరింత అలసిపోయినట్లు అనిపిస్తుంది. శరీరం మెరుగైన రోగనిరోధక శక్తికి విటమిన్ డి చాలా ముఖ్యమైనది. దాని లోపం వల్ల మనకు కూడా ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. ప్రస్తుత రోజుల్లో విటమిన్ డి లోపం పెద్ద సమస్య అని ఢిల్లీ సీనియర్ డాక్టర్ కవల్జిత్ సింగ్ చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో ఈ సమస్య ప్రతి రెండవ వ్యక్తిలో కనిపిస్తుంది. సూర్యరశ్మిని తీసుకోకపోవడం, ఆహారంపై శ్రద్ధ చూపకపోవడం వల్ల శరీరంలో విటమిన్ డి లోపం ఏర్పడుతుంది. ఈ విటమిన్ లోపం మొత్తం శరీరాన్ని ప్రభావితం చేస్తుంది. మంచి ఎముక, కీళ్ళు, జుట్టు, మానసిక ఆరోగ్యానికి విటమిన్ డి అవసరం. కానీ ఈరోజుల్లో తిండి, పానీయాల పట్ల శ్రద్ధ చూపడం లేదు. దీని కారణంగా, విటమిన్ డి లోపం ప్రారంభమవుతుంది. సాల్మన్, ట్యూనా, ఆరెంజ్ జ్యూస్, డైరీ, మొక్కల ఆధారిత పాలు, గుడ్డు సొనలు విటమిన్ల ఉత్తమ వనరులు అని డాక్టర్ కవల్జిత్ సింగ్ చెప్పారు. మీరు ఈ ఆహారాలను మీ ఆహారంలో చేర్చుకోవాలి. శరీరంలో విటమిన్ డి లోపం ఉంటే అప్పుడు వైద్యుడిని సంప్రదించండి. డైట్‌తో పాటు కొన్ని మందులు కూడా తీసుకోవాలని డాక్టర్ మీకు సలహా ఇస్తారు.

# కరివేపాకును ఏరి పారేస్తున్నారా!



భారతీయ వంటకాల్లో కేవలం సువాసన కోసం మాత్రమే వాడే కరివేపాకు వెనుక అద్భుతమైన ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయి. అమ్మమ్మల కాలం నాటి చిట్కాలకే పరిమితమైన ఈ ఆకులు, ఇప్పుడు ఆధునిక వైద్య శాస్త్ర పరిశోధనల్లోనూ తమ శక్తిని చాటుకుంటున్నాయి. కేవలం రుచిని పెంచడమే కాకుండా ప్రాణాంతక వ్యాధులను నివారించడంలో కరివేపాకు ఎంతగానో దోహదపడుతుందని శాస్త్రవేత్తలు ధృవీకరిస్తున్నారు. ప్రతి ఇంట్లో కరివేపాకు లేకుండా పోపు పూర్తి కాదు. అయితే చాలా మంది భోజనం చేసేటప్పుడు వీటిని ఏరి పక్కన పడేస్తుంటారు. కానీ ఈ చిన్న ఆకుల్లో ఉండే పోషక విలువలు తెలిస్తే, మీరు మళ్ళీ ఎన్నడూ అలా చేయరు. జీర్ణక్రియకు దివ్యౌషధం: కరివేపాకులో ఉండే జీర్ణ ఎంజైమ్‌లు ఉబ్బరాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా కరివేపాకును వేడి నూనెలో వేసినప్పుడు విడుదలయ్యే గిరినింబైన్ అనే సమ్మేళనం కడుపు పూతలను తగ్గిస్తుంది. ఇది పేగుల అంతర్గత పొరను రక్షిస్తూ, ఆహారం సులభంగా జీర్ణమయ్యేలా చేస్తుంది. బరువు తగ్గడం: కరివేపాకులోని మహానింబైన్ అనే సమ్మేళనం శరీరంలోని మెటబాలిజంను పెంచుతుంది. ఇది కొవ్వు పేరుకుపోవడాన్ని అరికట్టడమే కాకుండా ఆకలిని నియంత్రణలో ఉంచుతుంది. స్థూలకాయంతో బాధపడేవారు తమ ఆహారంలో కరివేపాకును చేర్చుకోవడం వల్ల సహజంగా బరువు తగ్గే అవకాశం ఉందని పరిశోధనలు చెబుతున్నాయి. డయాబెటిస్ నియంత్రణ: కరివేపాకులో ఉండే యాంటీ-హైపోగ్లైసీమిక్ లక్షణాలు రక్తంలో చక్కెర స్థాయిలను క్రమబద్ధీకరిస్తాయి. ఖాళీ కడుపుతో కరివేపాకు ఆకులను నమలడం లేదా వాటి సారం తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుంది. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఎంతో మేలు చేస్తుంది. శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు: నేటి కాలుష్య భరిత వాతావరణంలో మన శరీర కణాలు ఆక్సీకరణ ఒత్తిడికి గురవుతాయి. కరివేపాకులోని యాంటీఆక్సిడెంట్లు కణాలను రక్షించి, అంతర్గత అవయవాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది దీర్ఘకాలిక వ్యాధుల ముప్పును తగ్గిస్తుంది. జుట్టు పెరుగుదల – కుదుళ్ల బలం: కరివేపాకు జుట్టు ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తుందో అందరికీ తెలిసిందే.

ఇందులోని అమైనో ఆమ్లాలు, విటమిన్లు జుట్టు కుదుళ్లకు పోషణనిస్తాయి. జుట్టు రాలడాన్ని తగ్గించి, అకాల తెల్ల జుట్టును నివారిస్తుంది. తల చర్మంలో రక్త ప్రసరణను పెంచి జుట్టు వేగంగా పెరిగేలా చేస్తుంది. గుండె ఆరోగ్యం: కరివేపాకు సారం శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను దాదాపు 12శాతం వరకు తగ్గించగలదని అధ్యయనాలు వెల్లడించాయి. ఇందులోని ఫైబర్, బీటా-కెరోటిన్, విటమిన్-సి రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోకుండా చూస్తాయి. తద్వారా గుండె జబ్బుల ముప్పు తగ్గుతుంది.



నేటి జీవనశైలి వల్ల హై బీపీ సమస్య పెరుగుతోంది. ఈ సమస్యకు బీట్‌రూట్ రసం ఒక సహజసిద్ధమైన పరిష్కారం. బీట్‌రూట్‌లో ఉండే నైట్రేట్లు రక్తనాళాలను వెడల్పు చేసి, రక్త ప్రవాహాన్ని సులభతరం చేస్తాయి. రోజుకు 200-250 మి.లీ రసం తాగడం ద్వారా బీపీ అదుపులో ఉంటుందని శాస్త్రీయ అధ్యయనాలు తెలుపుతున్నాయి. నేటి ఉరుకుల పరుగుల జీవితం, మానసిక ఒత్తిడి, ఆహారపు అలవాట్లు సైలెంట్ కిల్లర్‌గా పిలిచే అధిక రక్తపోటును మన దరికి చేరుస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం.. దాదాపు 1.3 బిలియన్ల మంది ఈ సమస్యతో సతమతమవుతున్నారు. అయితే మన వంటగదిలో దొరికే బీట్‌రూట్ ఈ సమస్యకు సహజసిద్ధమైన

# హైబీపీకి చెక్ పెట్టే రెడ్ మ్యాజిక్

పరిష్కారమని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. బీట్‌రూట్ రసంలో నైట్రేట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోకి ప్రవేశించిన తర్వాత నైట్రిక్ ఆక్సైడ్ గా మారుతాయి. నైట్రిక్ ఆక్సైడ్ రక్తనాళాలను వెడల్పు చేసి, అవి సరళంగా మారేలా చేస్తుంది. దీనివల్ల రక్త ప్రవాహం సులభతరం అవుతుంది. ఫలితంగా రక్తనాళాలపై ఒత్తిడి తగ్గి బీపీ అదుపులోకి వస్తుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఈ రసం తాగిన 3 నుండి 4 గంటల్లోనే రక్తపోటు తగ్గడం ప్రారంభమవుతుంది. 2017లో జరిగిన ఒక విశ్లేషణ ప్రకారం.. బీట్‌రూట్ రసం క్రమం తప్పకుండా తాగడం వల్ల సిస్టోలిక్, డయాస్టొలిక్ రీడింగులు రెండూ తగ్గుతాయని తేలింది. అధ్యయనాల ప్రకారం.. రోజుకు 200 మి.లీ నుండి 250 మి.లీ బీట్‌రూట్ రసం తాగడం వల్ల ఉత్తమ ఫలితాలు కనిపిస్తాయి. ఈ స్వల్ప తగ్గుదల కూడా స్ట్రోక్, గుండెపోటు వచ్చే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. ఉప్పు ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరంలో నీటి నిల్వ పెరిగి రక్తనాళాలపై ఒత్తిడి పెరుగుతుంది. వ్యాయామం లేకపోవడం, ఊబకాయం, ప్రాసెస్ చేసిన ఆహారాలు. ధూమపానం, మద్యం సేవించడం వల్ల రక్తనాళాలు కుంచించుకుపోతాయి. జాగ్రత్తలూ అవసరమే బీట్‌రూట్ రసం ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ అందరికీ ఒకేలా సరిపడకపోవచ్చు. కిడ్నీ సమస్యలు: బీట్‌రూట్‌లో ఆక్సలేట్లు ఎక్కువగా ఉండటం వల్ల కిడ్నీలో రాళ్లు ఉన్నవారు వైద్యుల సలహా మేరకే తీసుకోవాలి. జీర్ణ సమస్యలు: ఖాళీ కడుపుతో తాగితే కొంతమందిలో ఉబ్బరం లేదా కడుపునొప్పి వచ్చే అవకాశం ఉంది. బీట్రియా: ఈ రసం తాగినప్పుడు మూత్రం లేదా మలం ఎరుపు రంగులోకి మారవచ్చు. ఇది హానికరం కాదు.. రసం ఆపగానే తగ్గిపోతుంది. బీట్‌రూట్ రసంతో పాటు ఉప్పు తగ్గించడం, పొటాషియం ఎక్కువగా ఉండే అరటిపండ్లు వంటివి తీసుకోవడం, రోజుకు 30 నిమిషాల వ్యాయామం చేయడం వల్ల రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చు. ఏదైనా మార్పులు చేసే ముందు మీ వైద్యుడిని సంప్రదించడం మర్చిపోవద్దు.

# బ్రోకలీ రోజూ తింటే ఏమవుతుంది?



బ్రోకలీ పోషకాల పవర్‌హౌస్. యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉన్న ఈ కూరగాయ క్యాన్సర్‌ను నివారించి, కాలేయాన్ని రక్షిస్తుంది. ఎముకలను బలోపేతం చేసి, రోగనిరోధక శక్తిని పెంచుతుంది. జీర్ణక్రియను మెరుగుపరచి, మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యానికి తోడ్పడి, రక్తపోటును నియంత్రిస్తుంది. బ్రోకలీ సంపూర్ణ ఆరోగ్యానికి కీలకమైన ఆహారం. చూసేందుకు కాలీఫ్లవర్ లాగా కనిపించే బ్రోకలీ పోషకాల పవర్ హౌస్. ఆకుపచ్చ కూరగాయలో ఒకటైన బ్రోకలీ మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. బ్రోకలీలో యాంటీఆక్సిడెంట్లు, ఖనిజాలు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యంతో పాటు అందానికి కూడా అనేక విధాలుగా ప్రయోజనం చేకూరుస్తాయి. బ్రోకలీలో యాంటీ ఆక్సిడెంట్లు మెండుగా ఉంటాయి. ముఖ్యంగా ఇందులో ఉంటే సల్ఫోరఫేన్ అనే సమ్మేళనం ఫ్రీ రాడికల్స్ వల్ల శరీర కణాలు డ్యామేజ్ కాకుండా కాపాడుతుంది. తద్వారా క్యాన్సర్ వంటి మహమ్మారి రాకుండా అడ్డుకోవచ్చు.బ్రోకలీలో గ్లుకోసినోలేట్స్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి శరీరంలోని విషపదార్థాలను బయటకు పంపడంలో సహాయపడతాయి. తద్వారా కాలేయంపై ఒత్తిడి తగ్గుతుంది. లివర్ ఆరోగ్యంగా ఉంటుంది. బ్రోకలీలో కాల్షియం, విటమిన్ కె వంటి పోషకాలు ఉంటాయి. ఇవి ఎముకలకు కావాల్సినంత బలం అందిస్తాయి. తద్వారా వయసు పెరిగినా ఎముకలు బలంగా ఉంటాయి. బ్రోకలీలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. తద్వారా అనేక రకాల ఇన్ఫెక్షన్లకు దూరంగా ఉండొచ్చు. బ్రోకలీలో డైటరీ ఫైబర్ మెండుగా

ఉంటుంది. ఇది పేగులను ఆరోగ్యంగా ఉంచి మలబద్ధకం ఏర్పడకుండా కాపాడుతుంది. అలాగే కడుపు ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యల నుంచి ఉపశమనం కల్పిస్తుంది. అయితే పచ్చిగా తింటే మాత్రం జీర్ణ సమస్యలు వస్తాయి. బ్రోకలీలో పొటాషియం, ఫైబర్, ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్ వంటి గుండెకు మేలు చేసే పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి రక్తపోటు అదుపులో ఉంచి హృదయ సంబంధ సమస్యలు రాకుండా కాపాడుతాయి.

# ప్రపంచ కప్ సమయానికి నేను ఫామ్ అందుకుంటాను



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ కప్ నాటికి తాను ఫామ్ అందుకుంటానని టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ధీమా వ్యక్తం చేశాడు. వచ్చే నెల 11 నుంచి న్యూజిలాండ్‌తో భారత్ ఐదు టీ20ల సిరీస్‌లో తలపడనుంది. ఈ విరామ సమయంలో తాను ఫామ్ అందుకోవడంపై దృష్టి సారిస్తానని సూర్యకుమార్ తెలిపాడు. ఇటీవల సూర్యకుమార్ టీ20ల్లో నిరాశపరిచాడు. ఈ ఏడాది అతడు 19 ఇన్నింగ్స్‌లలో 218 పరుగులు మాత్రమే చేశాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో కూడా 34 పరుగులే చేశాడు. మరో రెండు మూడు నెలల్లోనే టీ20 ప్రపంచకప్ ఉండటంతో సూర్యకుమార్ ఫామ్‌లో లేకపోవడం అభిమానులను ఆందోళనకు గురి చేస్తోంది. ఈ నేపథ్యంలో సూర్యకుమార్ మాట్లాడుతూ, ప్రపంచకప్ ముంగిట ఫామ్ అందుకుంటానని అన్నాడు. కొంతకాలంగా తాను ఫామ్‌లో లేనని అంగీకరించాడు. ప్రతి ఒక్కరు తమ కెరీర్‌లో ఇలాంటి దశను ఎదుర్కొని ఉంటారని భావిస్తున్నానని, దీనిని తాను కూడా అధిగమిస్తానని వ్యాఖ్యానించాడు. ఎక్కడ తప్పు జరుగుతోంది, ఏం చేయాలనే విషయం తనకు తెలుసని అన్నాడు. దానిపై పనిచేయడానికి తనకు కొంత సమయం దొరికిందని తెలిపాడు.

# అండర్-19 ఆసియా కప్ ఫైనల్... పాక్ బౌలర్‌కు షూ చూపించి బదులిచ్చిన వైభవ్!

**అండర్-19 ఆసియా కప్ ఫైనల్‌లో వాడీవేడి క్షణాలు**

**వైభవ్ ను స్లెడ్జింగ్ చేసిన పాక్ బౌలర్**

**షూ చూపిస్తూ బదులిచ్చిన వైభవ్**

**హైదరాబాద్ పెన్ పవర్:** అండర్-19 ఆసియా కప్ ఫైనల్‌లో భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన మ్యాచ్‌లో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. పాకిస్థాన్ పేసర్ అలీ రజా రెచ్చగొట్టేలా ప్రవర్తించడంతో, భారత యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ తన షూ వైపు చూపిస్తూ గట్టిగా బదులిచ్చాడు. ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ 191 పరుగుల భారీ తేడాతో భారత్‌పై గెలిచి టైటిల్ కైవసం చేసుకుంది. దుబాయ్‌లోని ఐసీసీ అకాడమీ గ్రౌండ్‌లో డిసెంబర్ 21న జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్, సమీర్ మిన్హాస్ అద్భుత సెంచరీతో (113 బంతుల్లో 172) చెలరేగడంతో 8 వికెట్ల నష్టానికి 347 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత బౌలర్లలో దీపేశ్ దేవేంద్రన్ 3, ఖిలన్ పటేల్ 2 వికెట్లు తీశారు. భారీ లక్ష్య ఛేదనలో, 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 10 బంతుల్లో 3 సిక్సర్లు, 1 ఫోర్‌తో 26 పరుగులు చేశాడు. అయితే, అలీ రజా బౌలింగ్‌లో కీపర్‌కు క్యాచ్ ఇచ్చి నాలుగో ఓవర్‌లో వెనుదిరిగాడు. వైభవ్ అవుటైన తర్వాత అలీ రజా దూకుడుగా ప్రవర్తిస్తూ అతడిని స్లెడ్జింగ్ చేశాడు. దీనికి ఏమాత్రం వెనక్కి తగ్గని వైభవ్, తన షూ వైపు సైగ చేస్తూ ఘాటుగా స్పందించాడు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. అనంతరం భారత బ్యాటింగ్ లైనప్ పాక్ బౌలర్ల ధాటికి కుప్పకూలింది. 26.2 ఓవర్లలో 156 పరుగులకే ఆలౌట్ అయింది. అలీ రజా 4 వికెట్లతో చెలరేగాడు. సమీర్ మిన్హాస్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు లభించాయి. పాకిస్థాన్‌కు ఇది రెండో అండర్-19 ఆసియా కప్ టైటిల్.





# భారత జట్టు యాజమాన్యం పై ప్రశంసలు కురిపించిన హర్భజన్ సింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ కోసం భారత జట్టులో చేసిన మార్పులపై మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ ప్రశంసలు కురిపించాడు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీకి, జట్టు యాజమాన్యానికి 10కి 10 మార్కులు ఇచ్చాడు. రింకూ సింగ్, ఇషాన్ కిషన్‌లను తిరిగి జట్టులోకి తీసుకోవడం, అక్షర్ పటేల్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించడం సరైన నిర్ణయాలని కొనియాడాడు. హర్భజన్ మాట్లాడుతూ... "సెలక్షన్ కమిటీకి నేను 10కి 10 మార్కులు ఇస్తాను. శుభ్‌మన్ గిల్‌ను తప్పించడం కఠినమైన నిర్ణయమే అయినా, టీ20లలో అతడి కెరీర్ ముగిసిపోలేదు. జట్టు సమతూకానికే వారు ప్రాధాన్యత ఇచ్చారు. రింకూ సింగ్, ఇషాన్ కిషన్ జట్టులోకి రావడం చాలా సంతోషంగా ఉంది. ఇషాన్ మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఓపెనర్‌గా వచ్చి వికెట్ కీపింగ్ చేయగల సత్తా ఉన్న ఆటగాడు అవసరం కాబట్టే ఈ మార్పులు చేశారు. ఇది చాలా మంచి నిర్ణయం" అని భజ్జీ విశ్లేషించాడు.

# యాషెస్ ఓటమి చాలా బాధిస్తోంది



**హైదరాబాద్ పెన్ పవర్:** యాషెస్ 2025-26 సిరీస్‌ను ఆస్ట్రేలియా 3-0 తేడాతో కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. అడిలైడ్‌లో జరిగిన మూడో టెస్టులో ఇంగ్లాండ్‌పై 82 పరుగుల తేడాతో ఆసీస్ ఘన విజయం సాధించింది. దీంతో మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే సిరీస్‌ను సొంతం చేసుకుంది. 11 రోజుల్లోనే సిరీస్ తేలిపోవడం గమనార్హం. తమ ఓటమిపై ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ స్పందించాడు. ఈ సిరీస్ ఓటమి చాలా బాధ కలిగిస్తోందన్నాడు. ఈ ఓటమిని ఒప్పుకోవడం కూడా కష్టంగా ఉందని చెప్పాడు. అయితే మిగతా రెండు టెస్టుల్లో కచ్చింతగా నిలకడగా రాణిస్తామన్నాడు. యాషెస్ సిరీస్‌ను ఎలాగైనా కాపాడుకోవాలనే లక్ష్యంతోనే అడిలైడ్‌లో అడుగుపెట్టామని బెన్ స్టోక్స్ అన్నాడు. కానీ తమ కల చెదిరిపోయిందని.. ఈ ఓటమి జట్టులోని ప్రతి ఒక్కరిని చాలా బాధకు గురి చేస్తోందన్నాడు. అందరూ చాలా భావోద్వేగానికి గురవుతున్నారని చెప్పాడు. అయితే దీనిపై ఆస్ట్రేలియాకు కచ్చితంగా క్రెడిట్ ఇవ్వాల్సిందేనన్న స్టోక్స్.. గెలుపు అనేది మూడు విభాగాల్లో రాణించడంపై ఆధారపడి ఉంటుందని తెలిపాడు. ఈ మ్యాచ్‌లో ఆసీస్ తమ కంటే మెరుగైన ప్రదర్శన చేసిందని.. వారు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ మూడింటిలోనూ ఇంగ్లాండ్ జట్టుపై పైచేయి సాధించారని చెప్పాడు. "నాలుగో ఇన్నింగ్స్‌లో మా ముందు భారీ టార్గెట్ ఉంది. అయినా మేము చివరి వరకు పోరాడాం. విల్ జాక్స్, జెమీ స్మిత్ రాణించారు. మంచి పార్టనర్‌షిప్ నెలకొల్పారు. టాస్ ఓడినప్పటికీ.. ఆస్ట్రేలియాను మొదటి ఇన్నింగ్స్‌లో ఓ మోస్తరు స్కోర్‌కే కట్టడి చేయగలిగాం. మేము భారీ స్కోర్ చేయడంలో విఫలమయ్యాం. రెండో ఇన్నింగ్స్‌లో కూడా కేవలం 60 పరుగులకే 6 వికెట్లు పడగొట్టాము. మాకు చాలా సానుకూల అంశాలు ఉన్నాయి. ముఖ్యంగా ఇంగ్లాండ్ లోయర్ ఆర్డర్ బ్యాటర్లు చూపిన పోరాటపటిమ అద్భుతం. నేను ఆశించిన పట్టుదల వారిలో కనిపించింది" అని బెన్ స్టోక్స్ చెప్పాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా మొదటి ఇన్నింగ్స్‌లో 371 పరుగులు చేశారు. అలెక్స్ కేరీ (106) అద్భుత సెంచరీ చేశాడు. ఖవాజా (82) రాణించారు. జోఫ్రా ఆర్చర్ 5, విల్ జాక్స్ 2, బ్రైడన్ కార్స్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. జోష్ టంగ్ ఒక వికెట్ తీశాడు. అనంతరం తమ మొదటి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 286 పరుగులు చేసింది. బెన్ డకెట్ (29), హ్యారీ బ్రూక్ (45), బెన్ స్టోక్స్ (83), జోఫ్రా ఆర్చర్ (53) రాణించారు. అయితే రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్‌ను ఇంగ్లాండ్ కట్టడి చేయలేకపోయింది. దీంతో 415 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన ఇంగ్లాండ్.. 352 పరుగులకే కుప్పకూలింది. దీంతో సిరీస్ ఆస్ట్రేలియా కైవసం చేసుకుంది.

# క్రికెటర్లు అవ్వాలనుకున్నారు..కానీ హీరోలయ్యారు!







అక్కినేని అఖిల్ కి చిన్ననాటి నుంచి క్రికెట్ అంటే ఆసక్తి. దీంతో పెద్ద క్రికెటర్ అవ్వాలనుకున్నాడు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనుకున్నాడు. దేశానికి తానో గొప్ప బ్యాట్స్ మెన్ గా ప్రూవ్ చేసుకోవాల నుకున్నాడు. ఈ విషయంలో డాడ్ నాగార్జున కూడా ఎంతో ఎంకరేజ్ చేసారు. తనయుడి క్రికెట్ ఫ్యాషన్ ని చిన్న వయసులోనే గమనించిన అకిల్ ని స్పోర్ట్స్ స్కూల్లో జాయిన్ చేసారు. ఆటలో మంచి ప్రావీణ్యం కూడా సంపాదించాడు. కానీ జాతీయ జట్టులో స్థానమంటే అంత సులభం కాదు. ఎంతో కాంపిటీషన్ ఎదుర్కోవాల్సి ఉంటుంది. అఖిల్ సమయంలో ఆటతో పాటు రాజకీయాలు కూడా క్రికెట్ లో కీలక పాత్ర పోషించేవి. అలా అఖిల్ క్రికెట్ కు దూరమయ్యాడు. అనంతరం నటనా రంగం వైపు రావడం సక్సెస్ అవ్వడం తెలిసిందే. అలాగే శ్రీకాంత్ కూడా తన పెద్ద కుమారుడు రోషన్ ని క్రికెటర్ ని చేయాలనుకున్నాడు. కానీ అతడి కల కలగానే మిగిలిపోయింది. రోషన్ కూడా కొన్నాళ్ల పాటు క్రికెట్ ఆడాడు. కానీ అంతిమంగా తండ్రి మార్గంలో సినిమానే ఎంచుకున్నాడు. కాలేజీకి వెళ్లిన తర్వాత రోషన్ కాన్సంట్రేషన్ కూడా తగ్గింది. అక్కడ నుంచి రోషన్ మనసు సినిమాలు కోరుకుంది.

దీంతో చిన్న నాటి కల క్రికెట్ ను వదిలేసి మ్యాకప్ వేసుకున్నాడు. శ్రీకాంత్ కూడా నటుడు కావడంతో? రోషన్ కి సినిమాల్లోకి రావడం ఈజీ అయింది. అలాగే విజయ్ దేవరకొండ కూడా క్రికెటర్ అవ్వాలనుకున్నాడు. ఈ మధ్యనే విషయం లీకైంది. ఓ క్రికెట్ స్టేడియం వేదికగా ఈ సీక్రెట్ రివీల్ చేసాడు. అప్పటి తన పరిస్థితుల కారణంగా బ్యాట్స్ మెన్ కాలేకపోయినా? టాలీవుడ్ లో పెద్ద స్టార్ మాత్రం అయ్యాడు. ఇలా నటుడు అవ్వడం కోసం కూడా విజయ్ ఎంతో కష్టపడ్డాడు. పరిశ్రమలో ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా వచ్చి ప్రయత్నాలు చేసి సక్సెస్ అయ్యాడు.

సీనియర్ హీరోల్లో విక్టరీ వెంకటేష్ కూడా క్రికెటర్ అవ్వాలనుకున్నాడు. కానీ నటుడయ్యాడు. కానీ క్రికెట్ పై అభిమానంతో ఇప్పటికీ ఇండియా ఆడే ఏ మ్యాచ్ ను మిస్ అవ్వరు. ప్రపంచంలో ఎక్కడ మ్యాచులు జరిగినా ఆ దేశం వెళ్లి ఇండియాను ఎంకరేజ్ చేయడం ఆయన ప్రత్యేకత. అదే ఫ్యాషన్ తో అప్పట్లో వసంతం అనే సినిమా కూడా చేసారు. ఆ సినిమా మంచి విజయం సాధించింది. కాలక్రమంలో సెలబ్రిటీ క్రికెట్ లీగ్ ఏర్పడట ంతో? ఆ ఫ్యాషన్ ని ఆ రూపంలో తీర్చు కుంటున్నా రు. ప్రస్తుతం అఖిల్, రోషన్ సెలబ్రిటీ క్రికెట్ లీగ్ లో కొనసాగుతోన్న సంగతి తెలిసిందే.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965